# మహాభారతగాథలు - మహిళలు

రచయిత్రి

డా॥ పి.సుమతీనరేంద్ర

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

2024

**MAHABHARATHAGATHALU - MAHILALU**

*by*
**Dr. P.Sumathinarendra**

*Editor*
**Dr. Akella Vibhishana sarma**
Special officer,
Publications Division

T.T.D. Religious Publication Series No. 1497
© All Rights Reserved

*First Print:* 2024

*Copies:* 500

*Published by :*
**J.SYAMALA RAO,** I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

*D.T.P:*
Publications Division,
T.T.D, Tirupati.

*Printed at :*
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati.

# ముందుమాట

భారతీయ సంస్కృతి అవగాహనకు శ్రీమద్రామాయణ, మహాభారత ఇతిహాసాలు కరదీపికల్లాంటివి. సామాజికంగా మార్పులెన్నో వచ్చినా నాటికీ, నేటికి అన్ని వర్గాలవారికి ఈ ఇతిహాసాలు మార్గదర్శకాలు. శ్రీమద్రామాయణంలో కంటె మహాభారతంలో రకరకాల కుటుంబాల చిత్రణలున్నాయి.

మానవుల జీవితంలో కౌటుంబిక జీవితం, ఔద్యోగిక జీవితం, సామాజిక జీవితం, ఆధ్యాత్మిక జీవిత దశలున్నాయి. వీటిలో కౌటుంబిక జీవితం ప్రధానమైంది. ఈ జీవితంలో తల్లిగా, అక్కగా, చెల్లిగా, కుమార్తెగా, భార్యగా సహచరిగా మహిళకు ఎనలేని ప్రాధాన్యం ఉంది. ఇలాంటి మహిళల ప్రాధాన్యాన్ని మహాకవులు ఏనాడో గుర్తించి రచనలు చేశారు. మహాభారతాన్ని వివిధ కోణాలలో పరిశీలించినవారు మహిళా ప్రాధాన్యం గురించి ప్రత్యేకంగా తగిన రీతుల్లో అధ్యయనం చేయలేదని కొందరి అభిప్రాయం. ఈ అంశానికి తగినట్లు తి.తి.దే. ప్రాచీన సాహిత్యంలోని మహిళలకు సంబంధించి నిష్ణాతులయినవారిచే రచనలు చేయించింది. అందులో భాగమే డా॥ సుమతీనరేంద్రగారి "మహాభారతగాథలు–మహిళలు".

మహాభారతంలోని మహిళలందరు ఒకే రకం మనస్తత్వం కలవారు కారు. పెళ్ళి చేసుకోవడానికి ముందే ఆంక్షలు పెట్టింది 'గంగ'. తన వంశం వర్ధిల్లాలని కారణాంతరాలవల్ల విధవలైన తన కోడండ్లకు పునఃసంతానభాగ్యం కలగడానికి తానే ముందు నిలబడింది సత్యవతి. ఐదుగురు భర్తలకు భార్యయైనా, వరపుత్రియైనా, అడుగడుగున అవమానాలు ఎదుర్కొంటూ తన పతులతోనే జీవితం సాగించిన

నారీశిరోమణి ద్రౌపది. శ్రీకృష్ణుడంతటివాడు అన్న అయినా, తాను కోరుకొన్న అర్జునుని వివాహమాడి, సాంసారికజీవితం అంతంతమాత్రం గడుపుతూ చివరకు కుమారుడు అభిమన్యువు వీరోచిత సమరంలో పుత్రశోకానికి గురి అయిన మహిళ సుభద్ర. ఎన్నో వైవిధ్యాలతో కూడిన మహిళలు మహాభారతంలో కనిపిస్తారు.

ఇలాంటి మహిళలకు సంబంధించి సామాన్య పాఠకులకు తగినట్లు రచనచేసిన డా॥సుమతీనరేంద్ర గారికి హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ గ్రంథాన్ని పరిశీలించి స్వీయప్రచురణగా ఎంపికచేసి ముద్రాపింప జేయడంలో కృషిచేసిన ప్రత్యేకాధికారి డా॥ ఆకెళ్ళ విభీషణశర్మగారికి అభినందనలు.

సదా శ్రీవారిసేవలో...

**కార్యనిర్వహణాధికారి,**

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

# ఆముఖం

**నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్**
**దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్**

మహాభారతం వ్యాసునిచేత రచింపబడినప్పుడు దాని పేరు 'జయం'. మూడు దశలుగా అది విస్తృతి చెంది వివిధ ధర్మోపదేశాలను, ఉపాఖ్యానాలను కలుపుకొని లక్షశ్లోకాల మహాభారతంగా రూపుదిద్దు కొంది. ఈ మహేతిహాసాన్ని తెలుగులోకి తీసుకొని వచ్చే ప్రయత్నం ఆదికవి నన్నయ ప్రారంభించాడు. తరువాత తిక్కన, ఎఱ్ఱన కొద్దికాలం తర్వాత కొనసాగించారు. ఈ ముగ్గురు మహాకవులు కాలానుగుణంగా ఆంధ్రమహాభారతాన్ని వినిర్మించారు. వీరినే మనం కవిత్రయం అని పిలుచుకొంటాం.

మహాభారతం ప్రశస్తి ఎటువంటిది అంటే –

**"ధర్మే చార్థే చ కామే చ మోక్షే చ భరతర్షభ**
**యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్ క్వచిత్"**

భారతంలో ఉండేదే ఎక్కడైనా ఉంటుంది. భారతంలో లేనిది ఎక్కడా ఉండదు అని తాత్పర్యం. ధర్మార్థకామమోక్షాలలో ఏ ధర్మసూక్ష్మం కావాలన్నా అది భారతంలో దొరుకుతుంది. అంతమాత్రమే కాదు పాత్రల విషయాన్ని పరికించినట్లైతే భారతంలో అన్ని రకాల పాత్రలు మనకు కనిపిస్తాయి. లోకంలో ఎన్ని రీతుల స్వభావాలు మనకు తారసపడతాయో అన్నివిధాల స్వభావాలు ఆ యా పాత్రలలో దర్శనమిస్తాయి. ఇంతకంటే మరో విధంగా మనుష్యులు ఉంటారనడానికి వీలులేదు.

ముఖ్యంగా స్త్రీ పాత్రలను బట్టి చూడడం ప్రస్తుత గ్రంథోద్దేశం. లోకంలో ఒక అపోహ ఉంది. ఆనాటి స్త్రీలు స్వతంత్ర ప్రతిపత్తి లేని వాళ్ళనీ, వాళ్లకంటూ ఒక ఆదర్శం కాని, అభిప్రాయం కానీ ఉండేవి కావు అని. అది తప్పు. భారతంలోని స్త్రీ పాత్రల కథలను ప్రత్యేకంగా

చదువుతుంటే వారి వ్యక్తిత్వాలు ఎంత ఉన్నతమైనవో, వారి అభిప్రాయాలు ఎంత నిశితమైనవో మనకు బోధపడుతుంది. ఎన్నోసార్లు మహాభారతం చదివినా ప్రత్యేకంగా స్త్రీ పాత్రలను గూర్చి అధ్యయనం చేయకపోతే ఆ విషయం తెలియదు అనే ఉద్దేశంతో స్త్రీల కథలను మాత్రమే ఎన్నుకొని అందరికీ అర్థమయ్యే భాషలో ఒక్కచోట గుదిగ్రుచ్చమని నన్ను ఆదేశించారు టిటిడి పుస్తక ప్రచురణ విభాగం వారు. ఇది నాకు దక్కిన అపూర్వ అవకాశం. నాకు చేతనైనంత మేరకు ఆ ప్రయత్నం చేశాను. లోటుపాట్లు ఉన్నట్లైతే మన్నించమని పాఠకలోకాన్ని కోరుతున్నాను.

తింటే గారెలు తినాలి వింటే భారతం వినాలి అనే నానుడి తెలుగు భారతానికి సంబంధించిందే. అందుచేతనే ఎంతమంది ఎన్ని రకాలుగా విశ్లేషించినా, ఎన్ని ఉత్తమ గ్రంథాలను వెలయించినా ఇంకా ఇంకా వినాలనీ, తెలుసుకోవాలనీ తెలుగువారు కోరుకుంటూ ఉంటారు. వారి ఆకాంక్షకు కొంతవరకైనా ఈ రచన న్యాయం చేస్తే అంతకంటే కోరదగింది ఏమీలేదు నాకు.

నాకు ఈ అవకాశాన్ని కల్పించిన మాన్యులు విభీషణ శర్మగారికి, డా.నరసింహాచారిగారికి నా హృదయ పూర్వక ధన్యవాదాలు. ఈ రచనకు పూనుకున్న సందర్భంగా ఇదివరకు వచ్చిన అనేక భారతసంబంధ గ్రంథాలను పరిశీలించాను. ఆ యా గ్రంథ రచయితలకు కృతజ్ఞతలు. గ్రంథరచనలో తోడ్పాటు అందించిన ప్రత్యక్ష, పరోక్ష వ్యక్తులకు నా నమస్సులు. పెద్దలకు వందనాలు, పిన్నలకు ఆశీర్వాదాలు.

'కలౌ వేంకటనాయకః' అని ఎల్లవేళలా ఆ వేంకటేశ్వరుని స్మరించుకుంటూ ఉంటాను. అందుకు ఫలితంగానే ఈ అవకాశం నాకు లభించిందని విశ్వసిస్తున్నాను. "నా నేర్చిన భంగి రచయించి వరణీయుడ నయ్యెద భక్తకోటికిన్'' అన్నాడు మహాకవి తిక్కన. నేను సైతం ఆమార్గంలోనే నడుస్తూ నానేర్చినభంగి ఈ చిరుపొత్తాన్ని గుదిగ్రుచ్చి ఆ వేంకటేశ్వరుని శ్రీచరణాల ముందుంచుతున్నాను. ఎవరికైనా ఈ స్త్రీల కథలు స్ఫూర్తిదాయకంగా నిలిస్తే నా కృషి ధన్యమైనట్లే!

# ప్రస్తావన

భారతంలో కనిపించే మహిళల కథలు వ్రాయడం ఈ రచనోద్దేశం. ప్రపంచసాహిత్యంలోనే అత్యంత ఉత్కృష్టమైన భారతేతిహాసం కవిత్రయం చేతుల్లో మహాకావ్యంగా రూపుదిద్దుకొన్నది. సంస్కృతభారతం కావ్య ఛాయలు కలిగిన శాస్త్రం అని ఆనందవర్ధనాచార్యుల నిష్కర్షకాగా ఆంధ్రమహాభారతం శాస్త్రఛాయలుగల మహాకావ్యంగా రూపుదిద్దుకొంది. దేశభాషలెన్నిటిలో మహాభారతం రచింపబడినప్పటికీ కవిత్రయ భారతానికి ఉన్న ప్రాశస్త్యం అసమానం. దీనికి ప్రధాన కారణం నన్నయ, తిక్కన, ఎఱ్ఱన ప్రతిభాపాటవాలు. మరోకారణం వారు మహాభారతకథనుగాని పాత్రలను గాని ఏ మాత్రం అన్యథాకరించకపోవడం. కాలానుగుణంగా వారు సంగ్రహించింది వర్ణనలను, ఉపదేశాలను, పునరుక్తులను ఏకత్రం చేయడం మాత్రమే.

స్త్రీల విషయాన్ని చూచినట్లైతే అప్పటివారికి శాస్త్రపరిజ్ఞానం ఉండేదనీ, దాన్ని అవసరమైన సందర్భాలలో ప్రకటించే స్వేచ్ఛ ఉండేదనీ అర్థం అవుతుంది. మధ్యయుగంలో స్త్రీల ప్రాధాన్యాలు పూర్తిగా తగ్గిపోయి నట్లనిపిస్తుంది. భారతంలో అనేక ఉపాఖ్యానాలు కూడా ఉండడం చేత వివిధ మనస్తత్వాలను అధ్యయనం చేసే అవకాశం ఉంది. ఉదాహరణకు కుంతి, ద్రౌపది కథలను తీసుకొన్నట్లైతే వారు పడిన కష్టాలు లోకంలో ఎవరికీ రానివి, రాకూడనివి. అయితే ఆ సందర్భాలలో వారు ప్రదర్శించిన ధైర్యస్థైర్యాలు అద్భుతం, ఆదర్శప్రాయం అని నొక్కివక్కాణించదగినవి.

ఉపాఖ్యానాల విషయంలో గమనించి చూచినట్లైతే ఏ కథ ఆ కథనే ప్రత్యేకమైన నడక కలిగింది. శకుంతల దుష్యంతుని నిండుసభలో సత్యంయొక్క గొప్పతనాన్ని ప్రకటిస్తూ నీవు అసత్యమాడుతున్నావు. నీవే

సత్యదూరుడవైతే నీ ప్రజలు ఏమౌతారు అని నిలదీస్తుంది. దమయంతి బుద్ధికుశలత అనుపమానం. తన్ను విడిచిపెట్టిపోయిన నలుడిని తన వద్దకు రప్పించుకొంటుంది. దాని కోసం పునఃస్వయంవరం చాటింప జేస్తుంది తండ్రి చేత. ఇది మునుపెన్నడూ లేనిది. సావిత్రికథ లోక ప్రసిద్ధం. ధర్మదేవతనే అనుసరించి తన పతిప్రాణాలను తిరిగిపొందుతుంది. శర్మిష్ఠ, దేవయాని ఒకే కుదురులో విరిసిన రెండు పువ్వుల వంటివారు. మిత్రులుగా పెరిగి సపత్నులైనవారు. వారివారి స్వభావాలకు అనుగుణంగా ఫలితాలు పొందినవారు. జాత్యహంకారానికి దేవయాని ప్రతినిధి అయితే సహనశీలానికి శర్మిష్ఠ ప్రతినిధి. కద్రూవినతలు సపత్నీమాత్సర్యంతో పంతాలకు పోయి నష్టాలను కొనితెచ్చుకున్నవారు. ఈ పాత్రలలో దేనికదే ప్రత్యేకమైన ప్రతిపత్తి కలిగి ఉండడం విశేషం!

భారతరచనాకాలానికి వర్తమానకాలానికి దాదాపు ఐదువేల సంవత్సరాల అంతరం ఉంది. ప్రస్తుతం మనకున్న ఆచారాలు, సంప్రదాయాలు అప్పుడు మరొకరకంగా ఉండి ఉంటాయి. శాస్త్రవిజ్ఞాన విషయంలో కూడా ఎంతో భేదం కనిపిస్తుంది. కాని మానవుల స్వభావంలో, వ్యక్తిగతరాగద్వేషాలలో పెద్దగా మార్పు కనిపించదు. ఉదాహరణకు కద్రూవినతలు ఒకరికి మరొకరు దాసి కావాలనుకొని పందెం వేసుకోవడం సపత్నీమాత్సర్యానికి ఆద్యమూకాదు అంతమూ కాదు. అదే విధంగా పురుషుడు బహుభార్యాత్వం కలిగి ఉండేవాడు. అది ఏమాత్రం తప్పు కాదు ఆ రోజులలో కాని స్త్రీకి బహుభర్తృత్వం నిషేధం. ద్రౌపది అనుభవించిన అవమానానికి అది మూలం. అదే మహాసంగ్రామానికి బీజావాపనం అయింది కూడా.

పిండాలను తైలంలో భద్రపరచడం, ఆ పిండాల నుండి బిడ్డలు పుట్టడం దుర్యోధనాదుల జననంలో చూస్తాం. సైన్సు అంత అభివృద్ధి

చెందిందా లేక వ్యాసుడు భవిష్యత్తులో జరుగబోయే శాస్త్రపురోగతిని అప్పుడే ఊహించాడా అనేది ప్రశ్నార్థకం. కన్యగా ఉన్నప్పుడు బిడ్డకు జన్మనిస్తే లోకాపవాదభీతి ఉండేదని రాచకన్య అయిన కుంతి అందుచేతనే కర్ణుడిని నీటిపాలు చేసిందని అర్థమౌతుంది. నియోగపద్ధతిలో బిడ్డలను కనడం ఆ కాలంలో క్షమార్హమే. వంశాన్ని కొనసాగించడం కోసం సత్యవతి వ్యాసుడిని కోరుతుంది. పాండురాజు కుంతికి, మాద్రికి అనుజ్ఞ ఇస్తాడు. 'మావిచ్ఛేత్ ప్రజాతంతు' అని అప్పటి సిద్ధాంతం. వివాహానికి పూర్వమే స్త్రీ పురుషులు పరస్పర అనురాగబద్ధులై ఉండేవారని నల దమయంతుల కథలో విదితమౌతుంది. స్త్రీని వివాహం కాక పూర్వమే గాంధర్వవిధిని తెలియజేసి ప్రజామోదం లభించదనే భయంతో పుత్రవతి అయినపిమ్మట ఆమెను తానెరుగనని చెప్పడం దారుణం. ఆ పని దుష్యంతుడు చేశాడు. అయినా షట్చక్రవర్తులలో ఒకడయ్యాడు. ఆ పుత్రుడే భరతుడు. అతడి వారసులే భారతీయులు. కలిమిలో భార్యతో కూడి ఉండి లేమిలో ఆమెను నట్టడవిలో క్రూరమృగాల మధ్య, ఆట వికులమధ్య అర్ధరాత్రి వదలివేసిన నలుడు అప్పుడూ ఉన్నాడు. నలుని వారసులనదగినవారం ఇప్పుడూ ఉన్నారు. జూదం ఆడి భార్యను పణంగా పెట్టిన ధర్మరాజు అచ్చంగా నలుని మించినవాడు. తమ్ములను ఓడిన ఘనత కూడా ఆ ధర్మరాజుదే. ఇవి ఇప్పటికీ జరుగుతున్న ఉదంతాలు. మనుష్యులు పెద్దగా మారలేదు అన్నది అందుచేతనే. వివాహం చేసుకోకపోయినా బిడ్డను కనాలనుకుంది హిడింబ భీముని చూచినప్పుడు. కుంతి, ధర్మరాజు అనుమతించారు. మనదేశంలోనే ఇట్టి ఉదంతం జరిగింది. మారణాయుధాలను ఉపయోగించడం అప్పటికే నేర్చుకొన్నాడు మానవుడు. భారతంలో కురుపాండవులు ప్రయోగించిన వన్నీ మారణాయుధాలే. అర్జునుడు ఉత్తర గోగ్రహణ సమయంలో

ప్రయోగించిన సమ్మోహనాస్త్రం, అశ్వత్థామ ప్రయోగించిన బ్రహ్మశిరోనామ కాస్త్రం వంటివి ఈ కాలంలో తయారౌతున్న ఆయుధాల వంటివే. అందుకే భారతంలో లేనిది ఎక్కడా లేదు. భారతంలో ఉన్నదే అంతటా ఉంది అని ప్రసిద్ధి ఏర్పడింది. వ్యాసుడు వ్రాసిన మహాభారతం ఆ మహర్షి వంశంవారిదే కావడం విశేషం!

అటువంటి క్లిష్టమైన కాలంలో, సమాజంలో అన్నీ పురుషుని ఆధిక్యతను పటిష్టం చేసే నియమాల మధ్య జీవించి తమ తమ వ్యక్తిత్వాలను కాపాడుకుంటూ, కష్టనిష్ఠూరాలను అధిగమించి మహా సాధ్వులుగా పేరుగాంచిన మహిళామణులను గూర్చి తెలుసుకోదగింది ఎంతో ఉంది. అందుకే కథల రూపంలో సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో ఈ కథాకోశాన్ని తీసుకొని రావాలని భావించారు తిరుమల తిరుపతి దేవస్థానాల ప్రచురణ విభాగం వారు. ఇది దైవసంకల్పమే కావచ్చు. మహిళలు అబలలనీ, అసహాయులనీ, అమాయకులనీ, జ్ఞానశూన్యులనీ ప్రచారం జరిగింది. కేవలం గృహనిర్వహణమాత్రమే చేయగలరని మధ్యయుగాలలో ఒక అభిప్రాయం ఏర్పడింది. ఎంత మాత్రం అది సత్యం కాదని ఋజువు కాదని భారతమహిళాగాథలు స్పష్టం చేస్తాయి.

స్వతంత్రప్రతిపత్తి అనేది ఒకరు ఇస్తే తీసుకొనేది కాదు. వారి స్వీయసామర్థ్యం మీద ఆధారపడి ఉండేది. తమను తాము తక్కువ చేసుకొని గృహనిర్బంధం విధించుకొని సమాజంలో మంచి గృహిణి, మహాసాధ్వి, గొప్పతల్లి అనిపించుకోవాలి అనే క్రమంలో చాలా కోల్పోయారు స్త్రీలు. వారు ఇప్పటికైనా తమ విలువను తాము తెలుసుకొని, తమ వ్యక్తిత్వాలను తాకట్టు పెట్టకుండా స్త్రీపురుషసమానత్వాన్ని గుర్తెరిగి నిర్భయంగా బ్రతకడం నేర్చుకుంటే ఎంతో మేలు జరుగుతుంది

కుటుంబాలకు, తద్వారా దేశానికి కూడా. జనాభాలో సగభాగం అయిన మహిళలు నిస్సత్తువతో బాధపడుతూ ఏ విధంగాను సమాజనిర్మాణంలో భాగస్వామ్యం లేకుండా ఉంటే సమాజం బాగుపడదు. భారతంలో చాలా సార్లు పతివ్రతాధర్మాలు ప్రస్తావించబడ్డాయి. ఆ యా పాత్రల విషయంలో మాత్రం వారివారి ప్రవృత్తి స్వేచ్ఛాసమానత్వాలతోనే సాగినట్లు కనిపిస్తుంది.

అందుకే ఈ పుస్తకం అవసరం ఇప్పుడే ఎక్కువగా ఉందని భావించిన టి.టి.డి. ప్రచురణ విభాగం వారు అభినందనీయులు. కొంతమంది స్త్రీలకైనా మనోధైర్యాన్ని, ఉత్సాహాన్ని ఇవ్వగలిగితే ఈ రచన ఫలప్రదమైనట్లే.

కథలను భారతకథతో ప్రత్యక్షసంబంధం కలిగినవి, ఉపాఖ్యానాలు, ఇతర ఉపకథలు అని ప్రాధాన్యవివక్షను బట్టి వర్గీకరించడం జరిగింది. రచనాసౌలభ్యం కోసం మాత్రమే ఈ విభాగాలు. పునరుక్తులు తప్పలేదు. ఏకథకు ఆ కథను విడిగా చదువుకొనే వీలుండడం కోసం అలా చేయవలసి వచ్చింది. ముందే మనవిచేసినట్లు ఇది పండిత ప్రకాండుల కోసం కాదు, సామాన్యులకోసం గమనించ ప్రార్థన.

**పి.సుమతీనరేంద్ర**

## విషయసూచిక


1. గంగ
2. సత్యవతి
3. అంబ
4. అంబిక, అంబాలిక
5. కుంతి
6. మాద్రి
7. గాంధారి
8. హిడింబి
9. ద్రౌపది
10. సుభద్ర
11. ఉలూచి
12. చిత్రాంగద
13. సుధేష్ణ
14. ఉత్తర
15. కద్రూవినతలు
16. దేవయాని
17. శర్మిష్ఠ
18. శకుంతల
19. సావిత్రి
20. దమయంతి
21. ప్రమద్వర
22. ప్రద్వేషిణి
23. పౌష్యమహాదేవి
24. సుమన – శాండిలి
25. పంచచూడ
26. రుచి
27. లోపాముద్ర
28. జరత్కారు
29. ప్రభావతి
30. సుకన్య
31. తపతి
32. పుణ్యసతీప్రభావం
33. ఊర్వశి
34. పార్వతి
35. సీత
36. గౌతమి
37. మాధవి
38. సత్యభామ
39. జనకపత్ని
40. సుదర్శన – ఓఘవతి
41. సులభ, వృద్ధకన్య
42. స్వాహా
43. రాధ (కర్ణుడితల్లి)
44. దుస్సల
45. ఘృతాచి
46. పులోమ
47. సుకుమారి
48. పరిశిష్టం

# 1. గంగ

పూర్వం ఇక్ష్వాకువంశంలో ఉత్తమ ధర్మస్వరూపుడైన మహాభిషుడు పుట్టాడు. ఒకసారి అతడు బ్రహ్మను సేవిస్తూ ఉండగా సురనదియైన గంగ స్త్రీరూపాన్ని ధరించి అక్కడకు వచ్చింది. ఆమె దివ్యసౌందర్యాన్ని చూచి మహాభిషుడు ఆమెయందనురక్తుడయ్యాడు. బ్రహ్మ అతడిని భూలోకంలో పుణ్యాత్ముడైన ప్రతీపుడికి కుమారుడిగా పుట్టమని శాసించాడు. అతనియందు గంగ కూడా అనురక్తయై మర్త్యలోకానికి వచ్చింది. ఆ సమయంలో వసిష్ఠుని శాపంవలన దుఃఖితులైన అష్టవసువులు ఆమెకు ఎదురయ్యారు. వారి దుఃఖానికి కారణమడిగింది గంగ. వసిష్ఠుని హోమధేనువును అపహరింపబోయి ఆ మహర్షి శాపానికి గురి అయ్యాము. ఎవరైనా ఒక పుణ్యాత్మురాలి గర్భంలో జన్మించినట్లైతే శాపవిముక్తులం అవుతాము అని వసువులు చెప్పగా విని గంగ దయార్ద్రహృదయంతో అందుకు అంగీకరించింది. "నీవు ఇష్టపడిన మహాభిషుడు ప్రతీపునకు శంతనుడై పుడ్తాడు. అతనికి నీకు సంగమమై మేము నీ పుత్రులుగా ప్రభవిస్తాము. మేము పుట్టగానే నీవు మమ్ములను ఒక్కొక్కరిగా నీళ్ళలో పడవేస్తే మేము శాపపరిసమాప్తియై స్వర్గానికి చేరుతాము" అని వసువులు గంగను ప్రార్థించారు. ఒక్క కొడుకైనా మర్త్యలోకంలో ఉండాలి కదా నాకు తోడుగా అంటే చివరివాడైన ప్రభాసుడు మా ఒక్కొక్కరి నాల్గవ అంశతో ఉత్తమశీలుడై, దీర్ఘాయువు అయి చిరకాలం భూలోకంలో ఉంటాడు" అని వసువులు వాక్రుచ్చారు. సురనది స్త్రీ రూపం దాల్చింది.

తదనంతరం ఒకసారి వేటకై వచ్చిన శంతనుడు అసమాన సౌందర్యవతియైన గంగను చూచి వలచి పెండ్లాడగోరుతాడు. అందుకామె ఒక నియమం పెడుతుంది. తనకు అప్రియంగా ఏమీ మాట్లాడకూడ

దనీ, తను చేసే ఏపనికీ అభ్యంతరం చెప్పకూడదనీ, చెప్తే తానతనిని వదిలి వెళ్ళిపోతాననీ. శంతనుడు అందుకు అంగీకరిస్తాడు.

గంగాశంతనులకు పుట్టిన ఏడుగురు కుమారులను ఆమె నదిలో వదిలేస్తుంది. అసమాన తేజోవంతుడిగా పుట్టిన ఎనిమిదవ కుమారుడిని గంగపాలుచేయకుండా శంతనుడు అభ్యంతరం చెప్తాడు. నన్ను అడ్డుకున్నావు కనుక నేను ఈ కుమారుడిని తీసుకొని వెళ్ళిపోతున్నాను. సకలవిద్యాపారంగతుడిని చేసి నీకు అప్పగిస్తాను అని చెప్పి గంగ శంతనుడిని వీడి వెళ్ళిపోయింది. ఆ ఎనిమిదవవాడే దేవవ్రతుడు. భీషణమైన ప్రతిజ్ఞ చేసిన పిమ్మట భీష్ముడిగా ప్రసిద్ధిచెందాడు. నిజానికి కురువంశవారసుడు గంగాశంతనులకొడుకైన భీష్ముడు. సురనది అయిన గంగ మనుష్యరూపాన్ని ధరించి కొడుకును కన్నతరువాత ఆమెలో మమతానురాగాలు వెల్లువెత్తాయి అనిపిస్తుంది. కుమారుడిని తనతో తీసుకొని వెళ్ళి సకల శాస్త్రాలలో నిష్ణాతుడిని చేసి, అస్త్రశస్త్ర విద్యలలో ప్రావీణ్యం కలిగించి యుక్తవయస్కుడైన తరువాత శంతనుడి దగ్గరకు తీసుకొని వచ్చి వదిలిపెడుతుంది. దేవవ్రతుడు తదనంతరకాలంలో భీష్ముడిగా లోకప్రసిద్ధుడు. గంగ వలన దైవాంశ కలిగినవాడు, అష్టవసువులలో చివరివాడు భీష్ముడు.

అంబ భీష్ముడి మీద ప్రతీకారం చెల్లించుకోవాలని వెళ్తుంటే గంగ మానుషరూపంలో ఎదురువస్తుంది. అంబ విషయం తెలుసుకొని నదిగా మారిపొమ్మని శపిస్తుంది. అంబలో సగభాగం నదిగా మారిపోతుంది.

వస్తువాహనాలతో ఎప్పుడూ కుమారుడిని ఒక కంట కనిపెడుతూనే ఉంటుంది సురనది. విష్ణువును సైతం ప్రార్థిస్తుంది కొడుకు క్షేమం కోసం. శ్రీకృష్ణావతారం పరమార్థం తెలిసిన భీష్ముడు ఆ జ్ఞానాన్ని తల్లినుంచే పొందాడని మనం అర్థం చేసుకోవచ్చు.

యుద్ధానంతరం భీష్ముడిని అధర్మంగా చంపాడు అర్జునుడు అని భావించిన వసువులు గంగ అనుమతితో అతనికి శాపమిచ్చిన సందర్భంలో ఉలూచి గంగాదేవిని ప్రార్థిస్తుంది భర్తనరకానికి వెళ్ళకుండా అనుగ్రహించమని. గంగాదేవి సమక్షంలో వసువులు అర్జునుడు కుమారుని చేతిలో ఓటు వడితే నరకప్రాప్తి ఉండదని చెప్తారు.

శంతనుడి కుమారుడు కనుక శాంతనవుడు అనీ, గంగాదేవి కొడుకు కనుక సురనదీసూనుడుగా ప్రసిద్ధి చెందాడు భీష్ముడు. విష్ణువు పాదాలనుంచి ప్రభవించిన గంగ భగీరథుని ప్రార్థన మేరకు భూమి మీదకు రావడానికి శివుని జటాజూటంపై దిగి అక్కడ నుండి జహ్నుముని ఆశ్రమం మీదుగా ప్రవహించి జాహ్నవి అనే పేరును, భగీరథుని చేత భూమికి కొని రాబడి భాగీరథి అనే పేరును పొందింది. భీష్ముడి మరణానికి ఎంతగానో బాధపడి విలపించింది. కృష్ణుడు, వ్యాసుడు ఆమెను ఓదార్చినారు. పరమపవిత్రమైన నదిగా గంగ పేర్గాంచినది.

గంగాశంతనుల కుమారుడైన భీష్ముని కథ, భీషణమైన అతని ప్రతిజ్ఞ భారతకథకు మూలం!

* * *

## 2. సత్యవతి

భారతాన్ని రచించిన వేదవ్యాసుడు అందులో ఒకప్రధాన పాత్ర కావడం విశేషం. వ్యాసుని జననం ఎలా జరిగిందో తెలుసుకోదగిన ముఖ్యాంశం.

అద్రిక అనే అప్సరస బ్రహ్మశాపంవలన యమునానదిలో మత్స్యరూపంలో తిరుగుతుంటుంది. ఆమె ఉపరిచరవసువువీర్యం మింగడం వలన ఇద్దరు పిల్లలకు జన్మనిచ్చింది. వారిలో ఒకామె మత్స్యగంధి. చేప కడుపున పుట్టడంవలన ఒళ్ళంతా చేపవాసనతో పుట్టి మత్స్యగంధిగా పేరు పొందింది. ఆమెను దాశరాజు కన్నబిడ్డవలె పెంచుకుంటుంటాడు యమునానదిలో పడవ నడుపుకుంటూ యాత్రికుల సేవచేస్తూ జీవనం సాగిస్తూ ఉంటుంది. ఆమె మిక్కిలి సౌందర్యవతిగా ఎదుగుతుంది.

ఒకసారి వసిష్ఠమహర్షి మనుమడు, శక్తి పుత్రుడు అయిన పరాశరుడు యమునానది సమీపంలో ఆమెను చూచి మోహపరవశు డౌతాడు. ఆమెకు తన కోరికను తెలియజేస్తాడు. కాదంటే మునికి కోపం వచ్చి శపిస్తాడేమోనని భయపడుతుంది ఆ దాశకన్య. పరాశరునితో రెండు విషయాలను ప్రస్తావిస్తుంది. ఒకటి తన కన్యాత్వం దూషితమౌతుంది అని, రెండవది పగటిపూట సమాగమం ఉచితం కాదని. ఇక్కడ మత్స్యగంధి బుద్ధికుశలత మనకు బోధపడుతుంది. తపస్సంపన్నుడైన పరాశరుడు ఆమె కన్యాత్వం దూషితం కాకుండా వరమిస్తాడు. ఆమె శరీరసౌగంధ్యం యోజన దూరం వరకు వ్యాపిస్తుందని కూడా అనుగ్రహిస్తాడు. అప్పటినుండి ఆమె గంధవతి అని, యోజనగంధి అని ప్రశస్తిగాంచింది. దివ్యవస్త్రాభరణాలను కూడా పరాశరుడు ఆమెకు ప్రసాదించాడు. యోజనగంధి యమునానదిలో ఉండే ఒక ద్వీపానికి

నావను చేర్చింది. ఎవ్వరికీ దృగ్గోచరం కాకుండా మంచు తిమిరాన్ని (చీకటిని) కల్పించాడు మహర్షి. నిర్దోషం, మనోహరం అయిన రూపంతో ఆమె మహర్షితో సంగమిస్తుంది. సద్యోగర్భంలో ఆమెకు పుత్రుడుదయిస్తాడు. అతడే వేదవిద్యాపారంగతుడు, సూర్యసన్నిభుడు, అఖిల మునులకు ఆద్యుడు అయిన వేదవ్యాసుడు. ద్వీపంలో జన్మించిన కారణంగా "కృష్ణద్వైపాయనుడు" అవుతాడు. నాటినుంచి ఆమె సత్యవతి అని పిలవబడుతుంది. ఆమెకు నమస్కరించి కోరినప్పుడు వస్తానని చెప్పి వెళ్ళిపోతాడు. పరాశరుడు ఆమెకు కోరిన వరాలిచ్చి వెళ్తాడు. మహాభారతాన్ని రచించిన వేదవ్యాసుడిని కన్నతల్లి ఆ సత్యవతి.

ఇక్కడ గమనించదగిన అంశం సత్యవతి సమయస్ఫూర్తి. నిజానికి ఆమె ఉపరిచరవసువు కుమార్తె. శాపవశాత్తు చేపరూపంలో ఉన్న అద్రిక అనే అప్సరస కడుపున పుట్టింది. దాశరాజు ఆమెకు పెంపుడు తండ్రి మాత్రమే. జాలరిదానను అని ఆమె కంఠోక్తిగా చెప్పుకున్నప్పటికీ జన్మరహస్యం ఇది. సత్యవతిగా ప్రసిద్ధిగాంచిన తరువాత ఆమెలో కనిపించే దీర్ఘదృష్టికి, ధైర్యస్థైర్యాలకు మూలం ఇక్కడ కనిపిస్తుంది.

శంతనుడు అను రాజు ప్రతీపుని కుమారుడు. ఒకనాడు గంగాతీరంలో తిరుగుచుండగా గంగానది స్త్రీరూపంతో కనిపించింది. నేను చేసే ఏ పనికీ నీవు అభ్యంతరం చెప్పకూడదు. అలా అయితేనే నిన్ను వివాహమాడగలను అని శెలవిచ్చింది. అప్పటికే ఆమెను చూచి మదనశర పీడితుడైన శంతనుడు అందుకు అంగీకరించాడు. శాపగ్రస్తులయిన అష్టవసువులు గంగగర్భంలో జన్మించడానికి ముందే ఆమెను వేడుకొన్నారు పుట్టగానే తమను గంగపాలు చేయమని. ఆమె పుట్టీ పుట్టగానే ఒక్కొక్కరిని తీసుకొని వెళ్ళి నీళ్ళల్లో పడవేయసాగింది. ఏడుగురిని అలా పారవేసిన పిదప అష్టమ సంతానాన్ని పారవేయడానికి అభ్యంతరం తెలుపుతాడు

శంతనుడు. గంగ ఆ కుమారుడిని తీసుకొని వెళ్ళిపోతుంది. అతడే దేవవ్రతుడు తదనంతర కాలంలో భీష్ముడిగా ప్రసిద్ధి చెందినవాడు, సకల శాస్త్రపారంగతుడైనవాడు.

శంతనుడు యమునానదీతీరంలో వేటాడుచూ సుగంధభరితమైన గాలిని ఆఘ్రాణించి అటుదెసకేగి యోజనగంధిని చూచాడు. ఆమె రూప విలాసాలను చూచి సమ్మోహితుడై వివాహమాడగోరినాడు. ఆమె తన తండ్రి దాశరాజుసమ్మతి గైకొనమని చెప్పింది. దాశరాజు ఆమెకు పుట్టబోయే కుమారుడికే రాజ్యమివ్వాలని షరతువిధించాడు. శంతనుడు పెద్దవాడైన భీష్ముడుండగా అది సాధ్యం కాదని చెప్పి తిరిగి వెళ్ళిపోయాడు. తండ్రి చింతాక్రాంతుడై ఉండడం గమనించి జరిగిన వృత్తాంతాన్ని తెలుసుకొని దాశరాజువద్దకు వెళ్ళి తనతండ్రికి సత్యవతినిచ్చి వివాహం చేయమని భీష్ముడు అడిగాడు. దాశరాజుకోరినట్లు ఆమె సంతానానికే రాజ్యం దక్కుతుందని, తాను వివాహమే ఆడననీ శపథం చేస్తాడు భీష్ముడు. సత్యవతిప్రమేయం ఏమీలేదు ఇందులో. కాని పరోక్షంగా భీష్ముడి ప్రతిజ్ఞకు కారణ భూతురాలౌతుంది సత్యవతి. విధివిలాసం!

సత్యవతికి శంతనుడికి వివాహమౌతుంది. ఇరువురు కుమారులు కలిగారు. వారే చిత్రాంగదుడు, విచిత్రవీర్యుడు అనువారు. చిత్రాంగదుడు బలగర్వితుడై అదే పేరుగల గంధర్వునితో మత్సరించి అతని చేతిలో మరణించాడు. విచిత్రవీర్యునికి వధువులుగా కాశీరాజు కుమార్తెలను స్వయంవరంలో ఇతర రాజులను ఓడించి మరీ తీసుకొనివస్తాడు భీష్ముడు. తాను అంతకుముందే సాళ్వుని వరించానని చెప్పి భీష్ముని అనుమతితో వెళ్ళిపోతుంది అంబ. అంబిక, అంబాలికలను విచిత్రవీర్యుని కిచ్చి వివాహం జరిపిస్తాడు భీష్ముడు. భోగవిలాసాలతో సంతానం కలగక ముందే విచిత్ర వీర్యుడు మరణిస్తాడు. అంటే ఒకవిధంగా కురువంశం నిర్వంశం అయ్యేపరిస్థితి ఏర్పడుతుంది.

ఈ సమయంలో సత్యవతి మొదట భీష్ముడితో చెప్తుంది. వివాహం చేసుకొని వంశాన్ని నిలబెట్టమని. గ్రహాలు గతి తప్పినా తన భీషణప్రతిజ్ఞను వీడనని పలికాడు భీష్ముడు. నియోగపద్ధతిలో అంబిక, అంబాలికలకు సంతానవతులయ్యే పద్ధతిని సూచిస్తాడు. వంశాన్ని ఎలాగైనా కొనసాగించే ఉద్దేశంతో సత్యవతి ఒక నిర్ణయం తీసుకొంటుంది. తన తొలి సంతానమైన వేదవ్యాసుడిని తలచుకొంటుంది. తన కోడళ్ళు అయిన అంబికకు, అంబాలికకు సంతానప్రాప్తి కలుగజేయమని. ఒక సంవత్సరం గడువు కోరతాడు వ్యాసుడు. సత్యవతి అందుకు అంగీకరించదు. తల్లిమాటను కాదనలేక వారితో సమాగమానికి అంగీకరిస్తాడు మునివర్యుడు. ఆతడి కపిల జడలను, బవిరి గడ్డాన్ని, వస్త్రధారణను జూచి భయవిహ్వలయై కనులు మూసుకొంటుంది అంబిక. బలసంపన్నుడైనా అంధుడు జన్మిస్తాడని చెప్తాడు వ్యాసుడు. అంబాలిక ఆతడిని చూచి వివర్ణ అవుతుంది. అందుచేత ఆమెకు పాండువర్ణంతో పాండురాజు పుట్టాడు. అంబికను మరోసారి కలవమని కోరింది సత్యవతి. అంబిక తన దాసిని సర్వాలంకారభూషితను ముని చెంతకు పంపింది. ఆమె అన్ని విధాలా మునిని సంతుష్టునిగా చేసింది. పూర్ణ ఆరోగ్యంతో, జ్ఞానంతో విదురుడు యముని అంశతో జన్మించాడు.

ఈ ప్రణాళికను రచించింది సత్యవతి. ఆమె పూనికతోనే వ్యాసుడు నియోగపద్ధతికి అంగీకరిస్తాడు. ధృతరాష్ట్రుడు, పాండురాజు, విదురుడు జన్మిస్తారు. సత్యవతి కోరుకున్నట్లు పుత్రులైతే జన్మించారు కాని ఒకరు అంధుడు, ఒకడు పాండుడు. వారిరువురి మధ్య వైరం లేదు. కాని వారికి పుట్టబోయే కురుపాండవుల మధ్యవైరం ఏర్పడి ఘోరసంగ్రామం జరుగుతుందనీ, దానిని చూచి మీరు తట్టుకోలేరని వ్యాసుడు తల్లితో చెప్తాడు. సత్యవతి తాను చేయగలిగింది ఇంకేమీ లేదని తెలుసుకొని అడవులకు వెళ్తుంది. ఆమె వెంట అంబిక, అంబాలికలు కూడా

కానలకేగుతారు. సత్యవతి కురువంశాన్ని నిలబెట్టడానికి ఎంతగానో ప్రయత్నిస్తుంది. భర్త అయిన శంతనుడి వియోగాన్ని తట్టుకొని పుత్రులను పెంచింది. ఒకరి తర్వాత మరొకరు మరణిస్తారు. సంతానలేమితో వారసుడు లేనిదౌతుంది కురువంశం. అప్పుడు ఎంతో దృఢనిశ్చయంతో ప్రవర్తిస్తుంది. సాహసోపేతమైన నిర్ణయం తీసుకొంటుంది.

వ్యాసుడిని రావించి కోడళ్ళను సంతానవతులను చేస్తుంది. దురదృష్టం వారిని వెంటాడుతూనే ఉంది. చివరికి వారి వంశంలో జరగబోయే పరిణామాలను చూడలేక కానల కేగుతుంది ఆ వేదవ్యాసుని తల్లి. కురువంశస్థాపన చేసిన దృఢసంకల్పం గల స్త్రీమూర్తి.

సత్యవతి కురువంశం అంతం కాకుండ ఉండడానికి శతధా ప్రయత్నించింది. ఒక దశలో భీష్ముడిని పట్టాభిషేకం చేసుకొని, వివాహమాడి సంతానాన్ని పొందమని కోరుతుంది. ఆమె తండ్రి దాశరాజు కోరిక కారణంగానే భీష్ముడు బ్రహ్మచారిగా ఉండిపోయాడనీ, వంశాభివృద్ధికి తనవలననే విఘాతం ఏర్పడిందనీ ఆమె భావించి ఉంటుంది. అందుచేతనే వ్యాసుని ద్వారా అంబిక, అంబాలికలకు ధృతరాష్ట్ర, పాండురాజులు జన్మించడానికి కారణభూతురాలైంది. తద్వారా ఆ స్త్రీలిరువురికీ సంతానభాగ్యం కూడా కలిగినట్లైంది. ధృతరాష్ట్రుడు, పాండురాజు అక్కచెల్లెళ్ళ కుమారులు. ఒక విధంగా వేదవ్యాసుని సంతానమే! సత్యవతిపట్టుదలే వీరి జననానికి మూలకారణం!

* * *

## 3. అంబ

కాశీరాజు ముగ్గురు కూతుళ్ళలో అంబ పెద్దది. ఆమె చెల్లెళ్ళు అంబిక, అంబాలిక. అంబ కథ చిత్ర విచిత్రమైన మలుపులతో నడుస్తుంది. కురువంశం కురుక్షేత్రంలో తలపడినపుడు ఆమె పాత్ర కీలకమైంది. అంబ సాళ్వప్రభువును ప్రేమించింది. అతడు కూడా మొదట ఆమె పట్ల అనురక్తుడే. అదలా ఉండగా అక్కడ కురువంశం నిర్వంశం అయ్యే పరిస్థితి ఏర్పడింది. భీష్ముడు బ్రహ్మచారిగా ఉంటానని భీషణమైన ప్రతిజ్ఞ చేశాడు. సత్యవతికి ఇద్దరు కుమారులు కలిగారు కాని పెద్దవాడు మరణించాడు. విచిత్రవీర్యుడు రెండవవాడు. అతనికి వివాహం చేయసంకల్పించి భీష్ముడు కాశీరాజు ప్రకటించిన స్వయంవరానికి వెళ్ళి రాజులందరినీ ఓడించి అతని ముగ్గురు కుమార్తెలను హస్తినాపురానికి తీసుకొనిపోయాడు. భీష్ముని చేతిలో ఓడిన రాజులలో సాళ్వుడు కూడా ఉన్నాడు.

అంబ తాను సాళ్వుడిని ప్రేమించినానని చెప్పగానే భీష్ముడు ఆమెను సగౌరవంగా సాళ్వుని వద్దకు పంపించాడు. భీష్ముని చేతిలో ఓడి పరాభవంతో రగిలిపోతున్న సాళ్వుడు ఆమెను నిరాకరించాడు. భీష్ముని చేతిలో కొనిపోబడ్డప్పుడే నీవు మరొకరిదానవు అయ్యావని ఆమెను తిరస్కరించాడు. అంబ తిరిగి భీష్ముని చెంతకు వచ్చి తన్ను తమ్ముని భార్యగా స్వీకరించమని లేదా తనే వివాహం చేసుకోవచ్చని కోరింది. వేరొకరిని మనసులో భర్తగా భావించిన అంబను తన తమ్ముడికి వధువుగా ఒప్పుకోనని భీష్ముడు ఆమెను పంపించి వేశాడు. క్రుద్ధురాలైంది అంబ. ఎవరిమీద ఆమెకు కోపం రావలసి ఉందో కూడా తెలియని సంక్షోభంలో పడింది. అంబ సాళ్వుడి మీద ఆమెకు కోపం కలగలేదు. భీష్ముడే తన దుస్థితికి కారణమని భావించి ప్రతీకారం తీర్చుకోవాలనుకుంది. సామాన్య

మానవులెవరూ భీష్మునికి ఎదురునిలువలేరని ఆమెకు తెలుసు. అందుకే తపస్సు ద్వారా భీష్ముడిని సాధించాలనుకొంది. దుర్గమారణ్యంలో తపస్సుకు పూనుకొంది. అబలవు నీకు తీవ్రతపము సాధ్యంకాదు అని మునులెంత వారించినా ఆమె వినలేదు. అడవులలో సంచరిస్తున్న అంబకు హెూత్రవాహనుడు తారసపడ్డాడు. ఆమె తన దౌహిత్రి అని తెలుసుకున్నాడు. భీష్మునిపై పగ తీర్చుకోవాలనుకుంటే అది ఒక్క పరశు రాముని వలననే సాధ్యపడగలదని ఆతడు శెలవిచ్చినాడు. ఆ మరుసటి రోజే పరశురాముడు అచటికి విచ్చేసినాడు. హెూత్రవాహనుడు, పరశు రామునికి మిత్రుడు. తన వంశంలోని అంబకు జరిగిన అన్యాయాన్ని పరశురామునితో చెప్పాడు. పరశురాముడు అంబను ఎవరిమీద నీ ప్రతీకారం తీర్చుకోవాలనుకుంటున్నావు సాళ్వుడి మీదనా, భీష్ముడు మీదనా అని అడిగాడు. సాళ్వుడి మీద ఆమె ప్రేమ అలాగే ఉంది. అందుచేత భీష్ముడిని శిక్షించమని కోరింది. పరశురాముడు ఆమెను వెంటబెట్టుకొని భీష్ముని వద్దకు వెళ్ళాడు.

పరశురాముడు భీష్మునికి అస్త్రవిద్యాగురువు. భీష్ముడు పరశురామునికి గురువుకు చేయవలసిన గౌరవమర్యాదలన్నీ చేశాడు. కాని అంబను స్వీకరించడానికి మాత్రం అంగీకరించలేదు. తన ప్రతిజ్ఞను గుర్తు చేశాడు. పరశురాముడు ఆగ్రహెూదగ్రుడయ్యాడు. తనతో యుద్ధం చేయమని ఆహ్వానించాడు. భీష్ముడు గురువు ఆదేశం మేరకు యుద్ధానికి ఒప్పుకొన్నాడు. 21 రోజులు యుద్ధం చేసినా భీష్ముడు ఓడలేదు. దేవతలు వారిరువురి మధ్య యుద్ధం తగదని సర్దిచెప్పి యుద్ధాన్ని ఆపగలిగారు. పరశురాముడు తన వలన భీష్ముని ఓడించడం సాధ్యంకాలేదని చెప్పి తపస్సు చేసుకోవడానికి వెళ్ళిపోయాడు. అంబ మళ్ళీ శివుని గూర్చి ఘోరమైన తపస్సు చేయడానికి పూనుకొంది. శివుడు ప్రత్యక్షమై వరం కోరుకోమంటే భీష్ముడిని చంపగలిగే వరం అడుగుతుంది. ఈ జన్మలో

అది నీకు సాధ్యం కాదు. మరుజన్మలో నీవు కుమార్తెగా పుట్టి పురుషునిగా మారుతావు. నీ కారణంగా భీష్ముడు మరణిస్తాడు అని చెప్పి అంతర్ధాన మౌతాడు శివుడు. వెంటనే చితి పేర్చుకొని ఆత్మాహుతి చేసుకొంది అంబ.

ద్రుపదునకు కుమార్తెగా పుట్టింది అంబ – శిఖండి అనే పేరుతో ప్రసిద్ధి చెందింది. ఆమెను పురుషునివలె పెంచారు తల్లిదండ్రులు. హేమవర్మకుమార్తెను తీసుకొనివచ్చి పెండ్లి కూడా చేశారు. శిఖండి పురుషుడుకాడని తెలిసి హేమవర్మ దండెత్తి వచ్చాడు. అవమానం భరించలేక స్థూలకర్ణుడు అనే యక్షుడు ఉండే అరణ్యానికి వెళ్ళాడు శిఖండి. ప్రాణత్యాగానికి పూనుకొన్న శిఖండికి తన పుంస్త్వాన్ని ప్రసాదించి, అతని స్త్రీత్వాన్ని స్వీకరించాడు యక్షుడు. నగరానికి తిరిగివచ్చిన శిఖండి పురుషత్వాన్ని హేమవర్మకు చాటి ద్రుపదుడు తన రాజ్యాన్ని తిరిగి పొందాడు. ద్రుపదుడికి తర్వాత అగ్నిసంభవయైన ద్రౌపది, దృష్టద్యుమ్నుడు జన్మించారు.

అంబవృత్తాంతం విషాదభరితమైంది. కన్యగా సాళ్వుని ప్రేమించి తిరస్కరింపబడింది. ఆ కోపాన్ని తన్ను తీసికొనిపోయిన భీష్ముని మీద చూపించింది. భీష్ముని చంపడమే తన జీవితలక్ష్యంగా భావించింది. సాళ్వునికి కాని నాడు తనకు జీవితమే భగ్నమైందిగా తలచిన అంబ ప్రతీకారవాంఛతో రగిలిపోయింది. ఈ జన్మలో అది సాధ్యం కాదని తెలుసుకొని తపస్సు చేసింది. శివుడు ప్రత్యక్షమైతే ఏదైనా కోరుకోకుండా భీష్మనాశనాన్ని కోరుకుంది. మగువగా పుట్టి ద్రోణుని వద్ద అస్త్ర శస్త్ర విద్యలన్నీ నేర్చుకొంది. వివాహసమయంలో స్త్రీగా ఉండి స్త్రీని వివాహ మాడవలసి వచ్చింది. పురుషునిగా మారిన తర్వాత కూడా ఆ కళంకం పోలేదు. స్త్రీ పురుష సంబంధమైన జన్మ కలిగినవారు ముందు నిలబడితే వారిమీద అస్త్రం ప్రయోగించనని భీష్ముడికి నియమం ఉంది. పదిరోజుల

యుద్ధం తర్వాత కూడా భీష్ముని ఎదిరించి నిలవడం సాధ్యం కాదని తెలుసుకొన్న ధర్మరాజు తాతనే తన మరణం ఎలా సంభవిస్తుంది అని అడిగాడు. తన నియమం చెప్పిన భీష్ముడిని శిఖండిని ముందుపెట్టుకొని చంపాడు అర్జునుడు.

ఒక స్త్రీ పగబడితే ఎంత తీవ్రమైన పరిస్థితి ఏర్పడుతుందో అంబ కథవలన అర్థమౌతుంది. తన జీవితాన్నే పణంగా పెట్టి భీష్మునిపై ప్రతీకారం తీర్చుకొంటుంది అంబ. ఆమె తీక్షణమైన స్వభావం, పట్టుదల ఆమె అభ్యుదయానికి ఏ మాత్రం ఉపయోగపడలేదు. భీష్ముని మరణానికి దారితీసింది. పగ, ప్రతీకారాలకు పరాకాష్ఠ అంబకథ. పగతో రగిలిపోయే వ్యక్తి తన మేలుకంటె శత్రువుకు హాని చేయడంలోనే శ్రద్ధకనబరుస్తాడన డానికి అంబ నిలువెత్తు నిదర్శనం.

* * *

## 4. అంబిక, అంబాలిక

అంబ, అంబిక, అంబాలిక కాశీరాజు కుమార్తెలు. తన తమ్ముడు విచిత్రవీర్యునికి వివాహం చేయడానికి సంకల్పించిన భీష్ముడు స్వయంవరానికి ఏతెంచి, రాజులందరినీ ఓడించి వారిని హస్తినకు తీసుకొని వెళ్ళాడు. సాళ్వుని ప్రేమించానని చెప్పి అంబ వెళ్ళిపోయింది. అంబిక, అంబాలికలను విచిత్రవీర్యునికి కిచ్చి వివాహం జరిపించాడు భీష్ముడు. విపరీత భోగలాలసతతో విచిత్రవీర్యుడు అనతికాలంలోనే మరణించాడు. సంతానలేమివలన కురువంశం నిర్వంశం అయ్యేపరిస్థితి ఏర్పడింది.

సత్యవతి భీష్ముని వివాహమాడమని కోరింది. అతడు అంగీకరించ లేదు. నియోగపద్ధతిలో అంబికకు, అంబాలికకు సంతానప్రాప్తి కలిగేటట్లు చేయవచ్చని భీష్ముడు సూచించాడు. శంతనుని పెండ్లియాడక మునుపు యోజనగంధిగా ఉన్న తనకు పరాశరుని వలన కలిగిన పుత్రుడు వేదవ్యాసుడు. అతనిని రావించి అంబిక, అంబాలికలయందు పుత్రులను పొందమని ఆమె ఆజ్ఞాపించింది. వత్సరం గడువు కోరినా సత్యవతి అంగీకరించలేదు.

ఆ మహర్షి కపిలజడలను, బవిరి గడ్డాన్ని చూచి అంబిక సంయోగ సమయంలో కళ్ళుమూసుకొంది. అపరిమిత బలంకలిగినా అంధుడు అయిన ధృతరాష్ట్రుడు పుట్టాడు. పుత్రవ్యామోహంతో కురువంశ వినాశనానికి పరోక్షకారకుడయ్యాడు. మహర్షి అంబాలికయందు పుత్రుని పడయవలెనని సత్యవతి కోరింది. ఆతని రూపాన్ని చూచి వెల వెల బోయింది అంబాలిక. వీరుడైనా పాండువర్ణంతో జన్మించి శాప వశాన తదనంతరకాలంలో మరణించాడు పాండురాజు. అక్కచెల్లెళ్ళ పిల్లలు ధృతరాష్ట్రుడు, పాండురాజులు అన్యోన్యంగానే ఉండేవారు. కాని వారి సంతానమైన దుర్యోధనాదులకు, పంచపాండవులకు వైరమేర్పడి భయంకరయుద్ధం అవుతుందని వ్యాసుని ద్వారా విని వారు సత్యవతితో కానల కేగినవారు అంబిక, అంబాలిక. వారి మనుమలే కురుపాండవులు! దుర్యోధన, దుశ్శాసనాదులు, పంచపాండవులు.

# 5. కుంతి

కుంతిపాత్ర భారతంలో ఒక ప్రత్యేక స్థానాన్ని కలిగినట్టిది. ఈమె శూరుడనే యాదవరాజు కుమార్తె. శూరుని మేనత్త కొడుకు కుంతిభోజుడు. కుంతిభోజునికి సంతానం లేకపోవడం వలన శూరుని కుమార్తెను తెచ్చి పెంచుకున్నాడు. కుంతిభోజునిచేత పెంచబడిన కారణంగా ఆమెకు 'కుంతి' అనే పేరు వచ్చింది. ఆమె అసలు పేరు పృథ. ఈ పృథ నామం వలననే ఈమె కుమారుడైన అర్జునునికి పార్థుడు అనీ, పార్థునికి సారథ్యం వహించిన శ్రీకృష్ణునికి పార్థసారథి అని ప్రసిద్ధి ఏర్పడింది. ఈమె జన్మతః వసుదేవుని సోదరికావడం చేత శ్రీకృష్ణునికి మేనత్త అయింది.

ఈమె కుంతిభోజుని ఇంట పెరుగుతున్నప్పుడు అతిథి అభ్యాగతులుగా వచ్చిన మునిపుంగవులను సేవించుకుంటూ ఉండేది. సాధుశీల, గుణగరిష్ఠ అయిన కుంతి పెద్దల మన్ననలను పొందింది. ఒకసారి దుర్వాసుడు కుంతిభోజుని ఇంటికి వచ్చాడు. కుంతి చేసిన సపర్యలకు సంతోషించాడు. ఒక మంత్రాన్ని ఉపదేశించి దానిని పఠించినపుడు ఆమె కోరిన దేవత వచ్చి ఆమెను అనుగ్రహిస్తాడని చెప్పి వెళ్ళిపోతాడు. ఆమె ఎదుట సూర్యనారాయణుడు ప్రకాశిస్తూ కనిపిస్తాడు. ఆమె దుర్వాసుడు ఆశీర్వదించి ఇచ్చిన మంత్రశక్తిని పరీక్షించాలనుకొంటుంది. కేవలం బాల్యచాపల్యం లేదా కుతూహలం కారణాలుగా చెప్పుకోవచ్చు. ప్రత్యక్షనారాయణుడైన సూర్యుడిని తలచుకొని మంత్రాన్ని పఠించగానే ఆదిత్యుడు ప్రత్యక్షమౌతాడు. ఆమె భయపడుతుంది. తాను కన్యననీ పుత్రోదయంతో తన కన్యాత్వం దూషితమౌతుందని సూర్యుని వేడుకొంది. సూర్యనారాయణుడు ఆమెకు కర్ణుడిని కుమారుడుగా ప్రసాదించి ఆమెకన్యాత్వం దూషితం కాదని వరమిచ్చి వెళ్ళిపోతాడు. సహజ

కవచకుండలాలతో అమితమైన తేజస్సుతో పుట్టిన ఆ బాలుడే కర్ణుడు. ఆ బాలుడిని రహస్యంగా ఎలా పెంచగలనని, సహజంగానే భయ భ్రాంతులకు లోనౌతుంది. అప్పుడే అక్కడికి సూర్యానుగ్రహంవలన ఒక స్యందనం (పేటిక) నీటిప్రవాహంలో తేలివస్తుంది. కుంతి దైవనిర్ణయంగా భావించి ఆ శిశువును ఆ పెట్టెలో ఉంచి తిరిగి నదిలోకి పంపిస్తుంది. ఇది కర్ణుని జన్మవృత్తాంతం. లోకాపవాదభీతిచేత ఆమె కర్ణుని జననాన్ని గోప్యంగా ఉంచింది. తదనంతరకాలంలో ఆమె కర్ణుడిని సహజకవచ కుండలాల వలన గుర్తుపట్టినా ఎవరికీ ఈ రహస్యాన్ని వెల్లడించలేదు. రాధ, సూతుడు పెంచడంవలన కర్ణుడు రాధేయుడు అయ్యాడు. దుర్యోధనుడితో చెలిమిచేసి అంగరాజు అయ్యాడు.

తదనంతర కాలంలో కుంతికి పాండురాజుతో వివాహం జరిగింది. శాపగ్రస్తుడైనాడు పాండురాజు. వారికి సంతానం కలుగలేదు. అందుకు పాండురాజు మిక్కిలి దుఃఖిస్తూ ఉండగా ఆమె దుర్వాసుడు తనకు ఇచ్చిన వరాన్ని గురించి తెలియజేస్తుంది. పాండుడు ఎంతో బ్రతిమిలాడి, నచ్చచెప్పిన తర్వాత ఆమె వరుసగా యమధర్మరాజు వలన ధర్మరాజును, వాయుదేవుని అనుగ్రహంతో భీమసేనుడిని, ఇంద్రుని అనుగ్రహం వలన అర్జునుడిని కుమారులుగా పొందుతుంది. తన సపత్ని అయిన మాద్రికి మంత్రమహిమ చేత అశ్వినీదేవతల వలన నకులసహదేవులు జన్మించేటట్లు చేసింది. పాండురాజుకు స్త్రీసంభోగంతో మరణం ప్రాప్తిస్తుందనే కిందముని శాపం ఉంది. ఒక రోజు మోహపరవశుడై మాద్రిని కలిసినందువలన పాండురాజు మరణిస్తాడు. కుంతి సహగమనం చేయాలనుకుంటుంది. మాద్రి తనతో కలిసినందుచేత పాండురాజు మరణించినందువలన తాను సహగమనం చేస్తానంటుంది. అదీగాక ఆ పాండునందనులను పెంచే సామర్థ్యం తనకు లేదని నకులసహదేవులు కుంతీపుత్రులుగానే పెరగాలని కోరుకొని పాండురాజుతో సహగమనం

చేస్తుంది. కుంతీసుతమధ్యముడు అని అర్జునుని పేర్కొంటాడు భీష్ముడు. కుంతి ఐదుగురు కుమారులను తీసుకొని హస్తినాపురానికి చేరుకొంటుంది. పంచపాండవులను అరమరికలు లేకుండా పెంచింది కుంతి.

దుర్యోధనాదులతో సమానంగా పాండునందనులు పెరగసాగారు. వారి వయసుతో పాటు వైషమ్యాలు పెరిగాయి. ముఖ్యంగా భీముని బలం దుర్యోధనునికి కంటగింపుగా మారింది. వారిని అంత మొందించడానికి పలువిధాలుగా ప్రయత్నించసాగాడు. ధృతరాష్ట్రుడు ఇది గ్రహించి వారిని వారణాసికి పంపించాడు. వారు మార్గమధ్యంలోనే మరణించేందుకు లాక్షాగృహాన్ని రహస్యంగా నిర్మింపజేశాడు దుర్యోధనుడు. అందులో బస చేసిన పాండవులు భీముని భుజబలదర్పం వలన కుంతితో సహా బయటపడ్డారు. వారు అరణ్యమార్గంలో రహస్యంగా ప్రయాణించ సాగారు. నిద్రించుచున్న ఒకానొక సమయంలో వారిని చూచిన హిడింబాసురుడు వారిని చంపి తనకు వండి పెట్టమని చెల్లెలైన హిడింబను కోరాడు. ఆమె పాండవుల దగ్గరకు వచ్చింది. భీముని చూచి మోహించింది. భీముడామెను మొదట తిరస్కరించాడు కాని కుంతి, ధర్మరాజు చెప్పిన మీదట ఆమె కోర్కెను తీర్చి ఘటోత్కచుడు అనే పుత్రుడిని పొందాడు. కుంతి వలచివచ్చిన స్త్రీని తిరస్కరించరాదని భీమునికి హితవు చెప్పింది. కురుక్షేత్రయుద్ధంలో అర్జునునిపై ప్రయోగించవలెనని దాచిన శక్తిని కర్ణుడు ఘటోత్కచుని మీద ప్రయోగించాడు. ఆ విధంగా అర్జునుడు రక్షింపబడ్డాడు. కుంతి పాండవులతో ఏకచక్రపురం చేరింది. అక్కడ ఒక బ్రాహ్మణుని ఇంటిలో నివాసం ఏర్పరచుకొన్నారు. ఒకరోజు ఆ బ్రాహ్మణుని ఇంటిలోని వారు పెద్దపెట్టున ఏడ్వసాగారు. కుంతి వారిని కారణమడిగింది. బకాసురునికి ఆహారంగా తమ కుమారుడు వెళ్ళవలసి ఉంది అని వారు కుంతికి చెప్పారు. వారికి ఉపకారం చేయదలచిన కుంతి బాలునికి మారుగా భీమసేనుని వెళ్ళమని ఆదేశించింది. భీముడు

బకాసురుని చంపగల సమర్థుడని ఆమె నమ్మకం. బ్రాహ్మణకుమారుని ఆ విధంగా కుంతి రక్షించింది. భీముడు బకాసురుని వధించి ప్రజల కష్టాన్ని తీర్చాడు.

ఏకచక్రపురం నుండి కుంతి, పుత్రులు బ్రాహ్మణవేషంలోనే ద్రుపదుని నగరానికి చేరారు. పుత్రులు భిక్షాటనము చేసి తెచ్చిన ఆహారాన్ని కుంతి వారికి పెట్టి మిగిలినది తాను భుజించేది. పాండురాజుపత్ని, కుంతిభోజుని కూతురు, కృష్ణుని మేనత్త ఈ దురవస్థకు లోను అయినా తమ రహస్యజీవనాన్ని బయల్పడనీయలేదు. పుత్రుల క్షేమం, అభ్యుదయం అనే ఆశయాలు ఆమెను ముందుకు నడిపించాయి. అప్పుడే ద్రౌపదిస్వయంవరం చాటింపబడింది. అర్జునుడు మత్స్యయంత్రాన్ని ఛేదించాడు. ద్రౌపదిని వెంట తీసుకొని వచ్చి ఎప్పటిలాగే భిక్ష తెచ్చితిమి అని చెప్పారు. సమానంగా పంచుకొనండి అని ఆమె శెలవిచ్చింది – తెచ్చింది ద్రౌపదిని అని తెలియక. వారు తల్లిమాటను జవదాటజాలరు కాని ఒక స్త్రీని ఐదుగురు పెండ్లి చేసుకొనుట ఎట్లు అని విచికిత్సకు లోనైనారు. వ్యాసుడు ఏతెంచి ద్రౌపది పూర్వజన్మవృత్తాంతాన్ని చెప్పి వారిని సమాధానపరిచాడు. ఆ విధంగా ద్రౌపది పంచ భర్తృక అయింది. కుంతి మాట అంత సత్యమైనది, దుర్భేద్యమైనది, భారతకథకు కీలకమైంది.

ధృతరాష్ట్రుడు వారిని హస్తినాపురానికి రప్పించి ఇంద్రప్రస్థాన్ని, కొంత రాజ్యాన్ని ఇచ్చాడు. కుంతి సంతోషించింది. అది తాత్కాలికమే అయింది. జూదానికి ఆహ్వానించి శకుని సహాయంతో వారిని ఓడించి ద్రౌపదిని పరాభవించి అరణ్య అజ్ఞాతవాస నియమాలతో పాండవులను వెళ్ళగొట్టాడు దుర్యోధనుడు. అప్పుడు మాత్రం కుంతి పాండవుల వెంట అడవులకు వెళ్ళలేదు. ద్రౌపదికి జరిగిన అవమానానికి మిక్కిలి పరితపించింది కుంతి. బావ ఇంట నిర్దయమైన కూడు తింటూ దుర్యోధనుని సూటిపోటి మాటలు వింటూ పంటి బిగువున కాలం

వెళ్ళదీసింది. శ్రీకృష్ణుడు రాయబారిగా హస్తినకు వచ్చినప్పుడు తన దుఃఖాన్ని వెళ్ళబోసుకుంది.

**"సుగుణవు, పుట్టినింటికిని చొచ్చినయింటికి తేజమెక్కగా**
**దగుచరితంబునన్ నడచు ధన్యవు ధీరవు దేవి"** అని కుంతిని

గురించి శ్రీకృష్ణుడు పలికిన పై పలుకులవలన ఆమెది ఎంత ఉన్నతమైన పదిలమైన స్థానమో అర్థమౌతుంది. నీవే దుఃఖాన్ని అణచుకోలేకపోతే లోకంలో ఇంకెవరు సహించగలరు అని అత్తను సమాధానపరచి "మీ హృదయరోగములన్నియు పుచ్చివైచెదన" ని మాట ఇస్తాడు కృష్ణుడు. కుంతికి శ్రీకృష్ణుని శక్తి ఎటువంటిదో తెలుసు.

అందుచేతనే ఇంతకాలం ధైర్యంగా ఉండగలిగింది. ఇప్పుడు "పాండునందనులకు తండ్రియు గురువు దైవము నీవే కదా! నీవు ధర్మాన్ని, హితాన్ని దృష్టిలో ఉంచుకొని ఏది నిర్ణయించినా అది వారు ఆచరిస్తారు. నిన్ను నమ్ముకున్నవారికి ఆపదలు కలుగుతాయా" వారలకనే ఏముంది. ఈ జగత్తుకు అంతా నీవే దిక్కు. నీ పలుకు వేదవాక్కు" అని కృష్ణతత్వాన్ని విశదీకరించింది కుంతి. ఆమె ధృతి, క్షమ అనన్య సామాన్యం. భుజబలంతో జీవించడం వారి విధి. మెత్తబడటం నిందింపదగినది అవుతుంది అంటూ ధర్మజ భీమార్జునులను పక్కన బెట్టి "మాద్రీ ప్రజలకు చెప్పుము, ద్రుపదాత్మజ గార్యంబడుగుమనుము" అంటుంది. ఐదూళ్ళు చాలు అన్న ధర్మరాజు అతనికి అనుకూలంగా మాట్లాడిన భీమార్జునులు కుంతి ఆగ్రహానికి గురి అయ్యారు అనిపిస్తుంది. మహాభారతయుద్ధానికి మూలకారణం ద్రౌపదికి జరిగిన అవమానం. ద్రౌపదిమీద కుంతికి వాత్సల్యమే కాదు ఆమె వ్యక్తిత్వం మీద గౌరవం కూడా ఎక్కువే. అన్ని యుగాలలో అత్తా కోడళ్ళ అనుబంధానికి ఆదర్శం కుంతి, ద్రౌపది. అందుకే కొడుకులకంటె నయ్యనుగు కోడలి కెక్కుడు గూర్తు. కోడలు

కూడా కొడుకుల కంటె నాపట్ల ఎక్కువ భక్తి కలిగి ఉంటుంది అంటుంది కుంతి.

**"కొడుకు గాంచు రాచకూతురెద్దానికి**
**నట్టిపనికి నుచితమైన సమయ**
**మొదవె, తడయుటింకనొప్పదు, జనములు**
**నట్లుగాని పురుషులనరు మిమ్ము" –** తీవ్రాతితీవ్రంగా పలికింది. "మీరు పురుషులే అయితే యుద్ధం చేయండి" అని. కుంతి పౌరుషం కల స్త్రీ.

క్షత్రియవనిత ఏ పనికోసం కొడుకులను కంటుందో ఆ పని చేయమని కృష్ణునితో ధర్మరాజాదులకు సందేశం పంపుతుంది. కాని యుద్ధం జరిగితే ఏమౌతుందో ఊహించుకొని పాండవులకు, కర్ణునికి మైత్రి కలపాలని అనుకొంటుంది. అప్పటిదాకా ఎవరికీ వెల్లడించని కర్ణుని జన్మరహస్యాన్ని ఆతడికి వెల్లడిస్తుంది. అప్పుడు కూడా పాండవులకు ఈ విషయాలను తెలియనివ్వలేదు. కర్ణుడు సంధ్యావందనం చేసే సమయంలో ఒంటరిగా వెళ్ళి అతడు తన ప్రథమ సంతానమని చెప్పి పాండవులతో కలిసిపొమ్మని కోరింది. అతడే రాజు అవుతాడని, ధర్మరాజు అతడిని అగ్రజుడిగా అంగీకరిస్తాడని ఎంతగానో చెప్పి చూచింది. అతడు రాధేయుడు కాదని కౌంతేయుడని, సుక్షత్రియుడని ఒప్పించడానికి ప్రయత్నించింది కుంతి. కర్ణుడందుకు ఒప్పుకోలేదు. అర్జునుడు తప్ప తన స్పర్ధకు తక్కినవారు పాత్రులు కారని, వారు తన చేతికి చిక్కినా వదలివేస్తానని మాట ఇస్తాడు కర్ణుడు. కుంతికి కొంత ఉపశమనం కలుగుతుంది. యుద్ధంలో ధర్మజుడు దొరికినా కర్ణుడు చంపకుండా వదలిపెడతాడు. అలాగే భీమసేనుని కూడా. ఇవి కుంతికి లభించిన వరాలే కర్ణుడి ద్వారా.

ధర్మరాజు మరణిస్తే యుద్ధం ఆగిపోయేది. కర్ణుడు తన కొడుకని లోకానికి వెల్లడించినా యుద్ధం కొనసాగేది కాదేమో. కుంతి ఒక విధంగా యుద్ధానికి కారణమైంది. ఆపగలిగే ప్రయత్నం కర్ణుడిని అర్థించడంతోనే సరిపెట్టుకుంది. అప్పుడు కూడా కర్ణుని జన్మరహస్యాన్ని లోకానికి వెల్లడించలేకపోయింది. ఆ విధంగా కుంతి దైవోపహత.

యుద్ధంలో శ్రీకృష్ణుని సహాయంతో పాండవులు గెలిచినా కర్ణుని మరణం ఆమెను వేధించింది. అప్పుడు ధర్మరాజుకు చెప్పింది. ఆ విషయం ఇప్పటిదాకా వెల్లడించనందుకు తప్పుపట్టాడు ధర్మనందనుడు. ఆమె కోరుకున్న అభ్యుదయాన్ని పుత్రులు సాధించినా కుంతి ఎక్కువ కాలం రాజమాత అనే స్థానాన్ని అనుభవించలేదు. నూర్గురు కుమారులను కోల్పోయిన గాంధారి, ధృతరాష్ట్రులు హస్తినలో ఉండలేక కానలకేగడానికి సమ కట్టినపుడు, ఆమె కూడా వారిని అనుసరించింది. తనయులెంత వారించినా తన నిర్ణయాన్ని మార్చుకోలేదు కుంతి. వారిని సేవించుకుంటూ శేషజీవితాన్ని గడుపుతానని అడవులకు వెళ్లిపోయింది.

కుంతివృత్తాంతం భారతకథలో చాలా కీలకమైంది. ఆమె సామాన్య వనిత కాదు. శూరసేనుడి కుమార్తె. కుంతిభోజుని పెంపుడు కూతురు. వసుదేవుడి సోదరి, శ్రీకృష్ణుని మేనత్త. పాండురాజు అసహాయశూరుడు. కురురాజ్యాన్ని విస్తరింపజేసిన పరాక్రమవంతుడు. అగ్రజుడు అంధుడైనా చక్రవర్తిస్థానంలో కూర్చుండబెట్టిన ధీమంతుడు. అట్టి పాండురాజును ఉద్వాహమాడిన కుంతిజీవితం ఎలా ఉండి ఉండాలి ఎలా సాగింది. దీన్నే విధివిలాసం అంటారేమో. వివాహిత కాని యువతికి దుర్వాసుడు పుత్రులను బడసే వరమిచ్చాడు. అది ఆమెను కర్ణుని రూపంలో జీవితాంతం బాధించింది. పాండురాజు శాపగ్రస్తుడయ్యాడు. అంతటి వీరుడు కుంతి, మాద్రి శతశృంగపురంలో హస్తినకు బహుదూరంలో నివసించవలసి వచ్చింది. అక్కడ సైతం ఒక బలహీన క్షణంలో మాద్రితో

కలిసినందువలన మరణించాడు. ఒంటరిగా చిరుప్రాయంలో ఉన్న కుమారులను వెంటబెట్టుకొని బావ ఇల్లు చేరవలసి వచ్చింది. భర్తృవిహీన అయిన కాంత మనుగడ ఏకాలంలోనైనా బాధాకరమే. కొడుకులు అసహాయశూరులైనా ధృతరాష్ట్రుని శాసనానికి దుర్యోధనుడి ఆగడానికి బలి అయినవారే. అపురూప సౌందర్యవతి, అయోనిజ, ద్రుపదనందన కోడలు. అయినా అది కూడా అవమానాలకు ఇతరుల ఈర్ష్యా అసూయలకు కారణమే అయింది. ఆమె పరాభవం అత్త స్థానంలో ఉండి కూడా ఏమీ చేయలేని నిస్సహాయత వలన మనశ్శల్యమైంది. జీవితం చివరి అంకంలో కూడా ఆమె రాజ్యభోగాలను అనుభవించలేదు, ఆశించనూలేదు. క్షత్రియకాంత కనుక తన కోడలిని పరాభవించినవారిపై ప్రతీకారాన్ని కోరుకుంది. కాని తనయులను పోగొట్టుకున్న ధృతరాష్ట్రుడు గాంధారి ఎంత వేదనకు గురి అవుతున్నారో ఆమె గ్రహించింది. ఆ బాధ ఎటువంటిదో దయార్ద్రహృదయ అయిన కుంతికి తెలుసు. ఆమె కూడా యుద్ధంలో కర్ణుడి మరణాన్ని చూచింది.

ఇన్ని ఇడుములుపడినా సహించగలిగింది. బహుశా ఆమె క్షమాగుణం, ధర్మనిరతి వీటన్నింటినీ మించి కృష్ణభక్తి తోడు నిలిచాయి కాబోలు. కృష్ణతత్త్వాన్ని ఎరిగినవారు ముగ్గురే. భీష్ముడు, విదురుడు కుంతి. ధైర్యస్థైర్యాలు ఆమె ధార్మికప్రవృత్తికి తోడునిలిచిన గుణాలు.

చివరిదశలో కానలకేగుతున్నప్పుడు ఆమె కర్ణుని గూర్చి తలచుకుంటూ తాను తప్పుచేశానని మిక్కిలి బాధపడుతుంది. ధర్మరాజుతో కుంతి కర్ణుని గూర్చి నీవు, తమ్ములు ఎప్పుడూ ప్రేమాస్పదులై ఉండండి అని పలుకుతుంది. గతజలసేతుబంధనం అంటే ఇదే కాబోలు.

* * *

## 6. మాద్రి

మద్రదేశాధిపతి కూతురు మాద్రి. ఈమె సోదరుడే శల్యుడు. పాండురాజు రెండవ భార్య. మొదటి భార్య పృథ – కుంతిభోజుని పెంపుడు కూతురు కుంతి. ఒకసారి వేటకు వెళ్ళిన పాండురాజు ముని దంపతులు మృగరూపాలను ధరించి క్రీడించుచున్నప్పుడు బాణములువేసి సంహరించాడు. ఆ మునిపేరు కిందముడు. ఆతడు చనిపోతూ భార్యతో సమాగమం చేసినప్పుడే పాండురాజు మరణిస్తాడని శపించాడు. పాండురాజు శతశృంగపర్వతం మీదనే తపస్సు చేసుకుంటూ కాలం గడపసాగాడు. కుంతి, మాద్రి పాండురాజును అనుసరించి ఉండేవారు. వానప్రస్థాశ్రమాన్ని వారు ముగ్గురూ స్వీకరించారు.

ఒకసారి కుంతి బ్రాహ్మణులకు అతిథిమర్యాదలు చేయుచున్న సమయంలో అతిశయరూపలావణ్యయైన మాద్రిని చూచి మన్మథ శరపీడితుడయ్యాడు పాండురాజు. మాద్రి వలదని ఎంతవారించినా విడువలేదు. కిందమునిశాపాన్ని కూడా లెక్కచేయకుండా ఆమెతో సమాగమం చేశాడు. వెంటనే నిర్జీవుడయ్యాడు పాండురాజు. ముని శాపప్రభావం అంతటిది. ఇది మహాభారతకథను మలుపు తిప్పిన పరిణామం. విధి బలీయం!

మునిశాపం ఇచ్చినప్పుడే పాండురాజుకు తెలిసింది తను పుత్రులను పొందలేనని. కుంతి దుర్వాసుడు తన కిచ్చిన వరాన్ని తెలిపింది. ఆమె ధర్మజ, భీమార్జునులను పొందింది. మాద్రి తనను కూడా సంతానవతి చేయమని అర్థించగా కుంతి అశ్వినీదేవతలను రావించింది. మాద్రికి నకులసహదేవులు జన్మించారు. పాండురాజు మరణించినప్పుడు తాను సహగమనం చేస్తానని కుంతి అన్నప్పటికీ మాద్రి అంగీకరించలేదు. తనను కలిసినప్పుడే పాండురాజు మరణించాడు కనుక తాను

సహగమనం చేయడమే న్యాయం అని పలికి కుంతికి నకులసహదేవులను అప్పగించి పతితోబాటు సహగమనం చేసింది మాద్రి.

కుంతీ మాద్రి ఇరువురూ పాండురాజు భార్యలే. అతనితోబాటే అడవులలో నివసించారు. మహాపరాక్రమశాలియైన పాండురాజు అనేక యుద్ధాలు చేసి ఆ సంపదనంతా ధృతరాష్ట్రునికి ఇచ్చేవాడు.

సపత్నీమాత్సర్యం కుంతీ – మాద్రి ల మధ్య ఏ మాత్రం కనిపించదు. తాను పుత్రులను బడయగోరినప్పుడు కుంతి సంతోషంగా మంత్ర ప్రభావంతో మాద్రి కోరికను తీర్చింది. నకులసహదేవులను తన పుత్రులవలెనే పెంచింది కుంతి. దీనికి మాద్రిసౌజన్యమే కారణమని ఊహించవచ్చు. మాద్రి కుంతిని అనుసరించే మెలిగేది కాబోలు. నకుల సహదేవులను పెంచడం ఆమె కుంతికే అప్పగించింది. అందుకు నీవే సమర్థురాలవు అని కూడా చెప్పింది మాద్రి. భర్తృవియోగాన్ని భరించి పంచపాండవులను వెంటబెట్టుకుని హస్తినాపురానికి చేరింది కుంతి. పాండురాజుతో సహగమనం చేసిన మాద్రి ఒక విధంగా అదృష్టవంతురాలు. కుంతి పడిన కష్టాలు అంతులేనివి. పాండు నందనులను కంటికి రెప్పలా కాపాడుకోవడంలో కొంతకాలం, లాక్షాగృహ దహనంతర్వాత అజ్ఞాతంగా జీవించడంలో కొంత కాలం, దుర్యోధనుడి దుర్నీతికి కొడుకులు, కోడలు అడవుల పట్టిపోయినప్పుడు బావయింట నిర్దయమైన కూడుతింటూ, సూటిపోటి మాటలు వింటూ ఎంతో కాలం గడపవలసి వచ్చింది. మాద్రి ఇటువంటి దురవస్థలకు లోను కాలేదు. పతివ్రతగా తనువు చాలించింది.

కుంతి, మాద్రి ఎంత సన్నిహితంగా ఉండేవారనేది యుద్ధం ప్రారంభం కాబోతున్నప్పుడు శల్యుని కారణంగా తెలుస్తుంది. మద్రదేశాధీశుడైన శల్యుడు మాద్రి సోదరుడు. పాండవుల పక్షాన యుద్ధం

చేయాలని బయలుదేరాడు. అతడు మహావీరుడు. దుర్యోధనుడు ఒక కపటవ్యూహం ద్వారా శల్యుని తన వైపున యుద్ధం చేసేటట్లు ఒప్పించుకొన్నాడు. అయినా శల్యుడు ముందు ధర్మరాజుని చూచి వస్తాను అని చెప్పి వెళ్లాడు. శల్యునికి పాండవులపట్ల ఉన్న అభిమానానికి మాద్రియే మూలాధారం.

కుంతివలె కార్యనిర్వహణాసామర్థ్యం మాద్రిలో ఉండడానికి అవకాశం లేదు. ఆమె సరళహృదయం, మృదుస్వభావి, వినయసంపన్న. భర్త ఎడల అనురాగం, కుంతిపట్ల గౌరవం తప్ప ఇతరములేమీ తెలియని ముద్దరాలు. రాజకీయసంక్షోభాలను తట్టుకోగల దిట్టతనం మాద్రిలో ఉండి ఉండవు. కనుకనే పాండురాజు హఠాన్మరణానికి తట్టుకోలేక పోయింది. భర్త విగతజీవుడు కావడం తన తప్పిదంగానే భావించింది మాద్రి. చిన్నవయస్సులో ఉన్న నకులసహదేవులను అక్కచేతిలో పెట్టడానికి ఈషణ్మాత్రం సందేహించలేదు ఆ పావనచరిత. కుంతిపట్ల గౌరవమే కాదు అమిత విశ్వాసం కల మాద్రి నకులసహదేవుల తల్లిగా మిగిలిపోయింది.

శల్యుడు పాండవులకు మేలు చేయాలనే పట్టుదలతో కర్ణుడిని దెప్పిపొడుస్తాడు. దుర్యోధనుడు శల్యుడిని కోరుకున్నదే అతని రథచోదక సామర్థ్యం కృష్ణునితో సరితూగుతుంది అని. మాద్రేయుడు అంతటివాడే. కాని అస్థానపతితమైంది శల్యుని ప్రతిభ. మాద్రి జీవించి ఉంటే ఏమి జరిగి ఉండేదో తెలియదు. తనపాత్ర ముగియగానే వెళ్ళిపోయే పాత్ర మాద్రిది.

* * *

# 7. గాంధారి

గాంధారదేశాధీశుడైన సుబలుని కూతురు గాంధారి. ధృతరాష్ట్రుని గురించి విని ఉన్నది. తండ్రి మాట ననుసరించి అంధుడైన ధృతరాష్ట్రుని వివాహమాడింది. భర్తకు దృగ్గోచరం కాని ప్రపంచాన్ని తాను కూడా చూడనని కళ్ళకు గంతలు కట్టుకొన్నది. ఈమె సోదరుడే శకుని. హస్తినాపురానికి గాంధారివెంట వచ్చి అచటనే ఉండిపోయాడు. క్రమంగా దుర్యోధనునికి చేరువయ్యాడు శకుని. మాయాజూదంలో బహునేర్పరి. దుర్యోధనుని మంత్రాంగంలో శకునిదే ప్రధానపాత్ర.

గాంధారి మహాపతివ్రత, సాధుశీల. కృష్ణద్వైపాయనుడు ఇచ్చిన వరంతో గర్భం ధరించింది. కాని సంవత్సరకాలం గడిచిపోయినా పుత్రోదయం కాలేదు. అప్పటికే కుంతికి ధర్మరాజు జన్మించాడని విని గాంధారి గర్భతాడనం చేసుకొన్నది. అప్పుడు ఒక పిండం బయటపడింది. కృష్ణద్వైపాయనుడు ఈ విషయం తెలిసికొనివచ్చి ఆ పిండాన్ని భద్రపరచమని దానినుండే నూరుగురు కుమారులు ఒక కుమార్తె పుడ్తారని చెప్పి ఆ పిండాన్ని నూరు ఒక్క ఖండాలుగా చేసి జాగ్రత్తగా కాపాడమని చెప్పి వెళ్ళాడు. ఆ విధంగానే దుర్యోధనాది వందమంది పుత్రులు, ఒక కుమార్తె దుస్సల ఉద్భవించినారు. గాంధారిలో పొడమిన అసూయ ఆ కుమారులకు సంక్రమించి ఉండవచ్చు. అది తప్ప గాంధారి ప్రవర్తనలో ఎక్కడా దోషం కనిపించదు.

పాండవులపట్ల తన కుమారులు అసూయాగ్రస్తులై వైరం పూనినప్పుడు కుమారులకు బుద్ధి గఱపుచూ వచ్చింది. ధృతరాష్ట్రునికి సైతం మంచి చెడులు వివరించి చెప్పగలిగిన వివేకవతి గాంధారి. జరగబోయే ఘోరవిపత్తును ముందే పసిగట్టగలిగింది. వారివైపు కృష్ణుడున్నాడు వారితో వైరం వలదు అని పలుమార్లు దుర్యోధనుడికి హితవు చెప్తుంది. నీవు

పాండునందనులకు రాజ్యభాగమిస్తే కాదనేవారు ఎవరు అని పుత్రవ్యామోహంతో జ్ఞానాంధుడు కూడా అయిన ధృతరాష్ట్రుని కూడా ప్రశ్నిస్తుంది. సంజయుడు రెండువైపుల బలాలను బేరీజు వేసినపుడు విదురుడు మాటలాడినపుడు సర్వం బోధపడింది గాంధారికి. కృష్ణుని మాటలు కూడా లెక్కపెట్టకుండా వ్యవహరించినపుడు ధృతరాష్ట్రుడు గాంధారి వివేకాన్ని, వైదుష్యాన్ని, రాజనీతిజ్ఞతను కంఠోక్తిగా పేర్కొని ఆమెను సభాస్థలికి తోడ్కొనిరమ్మని విదురుడిని పంపిస్తాడు. ఆమె శాయశక్తులా ప్రయత్నిస్తుంది, పలు రీతుల దుర్యోధనునికి జరగబోయే మారణహోమాన్ని గూర్చి వివరించి సంధి చేసుకొమ్మని చెప్తుంది. మూర్ఖోద్రేకి అయిన దుర్యోధనుడు ఆలకించడు. కుంతిమాట జవదాటరు పాండవులు. గాంధారిమాట లెక్కపెట్టరు కౌరవులు. అదీ తేడా.

కొడుకు యుద్ధానికి వెళ్ళేముందు ఆశీర్వదించమని అడిగితే ధర్మం ఎటువైపు ఉంటే అటువైపు విజయం ఉంటుందని చెప్పి తన ధర్మనిరతిని చాటుకొంది. కృష్ణుడు ధర్మం కోసం అవతరించిన భగవంతుడేనని ఎరిగిన కొద్దిమందిలో గాంధారి ఒకతె. యుద్ధం ముగిశాక యుద్ధరంగానికి వెళ్ళి మరణించిన కుమారులను తడిమి చూచుకొని విలవిలలాడింది. భర్తృమరణంతో, పుత్రశోకంతో విలపిస్తున్న స్త్రీలందరి మనోవేదనను అర్థం చేసుకొంటుంది. అభిమన్యుడిని తలచుకొని పరితపిస్తుంది. ఇంతటి ఘోరకలికి ధర్మరాజు కారణమని భావించి తనను, రాజును సందర్శించడానికి వచ్చినపుడు శపించబోతుంది. ఆ మహాసాధ్విశపిస్తే విధ్వంసం జరుగుతుందని తెలిసిన శ్రీకృష్ణుడు ఆమెను సమాధాన పరచడానికి ప్రయత్నిస్తాడు. పుత్రశోకంతో తల్లడిల్లుతున్న గాంధారి కోపం శ్రీకృష్ణుని యెడల తిరుగుతుంది. "కృష్ణా నీవు తలుచుకుంటే ఈ వైపరీత్యం జరిగేది కాదుకదా. ఎందుకిలా చేశావు. నా వంశంలాగానే

అంతఃకలహాలతో నీ వంశం కూడా నాశనం అవుతుంది" అని శపిస్తుంది. దైవం మానుషరూపేణ అనే విషయం శ్రీకృష్ణుని గూర్చి తెలిసికూడా ఆ మహాసాధ్వి అలా శపించింది అంటే ఆమె మనోవేదన అంత తీవ్రమైనదని, ఆమె అన్నట్లే జరుగుతుంది అని కృష్ణుడు ఎరిగినవాడు కనుక ఆ శాపాన్ని స్వీకరించాడు. యదువంశం ఆ రకంగానే అంతరించింది. కొద్దికాలం తర్వాత కృష్ణ అవతారసమాప్తికి బీజావాపనం జరిగింది.

గాంధారి ధృతరాష్ట్రుని కంటె బుద్ధిమతి, రాజనీతికోవిదురాలు, నీతివిచక్షణురాలు, ధర్మాధర్మకర్మలను ఎఱిగిన ధీమంతురాలు. కురుక్షేత్ర సంగ్రామానికి ముందే జరగబోయే పరిణామాలను క్షుణ్ణంగా అంచనా వేయగలిగింది. కనుకనే ఆ మాత్రం నిబ్బరంగా ఉండగలిగింది. కుంతి, ద్రౌపది, గాంధారి ముగ్గురు ప్రతిభాపాండిత్యాలు కలిగిన మహోన్నత వ్యక్తులు. ఒకవిధంగా విధి ఆడిన నాటకంలో తమ తమ పాత్రలను సమర్థవంతంగా పోషించినవారే. తొలిదేశలో అనేకానేక ఇడుముల పాలైన వారు కుంతీద్రౌపదులు. జీవితచరమాంకంలో పుత్రశోకంతో కానలకేగిన దురదృష్టవంతురాలు గాంధారి. ఆమెతోబాటు కుంతి అడవులకు పోయింది. బహుశా తన పుత్రులు ఆమె పుత్రులను వధించారు అనే ఒకానొక భావం కుంతిని బాధించి ఉండవచ్చు. గాంధారీధృతరాష్ట్రులకు కాని రాజ్యభోగాలు తనకు అవసరం లేదని వారిని చరమాంకంలో సేవించుకుందామని కుంతి ఈ నిర్ణయం తీసికొని ఉండవచ్చు.

* * *

# 8. హిడింబి

ఈమె రాక్షసవనిత. అసలు పేరు కమలపాలిని (కమలపాలిక). హిడింబాసురుడను రాక్షసుని చెల్లెలు. ఒక విధంగా చూస్తే కుంతీదేవి పెద్దకోడలు, భీమసేనుని మొదటి భార్య. అన్నిటికీ మించి ఘటోత్కచుని కన్నతల్లి. కామరూపధర, భూతభవిష్యద్వర్తమానాలు తెలియగల నేర్పరి.

లక్క ఇంటి నుంచి రహస్య సొరంగమార్గం ద్వారా బయటపడి హిడింబాసురుడుండే వనానికి చేరతారు కుంతి, పాండవులు. సాయంకాలానికి ఒక మర్రిచెట్టును చేరుకొన్నారు. ఆ మర్రిచెట్టు ఎక్కి ఒక జలాశయాన్ని చూచి భీముడచటికి వెళ్ళి స్నానాదులాచరించి, నీరు త్రాగి, కమలపత్రాల దొన్నెలలో తల్లికి సోదరులకు నీళ్ళు తెచ్చుచుండగా మార్గాయాసం చేత బడలికతో వారు నిద్రకొరిగినారు. భీముడు వారికి రక్షణగా నిలబడ్డాడు. వారిని మద్దిచెట్లచాటునుంచి చూచిన హిడింబుడు వారిని చంపి వండిపెట్టమని చెల్లెలైన హిడింబిని కోరాడు. హిడింబి వారిని చాటు నుంచి చూసింది. సింహబలుడైన భీముని ఆకారం ఆమెను మదనతాపానికి గురిచేసింది. కొంతసేపు అచటనే తచ్చాడి అతిమానుష సౌందర్యరూపాన్ని ధరించి భీమసేనుని సమీపించింది హిడింబి. అన్న కోరికను అవతలబెట్టింది. భీముని సమీపించి తన కోరికను తెలియపరచింది. మా అన్న హిడింబుడు రాకముందే వీరిని తీసుకొని వెళ్ళిపోదాం అని అడిగింది. అందుకు ఒప్పుకోని భీముడు వారికి నిద్రాభంగం చేయనని పలికాడు. ఇంతలోనే హిడింబుడు అక్కడికి వచ్చి హిడింబిని కసరుకొని భీమునితో మల్లయుద్ధం చేయసాగాడు. నిద్రనుండి మేల్కొంచిన కుంతి, తక్కిన పాండవులు ఆమె మానవాతీత సౌందర్యాన్ని చూచి ఆశ్చర్యపోయారు. ఆమెవలన భీమ హిడింబుల యుద్ధాన్ని గురించి విని అక్కడికి వెళ్ళారు.

అత్యంత సాహసంతో భీముడు హిడింబుని వధించాడు. వారు వెళ్ళబోతున్న సమయంలో హిడింబి వారివెంట బయలుదేరబోయింది. భీముడందుకు ఒప్పుకోక ఆమెను కోపగించాడు. ధర్మజుడాతనిని వారించి ఆమె కోరిక నంగీకరించుమని భీమునితో చెప్పాడు. కుంతి కూడా భీమునికి నచ్చజెప్పింది. హిడింబి వారికి శాలిహోత్రుని ఆశ్రమాన్ని గురించి, అక్కడుండే జలాశయంలో నీళ్ళు తాగితే ఆకలిదప్పు లుండవనీ, అక్కడకు వ్యాసుడు వచ్చి ఉపదేశం చేయగలవాడనీ చెప్పింది. పుత్రోదయం వరకు ఆమెతో ఉండడానికి భీముడు అంగీకరించాడు.

ఆమెను కుంతి, ధర్మరాజు ఆదరించారు. హిడింబికి పుట్టిన కుమారుడే ఘటోత్కచుడు.

సద్యోగర్భమున పుట్టి నవయౌవనుడై తండ్రికి, తల్లికి, కుంతికి తక్కిన పాండునందనులకు నమస్కరించి ఎప్పుడు తలచుకుంటె అప్పుడు రాగలవాడినని చెప్పి భూతపిశాచగణములతో వెళ్ళిపోయాడు. హిడింబి కూడా కొడుకు ననుసరించి ఉత్తరదిశగా వెళ్ళింది. ఘటోత్కచుడు భారతయుద్ధంలో పాల్గొన్న మహావీరుడు. భీమసదృశుడైన ఇతర రాక్షస మాయచేత అదృశ్యరూపుడై కౌరవసేనలను కకావికలు చేసినపుడు దుర్యోధనుడు కర్ణుని సమీపించాడు. సహజ కవచకుండలాలను గ్రహించినపుడు ఇంద్రుడిచ్చిన నాగాస్త్రాన్ని ఇతని మీద ప్రయోగించ వలసిందిగా కోరాడు. ఆ శక్తిని అర్జునుడి మీద ప్రయోగించడం కోసం ఉంచానని కర్ణుడు చెప్పినా రారాజు వినలేదు. విధి లేక కర్ణుడు దాన్ని ఘటోత్కచుడిమీద ప్రయోగించాడు. ఆ రాక్షసవీరుడు మరణించాడు, అర్జునుడు బ్రతికిపోయాడు. ఒక విధంగా తనంతతానై వలచి వచ్చిన హిడింబిని భీముడు పరిగ్రహించడంవలననే ఘటోత్కచుడి జననం, కురుక్షేత్రయుద్ధసమయంలో అతిమానుషయుద్ధం జరుపుతున్న

ఘటోత్కచుని మీద ఇంద్రశక్తిప్రయోగం, తత్కారణంగా అర్జునుని రక్షణం ఒకదాని వెంట మరొకటి ఘటించాయి.

ఇది శ్రీకృష్ణుని ప్రణాళిక కావచ్చు. ఏది ఏమైనా రాక్షసస్త్రీ అయిన హిడింబి భీమసేనుని ఆ మాటకు వస్తే పాండవుల పాలిట వరదేవత అయింది. మహాసాధ్వి అన్నా తప్పు ఎంత మాత్రం లేదు.

కోరుకున్న వ్యక్తితో కొంత కాలం గడిపి పుత్రోదయం అయిన తర్వాత వెళ్ళిపోవడం ఆ కాలంలో తప్పు కాదేమో. అన్న కంటె ముందు వివాహం చేసుకోవడం భీముడికి అంగీకారంకాలేదు కాని తల్లి, అన్న హిడింబి వినయవిధేయతలకు మెచ్చి అంగీకారం తెలపడం చూస్తే జాతిని బట్టి కాక గుణాన్ని బట్టి వ్యక్తిని అంచనా వేయవలసి ఉంటుంది. ఆ విధంగా ఘటోత్కచుడు పాండవుల కుమారులలో అగ్రజుడయ్యాడు. కర్ణుడు ఆతనిని చంపడం యాదృచ్ఛికమా, విధివిలాసమా తెలియదు. హిడింబి వీరపత్ని, వీరమాత అని మాత్రం చెప్పుకోవలసి ఉంటుంది. హిడింబి, సుభద్ర మహావీరులైన కుమారులను కని కూడా పుత్రశోకాన్ని అనుభవించవలసినవారైనారు. యుద్ధం ఎవరినీ వదలిపెట్టదు.

* * *

# 9. ద్రౌపది

ద్రుపద రాజపుత్రి, అయోనిజ, అగ్నిసంభవ ద్రౌపది. ఈమె పుట్టుకయే విశేషం. ద్రుపదుడు ద్రోణుడు సహాధ్యాయులు. ద్రుపదుడు రాజైన పిమ్మట ద్రోణుని అవమానించాడు. ద్రోణుడు సమయం కోసం వేచి ఉండి అర్జునుని అస్త్రవిద్యాపారంగతుని చేసి గురుదక్షిణగా ద్రోణుని పట్టి తెమ్మన్నాడు. ద్రుపదుడు ఆ అవమానాన్ని సహించలేక ద్రోణుని చంపగల కుమారుడు, అర్జునుని పెండ్లియాడగల పుత్రిక కావలెనని యజ్ఞం చేశాడు. అగ్ని నుండి ధృష్టద్యుమ్నుడు, ద్రౌపది ఉద్భవించారు. అంతటి ఉత్కృష్ట జన్మమామెది. ఆమె అసలుపేరు కృష్ణ. ద్రుపదుని కూతురు కనుక ద్రౌపది, పాంచాలరాజుకూతురు కనుక పాంచాలి అయింది.

ఆమెకు తగిన వరుడు అర్జునుడేయని ద్రుపదునికి తెలుసు. కాని పాండవుల జాడ తెలియదు. అందుచేత మత్స్యయంత్రాన్ని నిర్మింపజేసి దాన్ని భేదించినవానికి కూతురితో వివాహం జరిపిస్తానని చాటింపు వేయించాడు. ద్రౌపది అసమాన సౌందర్యవతి, పాంచాలదేశాధీశుని కొమరితకావడంచేత అనేక రాజ్యాధిపతులు ఆ స్వయంవరానికి విచ్చేసారు. కర్ణదుర్యోధనులు, బ్రాహ్మణవేషంలో ఉన్న పాండవులు కూడా అచటికి వచ్చారు. వారు తప్పకుండా వస్తారని ఊహించిన శ్రీకృష్ణుడు కూడా పాంచాలనగరానికి వచ్చాడు.

అర్జునుడు మత్స్యయంత్రాన్ని భేదించాడు. ద్రౌపది అతనిని వరించింది. ఆమెను వెంట బెట్టుకొని పాండవులు తల్లివద్దకు వెళ్లారు. భిక్ష తెచ్చామని వారు చెప్పగానే సమానంగా పంచుకొమ్మని కుంతి పలికింది. ఇది అనాలోచితమా, దైవసంకల్పమా ఎరుగరానిది. ఒకస్త్రీ ఐదుగురు పురుషులను వివాహమాడడం ధర్మవిరుద్ధమని వారు

సంకోచించారు. వారిని రహస్యంగా అనుసరించి వచ్చిన ధృష్టద్యుమ్నుడు తండ్రికి ఈ విషయం తెలియజేశాడు. ద్రుపదుడు కూడా ఇది తగనిపని అని సంకోచించాడు. వ్యాసుడు అచటకి ఏతెంచి ద్రౌపది పూర్వజన్మ వృత్తాంతాన్ని ఎరుకపరచి, అది ధర్మసమ్మతమే, దైవనిర్ణయమే అని వారిని సమాధానపరిచాడు. ద్రౌపది పాండవులు ఐదుగురికీ భార్య అయింది. ఇందులో ఆమె ప్రమేయం ఏమీలేదు. నారదుడు చెప్పిన నియమం ప్రకారం ఒక్కొక్క సంవత్సరం ఒక్కొక్కరికి భార్యగా మెలిగింది. ద్రౌపది అపురూపమైన సౌందర్యం, ఆభిజాత్యం, మహోన్నతమైన వ్యక్తిత్వం, ధీరచిత్తం కలిగిన స్త్రీరత్నం. అయినా పెద్దల మాటలకు తల ఒగ్గి నిలిచింది. మహాపతివ్రతగా మన్ననలందుకొన్నది. ఆ అత్తాకోడళ్ళ అనుబంధం ఎలా ఉంటే బాగుంటుందో కుంతి, ద్రౌపది మధ్య గల సంబంధం తెలియజేస్తుంది.

**"మా అత్త పృథ్వీసమాన పృథాదేవి**
**కుంతిభోజాత్మజ కోమలాంగి**
**సతతంబు భోజన స్నానాదికములయం**
**దిమ్ముగ పరిచర్య యేన చేసి – సంప్రీతి చేయుదు** అని ద్రౌపది సత్యభామతో చెప్తుంది.

**"ధవళాక్షీ నీ కతంబున**
**పవిత్రమై ద్రుపదుకులము పాండుకులంబున్**
**భువనంబుల వెలిగె"** నీవు పుట్టడంచేత, మెట్టడంచేత అని కుంతి ప్రశంసిస్తుంది ద్రౌపది. అంతేకాక "అమ్మా! నిను నమ్మి చాల విషమంబగు నివ్వనవాస మీతడుంబూనగ నియ్యాకొంటి'' అని వనవాసానికి పాండవులు వెళ్ళేటప్పుడు కుంతి ద్రౌపదితో అంటుంది. వీడు కదు పసిబిడ్డ అని సహదేవుడిని ద్రౌపదికి అప్పగిస్తుంది. రాయబారానికి వచ్చిన శ్రీకృష్ణుడు మేనత్త అయిన కుంతిని సందర్శించడానికి వెళ్ళినప్పుడు

"కొడుకుల కంటె నయ్యనుగు కోడలి కెక్కుడు గూర్తు", కోడలు కూడ కొడుకులు చేయు భక్తికి కోటిరెట్లు భక్తి నాకెప్పుడు చేస్తుంది అని సంభావిస్తుంది. యుద్ధమే జరగాలని కుంతి కోరుకుంటుంది. ఎంచేత నంటే "ద్రుపదాత్మజ కార్యంబడుగు మనుము దగనందఱతోనే" అనడంలో సంధి సరే ద్రౌపదికి జరిగిన పరాభవం మాటేమిటి అని ప్రశ్నిస్తుంది కుంతి.

ద్రౌపదిమానసంరక్షణమే కాకుండా ఆమె చిచ్చొడిగట్టినట్లు పదమూడేండ్లు భరించిన అవమానభారాన్ని తగ్గించి దానికి పరిహారం చేసినవాడు కూడా శ్రీకృష్ణుడే. రాయబారసందర్భంలో అది స్పష్టమౌతుంది.

భిక్ష తెచ్చామని పాండవులు చెప్పినపుడు అనాలోచితంగా సమానంగా పంచుకొమ్మని పలికింది కుంతి. ఆ కారణంగానే ద్రౌపది అన్ని కష్టాలు పడవలసివచ్చింది అని కుంతి మనసులో ఒకానొక పశ్చాత్తాప సదృశమైన భావన ఉండి ఉంటుంది. అందుచేతనే ఆమె ఐదూళ్ళడిగిన ధర్మరాజుపక్షాన మాట్లాడకుండా "రారాజు పీనుగు కన్నారగ కాంచవలె"నని కోరిన ద్రౌపది పక్షాన నిలబడింది. శిష్టరక్షణ, దుష్టశిక్షణ పూని నడచుకోవలసిన సమయం ఆసన్నమైందని ఆ కృష్ణుడినే వేడుకొన్నారు. ఒక్కమాటమీద నిలబడటం అనే లోకోక్తిని సార్థకం చేసిన మహిమాన్విత స్త్రీ మూర్తులు కుంతి, ద్రౌపది. వారి మనోరథం ధర్మబద్ధం అయింది కనుక కృష్ణుడు దాన్ని నిర్వహించాడు.

ద్రౌపది అసమాన సౌందర్యవతి. నల్లకలువల కాంతి, సౌరభం, కలువరేకులలాంటి కళ్ళు, నల్లత్రాచువలె భాసించే కేశపాశం ఆమె సొత్తు. కాని ఆ సౌందర్యమే ఆ కాలంలోని పురుషులెందరినో ఆకర్షించింది. ఆమె అగ్నిశిఖ. దగ్గరకు వెళ్ళిన నీతిబాహ్యులు శలభాల్లాగ మాడి మసైపోయారు.

అందానికి తోడు ఆమెకు ఆభిజాత్యం కూడా ఎక్కువే. ద్రుపదుడు పాంచాలదేశాధీశుడు తండ్రి. మహాపరాక్రమశాలి వరపుత్రుడు ధృష్టద్యుమ్నుడు సోదరుడు. తదనంతరకాలంలో శ్రీకృష్ణుని మన్ననకు పాత్రురాలైన అతివ.

ద్రౌపది పుట్టిందే అర్జునుని కోసం. ఆమె మనసులో ఉన్నది అర్జునుడే. ద్రుపదుడు కష్టసాధ్యమైన మత్స్యయంత్రాన్ని నిర్మింపజేసింది ఎక్కడ ఉన్నా అర్జునుడు వస్తాడని, అతడు మాత్రమే దానిని ఛేదించ గలడనీ.

పాంచాలరాజకుమారిగా పుట్టినింట భోగభాగ్యాలు అనుభవిస్తుండిన ద్రౌపది ఒక్కసారిగా ఏకచక్రపురంలో ఒక పేద బ్రాహ్మణ కుటుంబంలోకి అడుగుపెట్టవలసిరావడం ఎలాంటిదంటే శిఖరం మీద నుండి అగాథంలో పడడం లాంటిది. భర్తలు తెచ్చే భిక్షమీద ఆధారపడి జీవించవలసిరావడం ఆమె సహనానికి పెట్టబడిన మొదటి పరీక్ష.

అయిదుగురు భర్తలను కలిగి ఉండడం ఏ కాలంలోనైనా కొంత పరిహాసాస్పదం. ఇవన్నీ ఒక ఎత్తుకాగా వారినందరినీ ఏకకాలంలో సమ్మానపూర్వకంగా సేవించడం మరీ కష్టం. నారదుడు సమయం ఏర్పరచి ఉండకపోతే ఆమె జీవితం నరకసదృశం అయి ఉండేది. అప్పుడైనా కత్తి మీద సాము లాగానే గడిచి ఉంటుంది ద్రౌపది జీవితం. అడుగడుగునా ఆమెకు ఎదురైన అనుభవాలు ఈ విషయాన్నే స్పష్టం చేస్తున్నాయి. స్వయంవరసమయంలో సూతపుత్రుడిని వరించను అని ద్రౌపదిపలికిన పలుకులు కర్ణుడి మనసులో గాఢంగా శూలాలవలె గుచ్చుకున్నాయి. అందుచేతనే ఆతడు దుర్యోధనుడిని రెచ్చగొట్టాడు. వావి వరుసలు లెక్కచేయకుండా సైంధవుడు ఆమెను అపహరించాలని చూచాడు. అమిత పరాక్రమవంతులైన గంధర్వులు తనపతులు అని చెప్పినా విడిచిపెట్టలేదు కీచకుడు. ఆమె అర్జునుడిని ఎక్కువ

ఇష్టపడుతుందని ధర్మజుడు తలపోసిన విషయం స్వర్గారోహణ సమయంలో బయటపడింది. పతులలో ఆమెను ఎక్కువ ఇష్టపడింది భీమసేనుడు అని మనకు తోస్తుంది. కనుకనే తన ఇష్టాలను, కష్టాలను అతనికే విన్నవించుకొంది ద్రౌపది.

ఇదిలా ఉంటే దుర్యోధనుడి అసూయ ఇంకా పెరిగింది. ద్రౌపది పాండవపత్నికావడం దుర్యోధనునికి అసూయను కలిగించింది. పాండవులను రావించి వారికి కొంత రాజ్యభాగమిచ్చి ఇంద్రప్రస్థపురానికి పంపించాడు ధృతరాష్ట్రుడు. తమ్ముల సహాయంతో రాజసూయం చేశాడు ధర్మరాజు. అవభృథస్నానం చేసి పవిత్రమైన కేశపాశంతో విరాజిల్లింది ద్రౌపది. మయసభలో ప్రవేశించిన దుర్యోధనుడు నీళ్ళులేని చోట నీరుందని భ్రమసి దుస్తులను పైకి ఎత్తి పెట్టుకొన్నాడు. జలం ఏ మాత్రం లేవనుకుని ఒక చోట కాలిడి వస్త్రాలను తడుపుకొన్నాడు. అది చూచి ద్రౌపది నవ్వింది. ఈ పరిహాసాన్ని రారాజు తట్టుకోలేకపోయాడు. ఆ పరాభవానికి తగిన ప్రతీకారం చేసితీరాలనుకున్నాడు దుర్యోధనుడు. ఇది భారతకథలో అత్యంత ప్రధానమైన ఘట్టానికి బీజమైంది. రోషంతో హస్తినకు తిరిగి వెళ్ళిన సుయోధనుడు శకుని ఆలోచన మేరకు ధర్మరాజును జూదానికి పిలవడం, మాయాజూదంలో ఓడించడం వెనువెంటనే జరిగిపోయాయి.

ఈ కుతంత్రాలు ఏమీ తెలియని ద్రౌపది అంతఃపురకాంతలతో సంభాషిస్తూ ఉండిపోయింది. అప్పుడు జరిగింది ఒక ఘోరమైన పరిణామం. ధర్మరాజు తనను, తమ్ములను జూదంలో పణంగా పెట్టి ఓడిపోయాడు. అంతకుముందే సమస్తసంపదలను రాజ్యాన్ని కోల్పోయాడు. శకుని ప్రోద్బలంతో ద్రౌపదిని కూడా పణంగా పెట్టి పరాజయం పాలౌతాడు. ధర్మరాజు ఈ విధంగా చేయడం అపరాధం అనే చిన్నమాటతో సరిపెట్టలేం. కాని అలా జరిగిపోయింది. ఇక్కడ

నుంచి అతివేగంగా అనేక అనర్థాలకు మూలమైన సంఘటనలు జరిగిపోయాయి ద్రౌపది కేంద్రబిందువుగా.

ఆమెను సభకు తీసుకొనిరమ్మని ప్రాతిగామిని పంపిస్తాడు దుర్యోధనుడు. ధర్మరాజు నన్నోడి తన్నోడెనా, తన్నోడి నన్నోడెనా అని ధర్మసంకటమైన ప్రశ్నవేసి సమాధానం ధర్మరాజునే అడిగిరమ్మని పంపిస్తుంది. ధర్మరాజు నిరుత్తరుడౌతాడు. అప్పుడు దుశ్శాసనుడు వస్తాడు. ఏకవస్త్రను, రజస్వలను సభాసదుల ముందటికి రాజాలను అని ద్రౌపది చెప్తుంది. అయినా వినకుండా ఆమెను జుట్టు పట్టుకొని ఈడ్చుకొని పోయాడు సభకు దుశ్శాసనుడు. కర్ణుని మాటలతో ఇంకా రెచ్చిపోయి తన తొడమీద కూర్చుండమని సంజ్ఞచేస్తాడు రారాజు. ఏకవస్త్రను వివస్త్రను చేసినా తప్పులేదు. ఈమె పంచభర్తృక కాబట్టి బంధకి అంటాడు కర్ణుడు. పైగా ఈయేవురికంటె జూదమాడి ఆలిని ఓడని ఒక భర్తను స్వీకరించు అని హేళన చేస్తాడు.

ఇదంతా జరుగుతున్నప్పుడు భీష్మద్రోణాదులు ఆ సభలోనే ఉన్నారు. కర్ణుని కొడుకు వికర్ణుడు మాత్రమే ఇది కూడనిపని అని మాటలాడతాడు. పాండవులు నలువురు చిత్తరువులవలె కూర్చున్నారు. భీముడు మాత్రం దుర్యోధనుని ఊరుభంగం చేసి చంపుతాననీ, దుశ్శాసనుని రక్తం ఆస్వాదిస్తాననీ 'లోకభీకరలీల' వధిస్తానని భీకరమైన ప్రతిజ్ఞ చేస్తాడు. అప్పుడు కురుక్షేత్రసంగ్రామానికి నాందీప్రస్తావనలు జరిగాయి. ద్రౌపది శోకతప్తయై రోదిస్తూ శ్రీకృష్ణుని వేడుకొంటుంది. పరమాత్మ అఖండ వస్త్రదానాన్నిచ్చి ఆమె పరువును కాపాడతాడు.

ద్రౌపదికి జరిగిన పరాభవం ఏకాలంలో ఎవరికీ జరగరానిది. దాని ఫలితమే కురుక్షేత్రంలో జరిగిన యుద్ధం.

గాంధారి ప్రతి సందర్భంలోనూ ద్రౌపదిని సగౌరవంగా సమ్మానిస్తుంది. ఆ సందర్భంలో ధృతరాష్ట్రుడు కూడా నా కోడండ్రయందు అభ్యర్చితవు" అని ఆదరించి వరమిస్తాను వేడుకొమ్మంటాడు. ఆమె అప్పుడు కూడా ధర్మరాజును దాస్యవిముక్తుని చేయమని కోరుకుంటుంది. ఇంకోవరం అడగమంటాడు రాజు. తక్కిన నలువురు పాండవులను, వారి వారి ఆయుధాలతో విముక్తులను చేయమని అడుగుతుంది యాజ్ఞసేని. మరొక్క వరమిస్తానని అని ధృతరాష్ట్రుడు అంటే క్షత్రియ సతి రెండు వరాలు మాత్రమే కోరుకొనడానికి అర్హురాలు అంటుంది. ఆమె సాంఘికాచార తెలివిడి అంతటిది. మరోవరం రాజ్యం ఇమ్మని అడిగి ఉండవచ్చు. కాని అడగలేదు. ఆమె ధీరవనిత! దానంగా లభించే రాజ్యసంపదను కోరలేదు. ముందుముందు పతులను యుద్ధానికి ప్రేరేపిస్తుంది. రాజులకు యుద్ధం ఉచితమైనదే కాని భిక్షస్వీకరించడం తగదని వాదిస్తుంది కూడా.

ఇంత జరిగినా ధర్మరాజు మళ్ళీ జూదమాడి అరణ్యవాసం, అజ్ఞాతవాసం బారిన పడతాడు. ద్రౌపది వెళ్ళనవసరంలేదు వారివెంట. కాని ఎల్లవేళలా పతిని అనుసరించి ఉండాలనే నాటి ధర్మం ఆమెకు స్వీకారయోగ్యమైంది. పతులు దూషింపదగిన పనులు చేసినా వారి ననుసరించి ఉండడమే ఆనాటి సాంఘిక ఆచారం. దమయంతి నలుని అనుగమించడం గుర్తు వస్తుంది. అడవులలో అన్ని ఇడుములు పడుతున్నా ఆ ద్రుపదనందన ఓర్చుకొన్నది. సహనశీలం, క్షమాగుణం ఆమె శీలానికి మెరుగుపెట్టిన అంశాలు. భారతేతిహాసంలో మాయని మచ్చగా మిగిలింది ద్రౌపదీవస్త్రాపహరణప్రయత్నం.

కానలకేగినా ద్రౌపదికి విపత్కర పరిస్థితులు ఎదురవ్వడం తగ్గలేదు. ఆమె సౌందర్యం ఆమెకు వరమా శాపమా అంటే శాపమనే చెప్పుకోవాలి. సింధుదేశానికి రాజైన సైంధవుడి అసలు పేరు జయద్రథుడు. ఇతడు

దుర్యోధనుని సోదరియైన దుస్సల భర్త. ఒకనాడు అడవిలో ద్రౌపదిని చూచి ఆమె సౌందర్యానికి ఆశ్చర్యచకితుడై ఆమెకు తన వాంఛను తెలియజేసి తనతో రమ్మని కోరాడు. దుస్సల భర్తవు, నీవు నాకు సోదరుని వంటివాడవు అని ఎంత నచ్చజెప్పినా వినకుండా తన రథం మీద బలవంతంగా ఎక్కించుకొని పోసాగాడు. ద్రౌపది ఆర్తనాదాలు విని వేటకు వెళ్ళి ఉండిన పాండవులు ఆతనిని వెంబడించి పట్టుకొని దుస్సల భర్త కనుక చంపకుండా శిరోముండనం చేసి వదిలిపెట్టారు. తదాదిగా అతడు పాండవుల మీద పగబూని కురుక్షేత్రసంగ్రామంలో దుర్యోధనునికి అండగా నిలిచి పద్మవ్యూహంలోకి పాండవులు ప్రవేశించకుండా అడ్డుకొన్నాడు. అభిమన్యుడు నిస్సహాయుడై పలువురు చుట్టుముట్టగా నిహతుడయ్యాడు.

ఆమె అక్షయపాత్రసహాయంతో అరణ్యవాసకాలంలో తమవెంట నడచిన ఆశ్రితులందరికీ భోజనం పెట్టేది. ఇది సూర్యానుగ్రహంచేత లభించింది. ఒకనాడు దుర్వాసుడు కౌరవుల కోరిక మేరకు పాండవులుండే చోటికి వచ్చి తన వెంట వచ్చిన వేయిమంది శిష్యులకు భోజనం పెట్టమని అడిగాడు. అప్పటికే ద్రౌపది అక్షయపాత్రను కడిగివేసింది. దుర్వాసుడు వచ్చి శాపం ఇస్తాడని భయపడి కృష్ణుని ధ్యానించింది. కృష్ణుడు వచ్చి ఆకలిగొని ఉన్నాను ఏమైనాఉంటే పెట్టుమని ద్రౌపదిని అడిగాడు. అక్షయపాత్ర అడుగున ఒక్కమెతుకు దాగియుండెను. దానిని శ్రీకృష్ణుడు భుజించినంతనే దుర్వాసాదులకు భుక్తాయాసం కలిగి నదీస్నానానంతరం అటు నుంచి అటే వెళ్ళిపోయారు. ఇది ద్రౌపదికి భగవంతుడిచ్చిన అభయమహిమ.

వారు అడవులలో సంచరిస్తున్నప్పుడు ఒక కుసుమం గాలికి ఎగిరి వచ్చి పాండవుల సమీపంలో పడింది. దాన్ని భీముడామెకు ఇచ్చాడు. దాని పరిమళానికి ముగ్ధురాలై అటువంటి పుష్పాలు మరికొన్ని కావాలని

ద్రౌపది కోరింది. భీముడు ఆ సౌగంధిక పుష్పాలు చోటికి వెళ్ళి ఆ ఉద్యానవనాన్ని రక్షిస్తున్న గంధర్వులతో యుద్ధం చేసి వారిని ఓడించి మరికొన్ని పుష్పాలను తెచ్చి ద్రౌపదికి ఇచ్చాడు. ఒకప్పుడు శ్రీకృష్ణుడు పాండవులను చూడడానికి వచ్చినప్పుడు ద్రౌపది తన కష్టాలను విన్నవించుకొని విలపించింది. క్షత్రియుడైన ధర్మరాజు యుద్ధం చేసి తన రాజ్యాన్ని తాను గెలుచుకోవాలని వాదించింది. ధర్మరాజు ఆమె మాటను ఆలకించలేదు. కర్మఫలాన్ని అనుభవించితీరాలని, అరణ్యవాసం ముగిసిన తర్వాత అజ్ఞాతవాసం చేయాలని చెప్తూ ధర్మోపదేశం చేసాడు. భర్తమాట జవదాటరానిదని ద్రౌపదికి కూడా తెలియవచ్చింది.

ఆ కాలంలోనే ఒకసారి సత్యభామ శ్రీకృష్ణునితో పాండవులను చూడవచ్చింది. ద్రౌపదిని ఒక విచిత్రమైన ప్రశ్న అడిగింది. ఇంతులు భర్తలను వశవర్తులను చేసుకొనే మంత్రం, మందు ఉంటే చెప్పమని. నీవు ఐదుగురు భర్తల అనురాగాన్ని ఏ విధంగా పొందగలుగుతున్నావు, ఆ వశీకరణవిద్యరహస్యం తనకు చెప్తే మాధవుడిని తన కనుసన్నలలో తిప్పుకొంటానని. ఇది నిజానికి కృష్ణసతి అడగదగిన అంశం కాదు. ఏదో ఒక నెపం మీద పతివ్రతాధర్మాలను పదేపదే ఉటంకించడం పురాణేతిహాసాలలో తరచు జరుగుతుంది. ద్రౌపది నిరాదరణతో కూడిన నవ్వు నవ్వి కృష్ణుని ప్రియసతి అన్న గౌరవంతో పతివ్రతాధర్మాలను వివరిస్తుంది. ద్రౌపది ఎల్లవేళలా పతులను గౌరవాదరాలతో సమ్మానించి నడచుకొనేది అన్నసంగతి ఈ సందర్భంలో ఆమె మాటలలోనే తేట తెల్లమౌతుంది.

అరణ్యవాసంలో ఎన్ని ఇడుములు పడినా భర్తల సంరక్షణలో తమ్ము ఆశ్రయించి ఉన్నవారి ఆదరాభిమానాలతో గడిపింది ద్రౌపది. తరువాత అజ్ఞాతవాసం. ఇంకా క్లిష్టమైంది. దాచితే దాగని తేజోవంతమైన రూపం ఆమెది. ఎలా కాలం వెళ్ళదీస్తుంది అని మథనపడతాడు ధర్మరాజు.

అంతటితో ఊరుకోకుండ వంశమర్యాదకు భంగం రానివ్వవద్దని కోరతాడు. అమిత సౌందర్యరాశి కనుక తులువలు ఆశిస్తారని జాగ్రత్తగా ఉండాలనీ హెచ్చరిస్తాడు. ద్రౌపది "అనాదర మందస్మిత వదనారవిందయై" ఆత్మవిశ్వాసం ముప్పిరికొనగా సైరంధ్రీవృత్తిని స్వీకరిస్తానని, మాలిని పేరుతో కాలం గడపగలననీ చెప్తుంది. ధర్మరాజు తీరికూర్చుని ఆమెకు అవమానం జరుగుతుందేమో అని భయపడుతున్నట్లు మాట్లాడినందుకు ఆమెకు అనాదరం కలిగింది. జరగకూడని పరాభవం నిండుసభలో వృద్ధులు, పెద్దలు ఉండగా కూడా జరిగిపోయింది. పతులు రక్షించే ప్రయత్నం చేయకపోవడం ఆమెను మరీ బాధించింది. తదాదిగా ద్రౌపదిలో ఒక తెగువ కనిపిస్తుంది.

ఆమెను తొలుత చూచినప్పుడు సుధేష్ణ (విరటుని పట్టమహిషి) "సుర గరుడ ఖేచర విద్యాధర కిన్నర యక్ష సిద్ధ తరుణులలో నొక్కత యగు" అని తలచింది. తన్ను సైరంధ్రీవృత్తిలో స్వీకరించమని ద్రౌపది అడిగినప్పుడు ఈమెను చూచినట్లైతే తన భర్త అయిన విరటుడు సైతం ఆకర్షణకు లోను అవుతాడని భయపడింది. విరటుడు కాదుగాని సింహబలుడైన కీచకుడు ఆమెను చూచి 'ఎందును ఇట్టి రూపు నాకే కాదు ఇంద్రుని కుమారుడైన జయంతునికి సైతం మరులు కలగక మానవు' అని నానావిధాలుగా ద్రౌపదిసౌందర్యాన్ని ప్రశంసిస్తాడు. ఆమెను తన వద్దకు పంపమని అక్కయైన సుధేష్ణను అర్థిస్తాడు. అటుపైన మదిరను తెమ్మని సుధేష్ణ ద్రౌపదిని కీచకుని ఇంటికి పంపిస్తుంది. సంశయాత్మ అయిన ద్రౌపది విధిలేని పరిస్థితులలో అచటికి వెళ్తుంది. కీచకుడు ఆమెను పట్టుకొన ప్రయత్నించి భంగపడి సభకొలువై ఉన్న చోటికి ద్రౌపదిని తరుముకుంటూ వెళ్తాడు. ద్రౌపది ఎంత మొరపెట్టుకున్నా ఎవరూ మారు పలకరు. కురుసభ పునరావృతం కాబోయే సందర్భంలో ధర్మరాజు ఆమెను మందలిస్తాడు – అజ్ఞాతవాస సమయంలో పదిమంది

ముందు తమ రహస్యజీవనం బట్టబయలు అవుతుందని భయపడతాడు. కీచకుని చేత భంగపడిన ఆ సన్నివేశంలో ద్రౌపదికోపం తీవ్రస్థాయికి చేరుకొంటుంది. ఒక స్త్రీకి ఇంత అవమానం జరుగుతుంటే సభలోని వారెవ్వరు మాట్లాడకపోవడంతో ఆమె క్రోధం రెట్టింపు అవుతుంది. ధర్మజుడు కులసతులు ఈ విధంగా సభలో పలుపోకలు పోయి నాట్యకత్తెలా ప్రవర్తించడం తగదు అనడంతో ద్రౌపది కోపం తారాస్థాయికి చేరుకుంది. 'మత్పతి శైలాషుండ కాడు కితవుడును' అని నర్మగర్భంగా దెప్పిపొడుస్తుంది. ఆ సమయంలో అర్జునుడు బృహన్నల రూపంలో అంతఃపుర కాంతలకు నాట్యం నేర్పిస్తున్నాడు. ధర్మరాజు జూదం ఆడుతున్నాడు. జూదరి ఆలికి గౌరవం ఎక్కడుంటుంది అది తిరస్కారంగా, సాభిప్రాయంగా, కొంత సాహసంగా మాట్లాడింది ద్రౌపది. ఇది ఆమె వ్యక్తిత్వం! కీచకుని ఇంటికి వెళ్ళబోయే ముందు ఆమె శ్రీకృష్ణుని తలచుకొంటుంది. తన్ను రక్షింపుమని సూర్యభగవానుడిని వేడుకొంటుంది. నేను పాండవులకు తప్పని పతివ్రతను అయితే అని ప్రతిన బూనుతుంది. సూర్యుని పనుపున వచ్చిన దైత్యుడు ఆమెను కీచకుని బారిన పడకుండా ఆమెను రక్షిస్తాడు. ఆమె పతివ్రతామహిమ అంతటిది.

ఆ రాత్రి ఆమె భీముని చెంతకు వెళ్ళి తన భంగపాటు చెప్పుకొని ఏడ్చింది. "వాని దెగ జూడవైతేని వాయుపుత్ర నీవుగనుగొనగా ఉరినైన నీరనైన, అగ్నినైన, విషంబునైన నేను మరణిస్తాను – నీ మీద ఒట్టు" అంటుంది. ఎంతటి సాహసప్రవృత్తి. ఆమె అన్నంత పని చేయగల ధైర్యవంతురాలు అని భీముడికి తెలుసు. ఆమె కోరిక మేరకు ఆ రాత్రే నర్తనశాలకు రప్పించి కీచకుడిని గుర్తుపట్టలేనంత భయంకరంగా చంపుతాడు. ద్రౌపది పట్టుదల అంతటిది. ఆ తర్వాత ఆమెను పట్టబోయిన ఉపకీచకులు కూడా భీముని చేతిలో మరణిస్తారు.

ఇది కేవలం ఒక ప్రథమకార్యం మాత్రమే. అజ్ఞాతవాసం ముగిసే తరుణం ఆసన్నమైంది. ఉత్తర గో గ్రహణంలో విజయవంతమైన పుత్రుని రాకతో మురిసిన విరటుడు అది అర్జునవిజయం అని కంకుభట్టు పలికినప్పుడు అతని మీద పాచికలు విసురుతాడు. రక్తం కారుతుంటే ద్రౌపది వచ్చి తన చీరచెరగుతో కట్టు కడ్తుంది. ఆతని రక్తం భూమిమీద పడితే క్షామం వస్తుందని విరటునితో అంటుంది. ఆమె పతిభక్తి ఇక్కడ ద్యోతకమౌతుంది. అంతేకాదు ఆపత్కాలంలో తమకు ఆశ్రయమిచ్చిన మత్స్యదేశంలో కరువు రాకూడదనే ఆమె సంకల్పం కనిపిస్తుంది. ఉచితానుచితాలు ఎఱిగిన ఉదాత్తచరిత ద్రౌపది.

అజ్ఞాతవాసం ముగిసిన తర్వాత రాయబారాలు మొదలౌతాయి. సంజయుడు వచ్చి ధర్మరాజును పొగడి రక్తంతో తడిసిన అన్నంకంటె భిక్షాన్నము మేలు మీ నడవడికి అని ముక్తాయిస్తాడు. యుద్ధం జరగకుండా చూచే బాధ్యత ధర్మరాజు మీద పెడ్తాడు ధృతరాష్ట్రుని కోరిక అదే కనుక, నేనే ఈ పనికి వస్తాను అని కృష్ణుడు పలుకుతాడు. నిజానికి కృష్ణుడిని రాయబారిగా పంపాలని ధర్మరాజు అనుకోలేదు. శ్రీకృష్ణుడు కౌరవ సభకు వెళ్లేముందు పంచపాండవులు తమ తమ అభిప్రాయాలను వెల్లడిస్తారు. ధర్మరాజు ఐదూళ్ళు అయినా చాలు అంటాడు. భీముడు సైతం సంధిని కోరుతున్నట్లు మాట్లాడుతాడు. ఒక్క సహదేవుడు మాత్రమే రోషరూక్షణమైన విధంగా పలుకుతాడు. అప్పుడు ద్రౌపది తోకతొక్కిన తాచువలె లేస్తుంది. కోపం, దుఃఖం, రోషం, ముప్పిరిగొనగా తనలో దాగి ఉన్న పరివేదనను కృష్ణుని ముందు వెల్లడిస్తుంది.

వరప్రభావంతో పుట్టాను, భరతవంశంలో మెట్టాను. అందులో కూడా మహాపరాక్రమశాలియైన పాండుభూవరుని కోడలినయ్యాను. జనంచేత పొగడబడే వర్తనంగల భర్తలను పొందాను. నీతివిక్రమస్థిరులైన పుత్రులను కన్నాను. ఇవన్నీ ఒక ఎత్తు నీవు సుభద్రకంటె నన్నే ఎక్కువ ఆదరిస్తావు, గౌరవిస్తావు. అటువంటి నన్ను రాజసూయావభృథంబుతో

శుచియై పెంపొందిన జుట్టుపట్టి సభలో అందరిముందుకు ఒక ధూర్తుడు ఈడ్చుకొని వచ్చాడు. ఈ ఏవురు చూస్తూ మిన్నకుండగా జరిగిన పరాభవం అది. కృష్ణా నీవు ఆ కౌరవసభలో ప్రసంగించేటప్పుడు ఈ కేశపాశాన్ని గుర్తు చేసుకో ఎందుకంటే ఆ దుశ్శాసనుడు పట్టి లాగినపుడు సగం తెగిపోయి తక్కినవి ఈ వెంట్రుకలు. దుర్యోధనుడి పీనుగును చూడాలి. దుశ్శాసనుని చేయి తుత్తునియలై తెగి రణరంగంలో పడిపోయి ఉంటే చూడాలి. చూడలేకపోతే ఇక బ్రతకడమెందుకు అని వలవలా ఏడుస్తుంది. చిచ్చొడిగట్టినట్లు ఈ అవమానభారాన్ని ఇంతకాలం మోశాను. యుద్ధం చేయకపోతే భీముడి పెద్దగద, అర్జునుడి గాండీనం ఎందుకు కాల్చనా అని తీవ్రంగా భాషించింది ద్రౌపది. నీ అండతో నా సోదరుడిని, పుత్రులను తోడుపెట్టుకొని నేనే యుద్ధానికి పూనుకొంటాను అంటుంది ఆ శక్తిస్వరూపిణి

**వరమున బుట్టితిన్ భరతవంశముజొచ్చితి నందు పాండుభూ**
**వరునకు కోడలైతి జనవంద్యుల బొందితి నీతి విక్రమ**
**స్థిరులగు పుత్రులంబడసితిన్; సహజన్ముల ప్రాపు గాంచితిన్**
**సరసిజనాభ! యిన్నిట బ్రశస్తికి నెక్కినదాన నెంతయున్.**

తనను గూర్చి తన ఆధిక్యతను గూర్చి ప్రస్ఫుటంగా తెలిసిన స్త్రీ ద్రౌపది. ఆత్మవిశ్వాసమే ఆమె చేత అలా పలికించింది. తమ శక్తి తాము మరచిపోయి అరణ్య అజ్ఞాతవాసాలవలన ఆత్మస్థైర్యం లోపించి తనకు జరిగిన పరాభవాన్ని మరచి మాట్లాడారు భర్తలు అని ద్రౌపది తీవ్రమైన వేదనకు గురి అయింది. అందుకే ఇంకా ఇలా అంటుంది.

**"నీవుసుభద్రకంటె కడునెయ్యము గారవముందలిర్ప సం**
**భావనసేయు దిట్టి నను పంకజనాభ యొకండు రాజ సూ**
**యావభృథంబునందు శుచియై పెను పొందిన వేణి వట్టి యీ**
**యేవురు జూడగా సభకు నీడ్చె; కులాంగన నిట్లొనర్తురే.**

కురువంశానికి నేను కోడలినైతే ఇలా చేయదగునా – వాడు అని దుశ్శాసనుని పేరుకూడా ఎత్తడానికి ఇష్టపడలేదు ద్రౌపది. ఈ ఏవురు చూడగా అని వారి నిస్సహాయతను వేలెత్తి చూపించిన ధైర్యశాలి ద్రౌపది. భంగపాటుకు ఏడుస్తూ కూర్చోకుండా ప్రతీకారాన్ని తీర్చుకుంది.

**"ఈ వెంద్రుకలు పట్టి యీడ్చిన యా చేయి దౌలుతగా బోరిలో దుస్ససేను**
**తనువింత లింతలు దునియలై చెదరిరూపతి యున్నగని యుదుకాఋగాక**
**యలుపాల బొనుపడునట్టి చిచ్చేయిది? పెనుగదవట్టిన భీమసేను**
**బాహుబలంబును బాటించిగాండీవ మనునొక విల్లెప్పుడును వహించు**

**కట్టి విక్రమంబు గాల్పవే యిట్లు బ**
**న్నములు పడిన ధర్మనందనుండు**
**నేను రాజరాజు పీనుంగు గన్నార**
**గాన బడయ మైతిమేని కృష్ణ!"**

గాండీవ మనునొక విల్లు అని ఎత్తిపొడిచింది ద్రౌపది. బుసలు కొడుతున్న త్రాచువలె ఉంది అప్పటి ద్రౌపదిరూపు. ఆమె పడ్డ కష్టాలు అటువంటివి.

**"లలనా యుడుగుము; నీ యేడ్పుల కొలదియె కురునృపాల పుత్ర కళత్రం**
**బుల యేడ్పు లింకవానిం కలకల నవ్వుచు వినంగ గాలంబయ్యెనో"**

అని శ్రీకృష్ణుడు అభయహస్తం ఇచ్చేటట్లు మాట్లాడింది ద్రౌపది. ఆమె సంభాషణాపటిమ నిరుపమానం. ఆమె రూపమేకాదు మాటకూడా మహిమాన్వితం. ఆ రాజు అంత అభిమానం కలవాడిగా మాట్లాడి ఇప్పుడు రిక్తహస్తాలతో మమ్ము వెడలగొట్టాలని చూస్తున్నాడు. ఆ కురువంశానికి నేను కోడలినా, దాసినా నీవే చెప్పు కృష్ణా అని ప్రశ్నిస్తుంది. అంతేగాకుండ ధర్మరక్షణకు పూనుకొన్న నీవు ఇప్పుడు ఏది ధర్మమో దాన్ని నిర్ణయించవలసి ఉంటుంది కదా! శ్రీకృష్ణుని ఎదుట

ఇంత ధైర్యంగా మాట్లాడగలిగిన శక్తి ఆమెకు ఎక్కడ నుంచి వచ్చింది అంటే ఆ భగవంతుడు శ్రీకృష్ణనామధేయుడు చూపించిన నెయ్యము, గారవము వలన వచ్చినది. శ్రీకృష్ణుడెందుకు ఆమె పక్షం వహించాడంటే న్యాయం, ధర్మం ఆమెవైపు ఉన్నాయి కనుక. ధర్మరాజాదులు సంధి అయ్యేటట్లు చూడమన్నారే కాని వారి మాటలలో సంధి ఉంది, మనసులలో యుద్ధకాంక్షే ఉంది. ద్రౌపది నిజాయితీ, నిర్భరత, న్యాయనిర్ణయం ఈ మాటలలో వెల్లడి అవుతుంది.

'లలనా ఉడుగుము నీ ఏడ్పులు' నీలాగే కౌరవ సతులు విలపించే కాలం ఆసన్నమైంది అని రాయబారానికి వెళ్ళేముందే శ్రీకృష్ణుడామెకు మాట ఇస్తాడు. ద్రౌపదినిర్ణయం, శ్రీకృష్ణుని సంకల్పం కురుక్షేత్రయుద్ధం! కౌరవుల మరణం ద్రౌపదికి పరాభవం జరిగినప్పుడే నిశ్చయమైంది. ద్రౌపది క్రోధాగ్నిజ్వాలలలో కౌరవులు కాలిపోయారు. ఆమె వృత్తాంతమే కురుపాండవులమధ్య ఘోరరణానికి దారి తీసింది. ఒక విధంగా ద్రౌపది కథ భారతానికి ఆయువుపట్టు. ఆమెలేనిదే పరాభవం లేదు, యుద్ధమూ జరగదు. ఆమె దుఃఖం, దానిలో నుంచి పుట్టిన క్రోధం కౌరవపక్షానికి మరణశాసనం అయింది. అందుకు అన్ని విధాలా తోడ్పడినవాడు శ్రీకృష్ణుడు. అస్త్రసన్యాసం చేసిన అర్జునుడిని తిరిగి ఆయుధం పట్టమని చెప్పినవాడు కృష్ణుడే కదా. ఆ తర్వాత జరిగింది మహోగ్రరణం!

యుద్ధంలో అందరూ మరణించాక అశ్వత్థామ బ్రహ్మశిరోనామ కాస్త్రాన్ని ప్రయోగించి ఉపపాండవులను చంపుతాడు. పాండవులను శ్రీకృష్ణుడు రక్షిస్తాడు. అప్పుడు కూడా ద్రౌపది ప్రతీకారాన్నే కోరుకుంటుంది. అశ్వత్థామ శిరోమణిని గ్రహిస్తుంది. ద్రౌపది అసమాన సౌందర్యవతి మాత్రమే కాదు విశేషమైన ప్రతిభాపాటవాలు, మహోగ్ర పౌరుష ప్రతీకారవాంఛ కలిగిన ధీమంతురాలు. క్షమ, సహనం అరణ్యవాసకాలంలో చూపిన సాధ్వికూడా. పట్టుదల, కార్యనిర్వహణా

సామర్థ్యం అజ్ఞాతవాససమయంలో కనబరచిన బుద్ధిమతి, రాయబార ఘట్టంలో అతిశయగర్వ, పరాక్రమాలను పదుగురికీ ఎరిగించిన ధైర్యవంతురాలు.

కురుక్షేత్రసంగ్రామం తరువాత బంధుమిత్రులను కోల్పోయి కొంత పశ్చాత్తాపంతో, మరికొంత వైరాగ్యంతో భావికురుసామ్రాజ్యనేత అయిన ధర్మరాజు కర్తవ్యతావిమూఢుడై నిస్తేజుడై ఉన్నప్పుడు అతనికి రాజధర్మాలను గుర్తుచేసి కర్తవ్యోన్ముఖుడిని చేసిన కార్యశీలి, రాజనీతి కోవిద ద్రౌపది. ధర్మరాజు పట్టాభిషేకం చేసుకోవడానికి ద్రౌపది కారణం. శిక్షార్హులైన దుర్యోధనాదులు శిక్షింపబడటం సమాజశ్రేయస్సుకోసమేనని అందాతని తప్పు ఎంత మాత్రం లేదనీ చెప్పి ఒప్పించింది ద్రౌపది. అటుపై ధర్మరాజు ద్రౌపదీసమేతుడై అశ్వమేధయాగాన్ని నిర్వహిస్తాడు. విధినిర్వహణ ధర్మాలన్నింటిలో శ్రేష్ఠమైనదని శాస్త్రోక్తంగా స్థాపించింది ద్రౌపది!

పాండవులు మహాప్రస్థానానికి వెళ్ళేటప్పుడు వారి ననుసరించి వెళ్ళింది ద్రౌపది. అందరికంటె ముందు పడిపోయింది. భీముడు ధర్మరాజుని కారణమడుగుతాడు. ఆమె పంచభర్తృక అయినా అర్జునుని పట్ల ఆమెకు కించిత్ ఎక్కువ అనురాగం కలిగింది. ఆ కారణంగానే ముందు పడిపోయింది అంటాడు ధర్మరాజు. ఇదేమిన్యాయం! ద్రుపదుడు తపస్సు చేసి కోరుకున్నదే ఒక దుహిత కావాలి, ఆమె అర్జునుడిని పెండ్లాడాలని, అదీగాక మత్స్యయంత్రాన్ని ఛేదించింది అర్జునుడే. అతనిని జనబాహుళ్యం సమక్షంలో వరించింది కూడా. కాని కుంతిమాట ప్రకారం, వ్యాసుని అనుజ్ఞమేరకు నారదుడు సూచించిన నియమానుసారం పరమ క్లిష్టమైన జీవితవిధానాన్ని ఔదలదాల్చింది. సమర్థవంతంగా నిర్వహించింది. అందుచేతనే కుంతికి ఆమెపట్ల అపారమైన గౌరవం ఏర్పడింది. ద్రౌపది పడిన భంగపాటుకోసమైనా ప్రతీకారం చేయమని

పాండవులను కోరింది. ఈ అత్తాకోడళ్ళసంబంధం అపురూపం, ఆదర్శప్రాయం.

ద్రౌపది పడిన కష్టాలను ఎప్పటికప్పుడు గుర్తించి వీలున్నంతవరకు వాటిని తొలగించడానికి ప్రయత్నించినవారు భీమసేనుడు, అర్జునుడు. ఆమెను పరాభవించిన దుర్యోధనుడిని, దుశ్శాసనుడిని చంపింది భీముడు. హేళనచేసి వారిని రెచ్చగొట్టినవాడు కర్ణుడు. అతడిని మట్టుబెట్టినవాడు అర్జునుడు. చివరకు అశ్వత్థామను వెదకి పట్టుకొనిరమ్మని కూడా కోరింది భీముడినే. ఇన్ని కష్టాలకు మూలమైంది ధర్మరాజు ఆడిన జూదం. 'అనయమువుట్టె జూదమున' అని కంఠోక్తిగా సంజయుడు పలికాడు కాని ద్రౌపది ధర్మరాజును క్షమించడమే కాకుండా భర్తగా గౌరవించింది. భీముడు విమర్శించడానికి ఆస్కారం (కీచకవధ ఘట్టంలో) ఏర్పడినప్పుడు కూడా 'కేవల మర్త్యుడె ధర్మసుతుడు' అని ఆతని గొప్పతనాన్ని వర్ణించి భీముని ఉద్రేకాన్ని చల్లబఱచింది. ద్రౌపదివ్యక్తిత్వం, ధైర్యం, స్థైర్యం అపురూపం! మహిళాలోకానికి ఆదర్శం, ఆచరణయోగ్యం ద్రౌపదివృత్తాంతం!

* * *

# 10. సుభద్ర

ఈమె రోహిణి, వసుదేవుల పుత్రిక. శ్రీకృష్ణబలరాముల సోదరి. ఈమె అర్జునుని గుణగణములు విని అతనినే వివాహమాడాలని తలచింది. కాని సోదరుడైన బలరామునకు అది ఇష్టం కాలేదు. శ్రీకృష్ణుడు మాత్రం ఆమె కోరికను తెలుసుకొని ఏ విధంగానైన అర్జునునికే ఆమె నిచ్చిపెండ్లి చేయాలనుకున్నాడు. అర్జునుడు తీర్థయాత్రలు చేస్తుండిన కాలంలో అతడిని యతిరూపంలో వచ్చేటట్లు చేశాడు కృష్ణుడు. సుభద్ర ఆ యతికి సపర్యలు చేయడానికి నియోగింపబడింది. అర్జునుడు ఆమె మనసు తెలుసుకొని తానే ఆమెకోరుకుంటున్నవాడినని బహిర్గతం చేశాడు. శ్రీకృష్ణుడు అంతర్ద్వీపాలలో ఉత్సవాలు చేయమని ఆజ్ఞాపించి బలరామాదులు వాటిని చూచే నెపంతో వారు నగరంలో లేకుండా చేశాడు. అటుపైన భూసురులను పిలిపించి సుభద్రార్జునుల వివాహం జరిపించాడు.

సుభద్రను తీసుకొని ఇంద్రప్రస్థపురానికి వెళ్ళేటప్పుడు ద్రౌపది ఏమంటుందో అని సందేహించాడు. నీవు మొదటిగా ద్రౌపదికి నమస్కరించమని కోరాడు. సుభద్ర అదే విధంగా ద్రౌపదికి మ్రొక్కి ఆమెపట్ల గౌరవాభిమానాలతో ఉండసాగింది. ద్రౌపది ఆమెను ఆదరించింది. అభిమన్యుడు జన్మించాడు. కొద్దికాలానికే పాండవులు అరణ్యవాస, అజ్ఞాతవాసకాలాన్ని గడపడానికి అడవులకేగారు. వారివెంట సుభద్ర వెళ్ళలేదు. ఆమె ద్వారక చేరింది. పుత్రుడైన అభిమన్యుడు మేనమామ అయిన కృష్ణుని వద్ద పెరిగాడు. సకల లక్షణశోభితుడు, అస్త్ర, శస్త్ర విద్యాపారంగతుడు అయినాడు. సుభద్ర ఎంతో సంతోషించింది.

పాండవుల అజ్ఞాతవాసపరిసమాప్తి అయిన తర్వాత వారివద్దకు శ్రీకృష్ణుడు సుభద్రను, అభిమన్యుడిని తీసుకొని వెళ్ళాడు. అక్కడ ఉత్తరాభిమన్యుల వివాహమహోత్సవం వైభవంగా జరిగింది. ఉత్తర గర్భవతి అయింది. సుభద్రార్జునుల ఆనందానికి అనతికాలంలోనే తెరపడింది యుద్ధరూపంలో. మహావీరుడైన అభిమన్యుడు పద్మవ్యూహంలో చిక్కుకొని తనువు చాలించాడు. సుభద్ర మనసు క్షోభించింది. ఉత్తరను తలచుకుంటూ కన్నీరు మున్నీరుగా విలపించింది. శ్రీకృష్ణుడు ఆమెను సమాశ్వాసించాడు. ఆ తరువాత జరిగిన పరిణామంలో ఉత్తర గర్భస్థ శిశువును కాపాడమని శ్రీకృష్ణుని వేడుకొన్నది. పరీక్షిత్తు జన్మించాడు. సుభద్ర భర్తవెంట హస్తినాపురం చేరింది. ధర్మజుడు చేసిన అశ్వమేధయాగాన్ని చూచింది. ఉలూపి, చిత్రాంగదలతో సఖ్యంగా మెలిగింది. సపత్నీమాత్సర్యం ఎంతమాత్రం లేని సుగుణవతి, భద్రశీల సుభద్ర. ఆమె మనుమడే కురుసామ్రాజ్యానికి ఉత్తరాధికారి అయిన పరీక్షిత్తు.

* * *

# 11. ఉలూచి

నాగులలో ప్రసిద్ధి చెందిన ఐరావంత వంశానికి చెందిన కన్య ఈమె. ఈమె తండ్రి కౌరవ్యుడు అనే నాగరాజు. ఈమెను ఉలూపి అని కూడా అంటారు. ఈ వంశంవారు దేవమనుష్య లోకాలలో సంచరించే వారు. ఉలూచికి కామగమనం, అపారమైన శక్తి జన్మతః సిద్ధించాయి.

ద్రౌపది పాండవులలో ఒక్కొక్కరితో ఒక సంవత్సరం కాపురం చేయాలనే నియమం నారదమహర్షి ఏర్పరచాడు. విప్రుడొకడు తన గోవుని ఎవరో అపహరించారనీ, తెచ్చి ఇవ్వమనీ వేడుకొన్నప్పుడు అర్జునుడు తన ధనుర్బాణాల కోసం ధర్మరాజు, ద్రౌపది ఏకాంతంలో ఉన్న ప్రదేశానికి వెళ్ళాడు. దానికి ప్రాయశ్చిత్తంగా ధర్మరాజు అనుమతితో తీర్థయాత్రలకు బయలుదేరాడు. ఒక పర్యాయం గంగాతీరంలో తర్పణాలువిడిచి, ధ్యానం చేసుకుంటున్న అర్జునుడిని గంగాతీరంలో విహరించడానికి వచ్చిన ఉలూచి చూచింది. అంతకుముందే ఆమె అర్జునుని గుణగణాలను గురించి శౌర్యపరాక్రమాలను గురించి విని అతనిపట్ల అనురాగాన్ని పెంచుకుంది. ఇప్పుడు అర్జునుని చూడగానే మోహపరవశురాలైంది. అతడు ధ్యానంలో నిమగ్నమై ఉండగానే, అతనికి తెలియకుండానే తన మహిమచేత నాగలోకానికి తీసుకొనివెళ్ళింది. అర్జునుడు కళ్ళుతెరవగానే ఉలూచిని చూచాడు. ఆమే తనను తీసుకొని వచ్చిందని గ్రహించాడు. నీవెవ్వరు, ఎందుకు నన్నిక్కడకు తీసుకొని వచ్చావు అని అడగగానే తనను గురించి చెప్పుకొని తనను పరిగ్రహించమని కోరింది. తీర్థయాత్రలకై బయలుదేరిన తాను ఆమె మనోరథాన్ని తీర్చడం సాధ్యం కాదన్నాడు. ఎన్ని పుణ్యకార్యాలు చేసినా ప్రాణదానంతో సరిపోవని, అర్జునుడు తనను స్వీకరించకపోతే మరణిస్తానని పలికింది ఉలూచి.

ఉలూచికి అర్జునుడికి ఇరావంతుడు అనే కుమారుడు కలిగాడు. ఉలూచి అర్జునుడిని మళ్ళీ గంగాతీరానికి చేర్చింది. తరువాత కూడా ఆమె అర్జునుడి వెంట వెళ్ళలేదు. ఇరావంతుడు తల్లివెంట ఉండిపోయాడు. తాతగారిపర్యవేక్షణలో పెరిగి పెద్దవాడయ్యాడు. ఉలూచి ప్రోద్బలంతో కురుక్షేత్రయుద్ధంలో పాండవుల పక్షాన యుద్ధం చేసి వీరమరణం పొందాడు, ఉలూచి వీరమాత అయింది.

ఇంతవరకు ఉలూచి సౌందర్యవతిగా అపారమైన శక్తిగలదిగా, వలచి వలపించుకొన్న అతివగా కనిపిస్తుంది. అర్జునుడు తనను విడిచి వెళ్తున్నప్పుడు అతని కర్తవ్యాన్ని పాలించడానికి వెళ్తున్నాడని గ్రహిస్తుంది. తన కోరిక తీర్చి పుత్రుడిని ప్రసాదించాడు అని సంతోషిస్తుంది.

కురుక్షేత్రయుద్ధానంతరం ధర్మరాజు పట్టాభిషిక్తుడైన పిమ్మట వ్యాసుని సూచనమేరకు అశ్వమేధయాగాన్ని చేయసంకల్పించాడు. అశ్వాన్ని సంరక్షించడానికి అర్జునుడు వెళ్ళాడు. మణిపురానికి చేరిన అర్జునుడికి చిత్రాంగద కొడుకైన బభ్రువాహనుడు ఎదురయ్యాడు. ఈ వీరుడు అర్జునుడికి, చిత్రాంగదకు పుట్టినవాడే. అర్జునుడు తీర్థయాత్రలకు వచ్చినప్పుడే చిత్రాంగదను కూడా వివాహం చేసుకొన్నాడు. ఈమె మణిపురంలోనే ఉండిపోయింది. తండ్రిని చూచి నమస్కరించి అశ్వాన్ని బంధించకుండా తిరిగి వెళ్ళిపోసాగాడు బభ్రువాహనుడు. వీరుడవైతే ఎదురునిలిచి యుద్ధం చేయాలిగాని ఇలా వెనుతిరగడమేమిటని అర్జునుడు ఈసడించుకొన్నాడు. ఇక్కడొక మలుపు తిరిగింది కథ.

అర్జునుడు శిఖండిని ముందుంచుకొని తమ సోదరుడైన భీష్ముని చంపాడు, అది ధర్మయుద్ధం కాదు కనుక నరకానికి వెళ్తాడని వసువులతనిని శపిస్తారు. గంగకూడా అనుమతిస్తుంది వారికి కొడుకు మీది మమకారం ఉంది కనుక. ఇదంతా దివ్యదృష్టి కలిగిన ఉలూచికి అవగతమైంది. ఆమె అప్పటికే ఇరావంతుడిని కోల్పోయి పుత్రశోకంతో

బాధపడుతుంది. భర్తనైనా రక్షించుకోవాలని తండ్రి దగ్గరకు వెళ్ళి మొరపెట్టుకుంటుంది. వసువుల శాపాన్ని ఉపసంహరించుకొనేటట్లు చేయమని. తండ్రి అయిన కౌరవ్యుడు వసువుల దగ్గరకు వెళ్ళి అనేక విధాలుగా స్తుతించి బ్రతిమాలుకుంటాడు అర్జునుడిని శపించవద్దని. వసువులు కొంత ప్రసన్నచిత్తంతో అర్జునుడు తన కొడుకు చేతిలో మరణిస్తే నరకభయం ఉండదని శాపవిమోచనమార్గం తెలుపుతారు. ఇదంతా తెలుసుకొన్న ఉలూచి తగిన సమయం కొరకు వేచి ఉంటుంది.

ఇప్పుడు ఆ సమయం వచ్చిందని భావించి కామగమనంతో తిరిగి వెళ్తున్న బభ్రువాహనునికి ఎదురుగా ప్రత్యక్షమౌతుంది. బభ్రువాహనుడు ఆ తల్లికి నమస్కరిస్తాడు. ఆమె బభ్రునితో అశ్వాన్ని బంధించకుండా వెనుదిరగడం రాజలక్షణం కాదనీ, దానికి అతని తండ్రి కూడా హర్షించడనీ, వెళ్ళి యుద్ధం చేయమనీ, ఆతని తండ్రి లోకోత్తరవీరుడనీ, నీవాతనికి తగిన కుమారుడవే అయితే ఇలా వెనుదిరగడం తప్పనీ చెప్తుంది. బభ్రువాహనుడు తండ్రి కూడా తనను యుద్ధం చేయమనడం తలచుకొని అర్జునుడితో యుద్ధం చేస్తాడు. బభ్రువాహనుడు వేసిన వజ్రసదృశమైన వాడిబాణం తగిలి విజయుడు నేలకూలుతాడు. అప్పటి వరకు జరిగిన యుద్ధంలో అలసిన బభ్రువాహనుడు మూర్ఛపోయాడు. వారిద్దరూ రణరంగంలో పడిపోయారనే వార్త తెలిసి చిత్రాంగద, ఉలూచి పరుగుపరుగున అక్కడికి చేరారు. ఎందుకు నీవు కొడుకును తండ్రి మీదకు ఉసిగొల్పావు. అతడేదైనా నీపట్ల తప్పుచేసి ఉంటే క్షమించు. ఎలాగైనా నా భర్తను బ్రదికించు అని రోదిస్తుంది చిత్రాంగద. బభ్రువాహనుడు కూడా మూర్ఛనుండి తేరుకొని ఉలూచిని నిందించాడు. తండ్రిని చంపిన పాపాత్ముడనయినాను అని విలపిస్తాడు. నీకు భర్త చనిపోతే బాధ ఇసుమంతైనా కలగడం లేదా అని చిత్రాంగద నిష్ఠూరాలాడింది. తల్లీకొడుకులు ప్రాయోపవేశం చేయడానికి సిద్ధమయ్యారు.

అప్పటిదాకా అన్నినిందలూ భరించిన ఉలూచి ఏ మాత్రం సహనం కోల్పోకుండా కర్తవ్యనిర్వహణకు పూనుకొంది. వసువుల శాపవిషయం సవిస్తారంగా వారికి తెలియజేసింది. నీచేత మృత్యువు బారిన పడకపోతే అర్జునుడు భీష్ముని చంపిన విధానానికి శాశ్వతంగా నరకానికి పోయేవాడు. అది జరగకుండా ఆపడానికి నేను ఈ పథకం రచించ వలసివచ్చింది. శ్రీకృష్ణార్జునులు సాక్షాత్తు నారాయణ, నరస్వరూపులు. ఇంద్రునివలన కూడా విజయుడు ఓడడు. శాపవిమోచనం కోసం నేనిదంతా చేశాను అని చెప్పి ఉలూచి నాగమణిని స్మరించి దానిని బభ్రువాహనుడి చేతికిచ్చి అర్జునుని హృదయానికి తాకించమన్నది. అలా చేయగానే అర్జునుడు పునర్జీవితుడయ్యాడు. మా ఎవరివల్లనైనా నీకు అవమానం జరిగిందా నీవెలా ఇక్కడికి వచ్చావు అని ఆశ్చర్యంతో అర్జునుడు అడిగాడు. వసువుల శాపంనుంచి తప్పించడం కోసం తానిదంతా చేశానని చెప్పిన ఉలూచి బభ్రువాహనుని యుద్ధానికి పురికొల్పి, అతనికి విశేష పరాక్రమాన్ని కలిగించి నీకు నిష్కృతి కలిగేలా చేశాను అని చెప్పిన ఉలూచిని, చిత్రాంగదను, బభ్రువాహనుని యజ్ఞానికి ఆహ్వానించి అర్జునుడు అశ్వసంరక్షకుడు కనుక వెంటనే వెళ్ళిపోయాడు.

ఉలూచి చిత్రాంగదను వినీతురాలు అని ప్రశంసించింది. ఆమె కార్యదీక్ష, సమయస్ఫూర్తి, వాక్చాతుర్యం, దృఢసంకల్పం అనుపమానం బభ్రువాహనుని తన కుమారుడిగా అభివర్ధించిన ఉలూచి ఔదార్యం ఎంతో గొప్పది. నాగవంశానికే కాదు స్త్రీ జాతికే తలమానికం ఉలూచి వ్యక్తిత్వం!

* * *

# 12. చిత్రాంగద

చిత్రవాహనుడు మణిపూరుపురాధీశుడు. అతని కూతురు చిత్రాంగద. అర్జునుడు తీర్థయాత్రలు చేసిన కాలంలో అక్కడకు వచ్చాడు. అతనిని వలచి వలపించుకొన్న పడతి ఈ చిత్రాంగద. వారికి బభ్రువాహనుడు అనే కుమారుడు జన్మించాడు. వివాహమైన తర్వాత కూడా ఈమె తండ్రి ఇంటనే ఉండింది. ఆమె తండ్రికి ఏకైక కుమార్తె కావడంచేత ఆ మణిపూరుదేశంలోనే ఉండి బభ్రువాహనుడిని వారసునిగా చేసింది.

ధర్మరాజు అశ్వమేధయాగాన్ని చేయసమకట్టాడు. కురుక్షేత్ర సంగ్రామంలో జయించి రాజైన తర్వాత అశ్వసంరక్షణార్థం అర్జునుడు బయలుదేరాడు. మణిపురంలో ఆ అశ్వాన్ని బంధించబోయిన బభ్రువాహనుడు తండ్రిని చూచి నమస్కరించి వెళ్లిపోతుండగా అర్జునుడు రాజోచితమైన యుద్ధం చేయకుండా వెనుతిరగడం వీరుని లక్షణం కాదని ఈసడించుకొన్నాడు. అయినా తండ్రితో యుద్ధానికి తలపడడం సరికాదని తలచాడు బభ్రువాహనుడు. అప్పుడతనికి ఉలూచి కనిపించి నీ తండ్రికి నీవు యుద్ధం చేయడమే ఇష్టమని దానివలన మేలే జరుగుతుందని ప్రబోధించింది. తండ్రీకొడుకులు యుద్ధం చేయగా అర్జునుడు పడిపోతాడు. అచటికి వచ్చిన చిత్రాంగద ఉలూచి కారణంగానే బభ్రువాహనుడు తండ్రిని భావించి ఆమెను పరిపరి విధాలా నిందించింది. తన భర్తను బ్రదికించమని లేకపోతే తను ప్రాయశ్చిత్తం చేసుకొంటాననీ భీష్మించుకొని కూర్చుంది. భర్తను పుత్రుని కంటె ఎక్కువ కోరుకుంటానని చెప్తూ నీవాతని మరణానికి ఈషణ్మాత్రం దుఃఖించడంలేదని నిష్ఠురోక్తులు పలుకుతూ రోదిస్తుంది. ఉలూచి నాగమణి ద్వారా అర్జునుడిని బ్రతికిస్తుంది. ఆ సందర్భంలో ఉలూచి తనను నిందించిన చిత్రాంగదను

ఏ మాత్రం తప్పుబట్టదు. పైగా అర్జునుడు పునర్జీవితుడై ఏం జరిగిందని అడిగినప్పుడు చిత్రాంగదను వినీతురాలని పేర్కొంటుంది. వీరిరువురినీ అర్జునుడు అశ్వమేధయాగానికి రమ్మని ఆహ్వానిస్తాడు. వారు వెళ్ళినపుడు ద్రౌపది వారిని పరమాదరంతో స్వాగతిస్తుంది. పురుషుడి బహుభార్యాత్వం తప్పుకాని ఆ రోజులలో ద్రౌపది, సుభద్ర, ఉలూచి, చిత్రాంగద సరస సల్లాపాలతో కాలం గడిపారని చెప్తుంది భారతం. మొత్తానికి చిత్రాంగద, ఉలూచి అర్జునుడిని వివాహమాడినా అతని వెంట హస్తినకు వెళ్ళలేదు. హిడింబ కూడా ఈ కోవకే వస్తుంది. హిడింబ కొడుకు ఘటోత్కచుడు. ఉలూచి కొడుకు ఇరావంతుడు కురుక్షేత్రయుద్ధంలో పాల్గొని వీరమరణాన్ని పొందాడు. చిత్రాంగదకొడుకు బభ్రువాహనుడు తండ్రిని నరకానికి పోకుండా చేయగలిగాడు.

* * *

# 13. సుధేష్ణ

మత్స్యదేశాధీశుడైన విరటుని పత్ని సుధేష్ణ. కీచకుడు ఈమె సోదరుడే. అజ్ఞాతవాససమయాన్ని విరటుని నగరంలో గడపాలని పాండవులు నిర్ణయించుకొని శమీవృక్షంపైన తమ ఆయుధాలను భద్రంగా దాచి ఉంచి నగరంలో ప్రవేశించారు.

ఆ సమయంలో ద్రౌపదిని చూచి సుధేష్ణ ఆశ్చర్యచకితురాలౌతుంది. తనను సైరంధ్రిగా చేర్చుకొమ్మని ద్రౌపది అడిగింది. ఒక సంవత్సరకాలం ఆశ్రయం ఇమ్మని కోరింది. ఆమె లోకోత్తరసౌందర్యాన్ని చూచి యక్ష, కిన్నెర, కింపురుష, అప్సరకాంతయగునని తలపోసిన సుధేష్ణ ఆమె రూపాన్ని చూచి తన భర్త ఉవ్విళ్ళూరుతాడని, ఆమెను తన వద్ద ఉంచుకోవడం కరటి గర్భం దాల్చినట్లు అవుతుందని సంకోచించింది. ద్రౌపది తన భర్తలు గంధర్వులని వారు ఐదుగురు తనను సదా కాచుకొని ఉంటారని చెప్పిన తరువాత సుధేష్ణ మాలిని పేరుతో వచ్చిన ద్రౌపదికి ఆశ్రయమిస్తుంది. తనను నీచమైన కార్యాలకు నియోగించరాదని, ఎంగిలి తినను అని ద్రౌపది ముందే చెప్తుంది. అన్య పురుషులతో సంభాషించనని కూడ షరతుపెడ్తుంది. రకరకాల ముచ్చటముడులు, కలపాలు, అభినవగంధాలు అంతఃపురకాంతలకు అలంకారాలు చేయగలదానను అంటే సుధేష్ణ అంగీకరించింది.

కాని ద్రౌపది కీచకుని కంటబడినపుడు కామాతురుడైన వాడు ద్రౌపదిపొందు కోరతాడు. ద్రౌపది తిరస్కరించగానే అక్క సుధేష్ణ సహాయాన్ని అపేక్షిస్తాడు. అతనికి ఎన్నో నీత్యుపదేశాలు చేస్తుంది సుధేష్ణ. ఎంతోమంది వలచి వచ్చే కన్యలుండగా 'నీరసాకారసైరంధ్రి గోరనేల' అని నచ్చచెప్పడానికి ప్రయత్నిస్తుంది. ఆమె పతులు గంధర్వులు అతనిని చంపుతారు అని భయపెడుతుంది. మోహావేశపరుడైన కీచకుడు ఆమె

చెప్పిన మాటలను లక్ష్యపెట్టడు. అతని భుజబలం మీదనే మత్స్యరాజ్యం ఆధారపడి ఉన్నదనీ, తను కాదంటే వాడు రాజును పదవీచ్యుతుని చేసి అయినా ద్రౌపదిని బలాత్కారం చేయగలవాడనీ భావించి సైరంధ్రిని మదిర తెమ్మనే నెపం మీద కీచకుని ఇంటికి పంపుతుంది సుధేష్ణ. కీచకుడు మదోన్మత్తుడు. వాడు ఎంతకైనా తెగిస్తాడు అని తెలిసీ తనను అతని ఇంటికి పంపడం న్యాయం కాదని ద్రౌపది వేడుకొంటుంది. అజ్ఞాతవాసకాలం కనుక ఏమీచేయలేక వెళ్ళి వానిచే తన్నబడి విరటుసభకు వెళ్తుంది ద్రౌపది. అక్కడ కూడా ఎవ్వరూ మారుమాట్లాడరు. సుధేష్ణ నిస్సహాయురాలు. కీచకుని దండించే శక్తిలేనిది. ద్రౌపదిని వాని ఇంటికి పంపడం ఆమె చేసిన తప్పు. ద్రౌపది ఆ రాత్రి భీముని చెంతకు వెళ్ళడం, నర్తనశాలకు కీచకుని సంకేతమిచ్చి రమ్మనడం సుధేష్ణకు తెలియదు.

ద్రౌపది కీచకుని ఇంటికి వెళ్ళడానికి సంశయించినప్పుడు తనకు దాహం అవుతుందని, కీచకుని ఇంట వాచవియగు వారుణి ఉంటుంది దాన్ని తీసికొని రమ్మనడం, చూతము కానీ గమన వేగమ్ముని అని బుజ్జగించడం సుధేష్ణ వ్యక్తిత్వంలో లోపాలుగా కనిపిస్తాయి. కీచక, ఉపకీచక వధానంతరం ఆమెను చూచి ఇంకా ఎన్ని విపత్తులు వస్తాయో సైరంధ్రికారణంగా అని భయపడి ఆమెను వెళ్ళిపొమ్మని కోరుతుంది సుధేష్ణ. మరికొన్ని రోజులు మాత్రమే గడువు కోరుతుంది సైరంధ్రి. అజ్ఞాతవాససమాప్తి అనంతరం పాండవులను గుర్తెరిగి మిక్కిలి సంతోషంతో, భక్తిగౌరవాదరాలతో వారిని సమ్మానపురస్సరంగా సత్కరిస్తారు. తమ కుమార్తె ఉత్తరను వివాహమాడమని అర్జునుని కోరతారు. తన శిష్యురాలు అయిన ఉత్తర తనకు పుత్రికతో సమానమని చెప్పి తన కుమారుడైన అభిమన్యుడికిచ్చి వివాహం చేయమంటాడు ఆ నాట్యాచార్యుడు.

ఉత్తరాభిమన్యుల వివాహం కన్నులపండుగగా జరుగుతుంది. శ్రీకృష్ణ బలరాములేగాక ద్రుపదుడు ఇతర బంధుమిత్రులైన రాజన్యులు అందరూ చిరకాలం తర్వాత పాండవులను కలుసుకోవడానికి వస్తారు. వారు ఉపప్లావ్యంలో ఉండడానికి అన్ని ఏర్పాట్లు జరుగుతాయి. సుధేష్ణ, విరాటరాజు ఉత్తరాభిమన్యుల వివాహం వైభవోపేతంగా జరిపిస్తారు. ఆ తర్వాత జరిగిన రాయబారాలు అన్నీ విఫలమౌతాయి. యుద్ధంరానే వచ్చింది. శ్రీకృష్ణుని మేనల్లుడు, అర్జునుని తనయుడు, సుభద్ర కొడుకు, ఉత్తర భర్త అయిన అభిమన్యుడు అసమాన పరాక్రమశాలి. వీరోచితంగా పోరాడి పద్మవ్యూహంలోకి చొచ్చుకొనిపోయి తిరిగిరాలేక పదుగురిచే జిక్కి మరణిస్తాడు. అప్పటికే ఉత్తర గర్భవతి. ఆ దుఃఖం అటు పాండవులనే కాక సుభద్ర, సుధేష్ణలను కలచివేసింది.

అశ్వత్థామ భూమిమీద పాండవుడు అనేవాడు లేకుండా చేస్తానని దుర్యోధనుడికి మాట ఇచ్చి పాండవశిబిరంలోకి ప్రవేశించి నిద్రిస్తున్న ఉపపాండవులను, ధృష్టద్యుమ్నుడిని వధిస్తాడు. అది తెలిసి ద్రౌపది భీముడిని అశ్వత్థామను పట్టి తీసుకురమ్మని అర్థిస్తుంది. భీముని వెంట శ్రీకృష్ణుడు, పాండవులు కూడా వెళ్తారు. అశ్వత్థామ బ్రహ్మ శిరోనామకాస్త్రాన్ని ప్రయోగిస్తాడు. అది ఉత్తరగర్భంలో ఉన్న పిండాన్ని తాకుతుంది. ఉత్తర ప్రార్థించగా శ్రీకృష్ణుడు గర్భస్థశిశువు పునర్జీవితుడౌతాడు. అతడే పరీక్షిత్తు. ధర్మరాజుపాలనానంతరం కురు సామ్రాజ్యాధినేత, ఏకైకవారసుడు. విచిత్రంగా బృహన్నల రూపంలో ఉన్న అర్జునునికి శిష్యురాలై, తదనంతరం కోడలై, అభిమన్యుడి కులవధువై పుత్రుడిని కంటుంది ఉత్తర. ఆ ఉత్తర తల్లి సుధేష్ణ. ఆమె మనుమడే పరీక్షిత్తు. ద్రౌపదికి కూడా దక్కని అదృష్టం సుధేష్ణకు దక్కింది. విధి ఎంత విచిత్రమైంది!

* * *

# 14. ఉత్తర

మత్స్యదేశాధీశుడైన విరటుని కుమార్తె. ఈమె తల్లి సుధేష్ణ. సోదరుడు ఉత్తరకుమారుడు. అజ్ఞాతవాసకాలాన్ని గడపడానికి పాండవులు విరటుని రాజ్యాన్ని ఎన్నుకున్నారు. ధర్మరాజు కంకుభట్టుగా, వలలుడుగా భీముడు, గో అశ్వసంరక్షకులుగా నకుల సహదేవులు కొలువులో చేరతారు. ఇక అర్జునుడి విషయానికి వస్తే అతడు పేడివాడు అవుతాడని ఒకప్పుడు ఊర్వశి ఇచ్చిన శాపం ఇప్పుడు వరంగా పరిణమిస్తుంది. బృహన్నల నామధేయంతో నాట్యాచార్యుడనని చెప్పుకొని విరటుని ఆశ్రయిస్తాడు. ఉత్తరకు నాట్యగురువుగా చేరి అంతఃపుర కాంతలకు నాట్యం నేర్పుతుంటాడు. ఉత్తర నాట్యంలో సుశిక్షితురాలు అవుతున్న కాలంలో దక్షిణ గోగ్రహణం జరిగి వీరాధివీరులంతా సుశర్మతో యుద్ధం చేయడానికి వెళ్తారు. నగరంలో వీరులెవ్వరూ లేని సమయం చూచుకొని ఉత్తర గో గ్రహణం జరుపుతారు దుర్యోధనాది కౌరవవీరులు. అప్పుడు ఉత్తరకుమారునికి రథసారథిగా బృహన్నల వెళ్తాడు. ఉత్తర పసితనం వీడని ముగ్ధ. అమాయకత్వం ఆమెకు మరో ఆభరణంగా ఉన్న వయస్సు. కురువీరుల తలపాగాలను బొమ్మపొత్తిళ్ళ కోసం తెమ్మని బృహన్నలను కోరుతుంది. బృహన్నల ఎవరో అప్పటికింకా వెల్లడి కాలేదు. అయినా అతడు కౌరవులను ఓడిస్తాడని ఆమె తలపోసింది అంటే అది ఒక విధంగా అమాయకత్వం, మరోవిధంగా దైవనిర్ణయం అనుకోవాలి.

ఉత్తర సహజ సౌందర్యం, కోమలత్వం, అన్నిటికీ మించిన ముగ్ధత్వం ముచ్చట గొలిపే అంశాలు. అజ్ఞాతవాసకాలం ముగిసింది. విరటుడు అర్జునుడిని ఉత్తరని వివాహమాడమని అడుగుతాడు. శిష్యురాలు పుత్రికతో సమానమని చెప్పి తన కుమారుడు అభిమన్యుడు అన్ని విధాలా ఉత్తరకు తగినవాడు అని చెప్తాడు అర్జునుడు.

ఉత్తరాభిమన్యుల వివాహం వైభవోపేతంగా జరిగింది. అది మూన్నాళ్ళ ముచ్చటే అయింది. వారి వివాహం కాగానే కురుపాండవుల మధ్య రాయబారాలు నడిచాయి. యుద్ధంలో అభిమన్యుడు పద్మవ్యూహంలో చిక్కుకుని వీరమరణం పొందాడు. ఉత్తర అప్పటికే గర్భవతి. ఆమె రణరంగానికి వచ్చి అభిమన్యుడి మృతదేహం మీద వ్రాలి హృదయ విదారకంగా ఏడుస్తుంటే చూచే వాళ్ళ హృదయాలు దుఃఖసాగరాలు అయ్యాయి. గాంధారి సైతం విధి నిర్దాక్షిణ్యమైనదని ఉత్తరను తలచుకొని రోదిస్తుంది.

చివరకు అశ్వత్థామ ఆమె గర్భస్థశిశువును కూడా ఉద్దేశించి బ్రహ్మ శిరోనామకాస్త్రాన్ని ప్రయోగించినపుడు ఉత్తర ఆ శ్రీకృష్ణుని వేడుకొంటుంది. సుదర్శనచక్రాన్ని ఆ దేవదేవుడు అడ్డువేసి శిశువును బ్రతికిస్తాడు. పరీక్షిత్తుగా పేర్గాంచిన ఆ భావిసామ్రాజ్యాధినేత ఉత్తరాభిమన్యుల కుమారుడే! ఏది ఎలా ఎందుకు జరిగిందో తెలియని వయస్సులోనే భర్తృవియోగాన్ని పొందింది. తండ్రిని, సోదరుడిని అదే యుద్ధంలో పోగొట్టుకుంది ఉత్తర. నర, నారాయణులే ఆమెకు దిక్కు అయ్యారు.

* * *

## 15. కద్రూ వినతలు

కృతయుగంలో కశ్యపుని యొక్క భార్యలు కద్రువ, వినత. వారు కుమారులను అనుగ్రహించమని కశ్యపుని వేడుకొన్నారు. అగ్నివలె ప్రకాశించేవారు, పొడవైన దేహాలు కలవారు, బలంకలవారు అయిన వెయ్యిమంది కుమారులు కావాలి అని కద్రువ కోరుకున్నది. వినత వారికంటె బలమైనవారు, భుజబలం కల ఇద్దరు సుపుత్రులను కోరుకున్నది. కశ్యపుడు వారు కోరిన విధంగా వరములిచ్చాడు. వారి కోరిక ఫలించి కద్రువకు వెయ్యి మంది సర్పశ్రేష్ఠులు పుట్టారు. వినత కొడుకులు పుట్టలేదు అనే ఆతురతతో ఒక అండాన్ని విచ్ఛిన్నం చేసింది. అందుండి క్రింది సగభాగం లేనివాడు, నీతిమంతుడు అయిన అనూరుడు అనే కుమారుడు పుట్టి నీ సవతికి దాసిగా ఉండుమని శాపమిచ్చి సూర్యునికి రథసారథిగా వెళ్ళాడు. రెండవ గ్రుడ్డును జాగ్రత్తగా కాపాడుకొమ్మని దానిలో నుంచి పుట్టే కొడుకు తన దాసీత్వం నుంచి విముక్తి కలిగిస్తాడని కూడా అనూరుడు చెప్పి వెళ్ళాడు.

దేవాసురులు అమృతం కొరకు పాలసముద్రాన్ని మథించారు. అప్పుడు ఉచ్చైశ్రవమనే అశ్వరాజం కూడా పుట్టింది. అది సముద్ర తీరంలో తిరుగుచుండగా కద్రూవినతలు చూచారు. ఆ గుఱ్ఱం శరీరమంతా తెల్లగా ఉన్నా తోక భాగంలో నలుపు ఉందని కద్రువ అన్నది. అది స్వచ్ఛమైన మహాత్ముని కీర్తివలె తెల్లగా ఉందని నలుపు లేనే లేదని వినత అన్నది. నలుపు ఉంటే నీవు నాకు దాసివి అవ్వాలి, లేకపోతే నేను నీకు దాసిని అవుతాను అని కద్రువ పందెం కాసింది. వినత ఆ అశ్వరాజం సమీపానికి వెళ్ళి చూద్దాం అంటే ఇప్పుడు ప్రొద్దుపోయింది, రేపు వచ్చి చూద్దామని కద్రువ పలికింది. ఇదంతా ఒక పన్నాగం ప్రకారం కద్రువ ఆడిన నాటకం. ఆ రాత్రి ఆమె తన కుమారులైన నాగులతో జరిగిన విషయమంతా చెప్పి ఆ అశ్వరాజం యొక్క తోకను నలుపుగా ఉండేటట్లు చేయమని అడిగింది. అది అధర్మం

కనుక చేయజాలమని పాములన్నీ చెప్పాయి. జనమేజయుడు చేయబోయే సర్పయాగంలో మీరంతా చస్తారని కద్రువ శపించింది. శాపభయంచేత కర్కోటకుడు అనే పాము తల్లికోరినట్లు ఆ అశ్వం యొక్క వాలభాగాన్ని చుట్టుకొని వ్రేలాడుతూ ఉన్నాడు. రెండవ రోజు అచటికి వచ్చిన కద్రూవినతలు ఉచ్చైశ్రవాన్ని చూచారు. వాలభాగం నల్లగా కనిపించింది. వినత కద్రువకు దాసి అయింది.

ఐదువందల సంవత్సరాల తర్వాత వినత దాచిన రెండవ గ్రుడ్డు నుండి అత్యంత బలశాలి, తేజోవంతుడు అయిన గురుత్మంతుడు బయలు వెడలి ఎంతో వేగంతో ఆకాశానికి ఎగిరాడు. తల్లి నుండి జరిగిన వృత్తాంతాన్ని విని పాముల కోర్కె మేరకు అమృతాన్ని తీసికొని వచ్చాడు. ఇంద్రుడు యుద్ధం చేసినా గరుడుడు ఓడిపోలేదు.

మాతృదాస్యవిమోచనం చేసిన గరుడుడు విష్ణువుకు వాహనమయ్యాడు. ఇంద్రుడతని స్నేహితుడయ్యాడు.

ఈ కథలో సపత్నీమాత్సర్యం వలన ఎటువంటి విపత్కరాలు సంభవిస్తాయో తెలుస్తుంది. వినత కద్రువకు ముందుగా సంతానప్రాప్తి కలిగిందని అసూయతో ఒక గ్రుడ్డును విచ్ఛిన్నం చేస్తే అనూరుడు పుట్టాడు. వినతను తన దాసిగా చేసుకోవాలన్న దుర్బుద్ధితో కద్రువ అసత్యమాడడమే కాకుండా పుత్రులను (నాగులను) అధర్మమార్గంలో నడవమని ఆదేశించింది. వారు కాదంటే సర్పయాగంలో పడి నశించమని శాపం ఇచ్చింది. ఇన్ని వైపరీత్యాలకు మూలమైంది వారిరువురి మధ్య ఏర్పడిన వైషమ్యమే! తదనంతరకాలంలో జనమేజయుడు సంకల్పించిన సర్పయాగంలో పాములన్నీ ఆహుతి అయ్యే పరిస్థితి ఏర్పడింది. నాగ వనిత అయిన జరత్కారు ఆదేశంతో ఆమె కుమారుడు ఆస్తీకుడు జనమేజయుని తన విద్య, పాండిత్యం చేత మెప్పించి సర్పయాగాన్ని ఆపిస్తాడు.

# 16. దేవయాని

వృషపర్వుడు ఒక దానవరాజు. శుక్రాచార్యుడు ఆతడి గురువు. మృతసంజీవని అనే విద్యను కనిపెట్టి మరణించిన దానవులను తిరిగి బ్రతికించేవాడు శుక్రాచార్యుడు. ఆతని కుమార్తె దేవయాని. ఆమెయందు పంచప్రాణాలు నిలిపినవాడు. ఇదిలా ఉండగా దేవతలు మృత సంజీవని విద్యను తాముకూడా నేర్చుకోవాలనుకొన్నారు. బృహస్పతి కొడుకైన కచుడిని శుక్రాచార్యునికి శిష్యుడిగా ఉండి ఆయనను ప్రసన్నుడిని చేసుకొని ఆ విద్యను నేర్చుకోవలసిందిగా ఆదేశించారు.

కచుడు వినయశీలుడు, నిష్ఠాగరిష్టుడు. ఆతని యందు శుక్రునికి వాత్సల్యం, దేవయానికి అనురాగం పెంపొందాయి. రాక్షసులు కచుడిని చంపాలని ప్రయత్నించేవారు. ఒకసారి కచుడిని చంపి కాల్చి ఆ బూడిదను మద్యంలో కలిపి శుక్రుని చేత తాగించారు. కచుడికి మృతసంజీవని బోధించి, ఆతడు శుక్రుని ఉదరం చీల్చుకొని బయటికి వచ్చేటట్లు తర్వాత తనను బ్రతికించేటట్లు శుక్రుడు ఆనతిచ్చాడు. కచుని చంపినప్పుడంతా దేవయాని దుఃఖించేది. తండ్రిని బ్రతిమాలి ఆతడిని బ్రతికించేది. ఇదంతా కచుని మీద అనురాగంతో చేసేది.

మృతసంజీవనిని నేర్చుకొని స్వర్గానికి వెళ్ళడానికి కచుడు ప్రయాణమైనప్పుడు దేవయాని నీవు బ్రహ్మచారివి, నేను కన్యను నన్ను పరిగ్రహించు అని అడిగింది. కచుడు గురువు తండ్రివంటివాడు ఆయన కుమార్తె అయిన నీవు నాకు సోదరితో సమానం. కనుక దీనికి నేను అంగీకరించను అంటాడు. దేవయాని కోపోద్రిక్తురాలౌతుంది. నీ యందు సంజీవని పని చేయకుండుగాక శాపమిచ్చింది. కచుడు 'నీకు బ్రాహ్మణుడు భర్తగా దొరకకుండుగాక' అని ప్రతిశాపమిచ్చాడు.

దేవయాని స్వభావంలో ఈ ఉద్రిక్తస్వభావం, మూర్ఖపు పట్టుదల ముందుముందు ఎక్కువకావటం జరిగింది.

దేవయానికి వృషపర్వుని కూతురు శర్మిష్ఠ స్నేహితురాలు. ఒకసారి వేయిమంది కన్యలతో కలిసి శర్మిష్ఠ దేవయానిని వెంట తీసుకొని ఒక సరోవరంలో స్నానం చేయటానికి వెళ్ళింది. ఆ కన్యలందరూ జలక్రీడ లాడుతుండగా ఒక సుడిగాలి వీచి వారి చీరలన్నీ కలిసిపోయి గుట్టగా పడ్డాయి. ఎవరి చీరలువారు వెతుక్కునే సంరంభంలో శర్మిష్ఠ దేవయాని వస్త్రాన్ని కట్టుకొన్నది. దేవయానికి శర్మిష్ఠ చీర మిగిలింది. నేను శుక్రాచార్యుల కుమార్తెను, నీకు పూజ్యురాలని, భూసుర కన్యను నీ చీరను ఎలా కట్టుకొంటాను అని శర్మిష్ఠను గద్దించింది. శర్మిష్ఠ మీతండ్రి నా తండ్రి దగ్గర పని చేసేవాడు. అయినా నీకు నాకు మధ్య ఈ తారతమ్యాలు ఎందుకు. నా చీరధరిస్తే తప్పేముంది అని ప్రశ్నించింది. వారిద్దరిమధ్య వాదోపవాదాలు పెరిగాయి. తరతమ భేదాలు హద్దులు దాటాయి. శర్మిష్ఠ దేవయానిని ఒక పాడుబడ్డ బావిలోకి తోసి తన వేయిమంది చెలికత్తెలతో నగరానికి వెళ్ళిపోయింది.

దేవయానికి రోషం పెల్లుబికింది. ఆమె ఏడుస్తూ ఆ దిగుడుబావిలో ఉన్నప్పుడు యయాతి వేట నిమిత్తం అటువైపు వచ్చాడు. ఆర్తనాదం వినిపించి అటుచూచి దేవయానిని చూచాడు. రాజుగా తన బాధ్యతగా భావించి తన దక్షిణహస్తంతో ఆమె దక్షిణహస్తాన్ని పట్టుకొని పైకిలాగి వెళ్ళిపోయాడు. ఆమె యయాతిని గుర్తించింది. వృషపర్వుని నగరానికి తానురానని భీష్మించుకొని అడవిలోనే ఉండిపోయింది. ఆమెను వెదుకుతూ శుక్రాచార్యుడు వచ్చి ఎంత బ్రతిమాలినా ఆమె రానని చెప్పింది. ఇదంతా వేగులవలన తెలిసికొని మంత్రి సేనలను కలుపుకొని వృషపర్వుడు అచటకి వచ్చాడు. దేవయాని ఏమి కోరినా దానిని ఇస్తాననీ,

నగరానికి తిరిగిరమ్మని అర్థించాడు. శర్మిష్ఠ తన వేయిమంది చెలులతో తనకు దాసి కావాలని దేవయాని కోరింది. దానవవంశక్షేమం కొఱకు వృషపర్వుడు అందుకు అంగీకరించాడు.

ఆ విధంగా శర్మిష్ఠ రాకుమార్తె అయి ఉండి కూడా దేవయానిని సేవించడం మొదలుపెట్టింది. దానవవంశభద్రత శుక్రాచార్యుని మీద ఆధారపడి ఉన్నదని ఆమె ఎరిగింది కనుక.

యయాతి ఒకసారి వేటకై వచ్చి దేవయాని, శర్మిష్ఠ ఉన్న ఉద్యానవనంలో ప్రవేశించాడు. దేవయాని చేసిన అతిథి మర్యాదలను అందుకొన్నాడు. మొదటిసారిగా అతిశయరూప గుణలావణ్య అయిన శర్మిష్ఠను చూచాడు. ఆ సమయంలో దేవయాని యయాతి యందు అనురాగం కలదియై తనను కూపం నుంచి వెలికి తీసిన సమయంలో తన దక్షిణహస్తాన్ని ఆతడు దక్షిణహస్తంతో పట్టుకొన్నప్పుడే పాణిగ్రహణం అయిపోయిందనీ, ఇప్పుడు తనను వివాహమాడమనీ, ఈ కన్యలందరూ ఆతనికి సేవ చేయగలవారనీ అభ్యర్థించింది. యయాతి తాను క్షత్రియుడు కనుక దేవయాని బ్రాహ్మణకన్యకనుక వివాహం ధర్మవిరుద్ధమనీ నిరాకరిస్తాడు. ఆమె తన పట్టుదలను విడిచిపెట్టదు. శుక్రునిచేత చెప్పించి ఒప్పించి యయాతిని వివాహం చేసుకుంటుంది. శుక్రుడు ధర్మహాని కలుగదని వరమిస్తాడు. సహస్ర పరిజనంతో కూడిన శర్మిష్ఠ దేవయాని వెంట వెళ్తుంది. శుక్రుడు యయాతి శర్మిష్ఠతో కూడటాన్ని నిషేధించాడు.

* * *

# 17. శర్మిష్ఠ

యౌవన గుణరూపవతి అయిన శర్మిష్ఠ యయాతిపొందుబ గోరుతుంది. మొదట సంకోచించినా ఆమె అనురూప గుణలావణ్యాలకు ఆకర్షితుడౌతాడు యయాతి. శుక్రాచార్యుడు ఆమెతో శయనసుఖాన్ని నిషేధించి ఉన్నా యయాతి ఆమె సౌశీల్యానికి మృదు మనోహర నడతకు వశుడై శుక్రుని మాట మీరుతాడు. దేవయాని ఒకసారి ఉద్యానవన విహారానికి వచ్చి శర్మిష్ఠసంతానాన్ని చూస్తుంది. అప్పటికే దేవయానికి ఇద్దరు కుమారులు కలిగారు. అయినా ముమ్మూర్తులా యయాతిని పోలినవారిని చూచి, అడిగి వారికి శర్మిష్ఠ, యయాతి తల్లిదండ్రులని తెలుసుకొంటుంది. హుటాహుటిన శుక్రాచార్యుని ఆశ్రమానికి వెళ్ళి యయాతిమాటతప్పడాన్ని చెప్పి ఏడ్చింది. కోపోద్రిక్తుడైన శుక్రాచార్యుడు జరాభారగ్రస్తుడివి కమ్మని శపిస్తాడు. యయాతి ప్రార్థించగా అతని పుత్రులలో ఎవరైనా ఆతని ముసలితనాన్ని స్వీకరించి తమ యౌవనాన్ని ఇవ్వవచ్చనీ, వారే ఆతని తర్వాత రాజు అవుతారనీ శాపవిమోచనమార్గం చూపిస్తాడు. శుక్రాచార్యుడు ముందు వెనుకలు ఆలోచించకుండా కుమార్తెపట్ల వాత్సల్యంతో ఏపనైనా చేస్తాడని కచుని విషయంలో, యయాతి విషయంలో కూడా రూఢి అవుతుంది. అదే తీక్షణస్వభావం దేవయానిలో కనిపిస్తుంది.

యయాతి దేవయానిపుత్రులిద్దరినీ, శర్మిష్ఠ కుమారులిద్దరినీ తన వార్ధక్యాన్ని తీసికొమ్మని అర్థించి విఫలుడౌతాడు. శర్మిష్ఠ మూడవ కుమారుడైన పూరుడు అందుకు అంగీకరిస్తాడు. తల్లిదండ్రులను కీర్తిస్తాడు. ఈతని సహనం, సౌశీల్యం శర్మిష్ఠ నుంచి సంక్రమించినవిగా భావించవచ్చు. భావి కురువంశానికి ఈ పూరుడే మూలపురుషుడౌతాడు.

యయాతి బహుకాలం యౌవనాన్ని పొంది తిరిగి పూరునికి యౌవనాన్ని రాజ్యాన్ని కూడా ఇచ్చి పట్టాభిషిక్తుడిని చేసి కానలకేగుతాడు.

ఈ దేవయాని, శర్మిష్ఠ వృత్తాంతంలో కోపం, పట్టుదల ఎంతటి అనర్థాలకు దారి తీస్తాయో తెలుస్తుంది. దేవయాని కచుడిని, యయాతిని కూడా శాపగ్రస్తులను చేస్తుంది. దుష్ఫలితాలను చవి చూస్తుంది. శర్మిష్ఠ దేవయానిని నూతిలో తోయడం అనే తప్పు చేసినా తదనంతరకాలంలో దానవరాజ్యసంరక్షణకోసం, తండ్రిమాట తలదాల్చి దాసిగా జీవించడానికి అంగీకరిస్తుంది. తన వినయంతో యయాతి మనసు గెల్చుకుంటుంది. ఆమె కుమారుడే భావి సామ్రాజ్య అధినేతకావడానికి శర్మిష్ఠ శాంతి, సహనాలే కారణం అని తేటతెల్లం అవుతుంది.

* * *

## 18. శకుంతల

విశ్వామిత్రునికి, మేనకకు జన్మించిన కుమార్తె ఈమె. జన్మించిన తక్షణం తల్లిదండ్రులు విడిచిపెట్టి వెళ్ళిపోయారు. శకుంతపక్షులు తమ రెక్కల చాటున ఆ శిశువును రక్షించడానికి ప్రయత్నించడం కణ్వమహర్షి కంటబడింది. తేజోశాలియైన ఆ పసికందును తీసికొని తన ఆశ్రమంలో పుత్రిక వలె పెంచడం జరిగింది. శకుంతల అనే నామధేయం ఆ పక్షుల కారణంగానే ఏర్పడింది.

శకుంతల అపురూప సౌందర్యవతిగా పెరిగింది. శకుంతల కణ్వమహర్షి పెంపకంలో సకల ధర్మాలను తెలిసికొని వినయశీలిగా, సంస్కారవతిగా నడచుకొన్నది. కణ్వుడు ఒకసారి ఒక మునికి చెప్తుండగా విని తన జన్మవృత్తాంతాన్ని తెలుసుకొన్నది. విశ్వామిత్రుడి ధైర్యం, మేనక సౌందర్యం, కణ్వుడి సహనశీలం ఆమెలో పాదుకొన్నాయి.

ఒకసారి దుష్యంతుడు మృగయావినోదియై వచ్చి కణ్వాశ్రమ పరిసర ప్రాంతాలను దర్శించాడు. కణ్వుడిని చూచి నమస్కరించాలని ఆశ్రమంలో అడుగుపెట్టాడు. కణ్వుడు కనిపించలేదు. శకుంతలను చూచిన దుష్యంతుడు ఆమె రూప గుణ లావణ్యాలకు ముగ్ధుడయ్యాడు. ఆమె అతనికి అతిథి సత్కారాలు చేసింది – అర్ఘ్యపాద్యాదులతో దుష్యంతుడు ఆ కన్యామణి అక్కడకు ఎలా వచ్చింది అని ఆశ్చర్యచకితుడై ఆమె ద్వారానే ఆమె జన్మవృత్తాంతాన్ని తెలుసుకొన్నాడు.

దుష్యంతుని చూచి ఆమెకూడా పరవశురాలైంది. ఆమెను క్షత్రియ కాంతగా ఎరిగిన దుష్యంతుడు గాంధర్వవివాహం చేసుకొందామని ప్రతిపాదించాడు. శకుంతల మొదట అంగీకరించలేదు. తన పెంపుడుతండ్రి, మహర్షికణ్వుడు నీకిచ్చి నాకు పెండ్లి జరిపించగలడు.

ఆయన వచ్చేదాకా వేచి ఉందామని పలికింది. క్షత్రియులకు గాంధర్వ వివాహం ధర్మసమ్మతమేనని ఆమెను ఒప్పించి వివాహం చేసుకొన్నాడు దుష్యంతుడు. ఆమె తనకొడుకు భావిచక్రవర్తి కావాలని వరం అడిగింది– రాజు అంగీకరించాడు. కొంతకాలం గడిచిన పిదప మంత్రి సేనానులను పంపి ఆమెను తన పురానికి పిలిపించుకొంటానని చెప్పి దుష్యంతుడు వెళ్ళిపోయాడు.

కణ్వుడు ఏ విధంగా ఈ విషయాన్ని స్వీకరిస్తాడోనని శకుంతల భయపడసాగింది. ఆ మహర్షి ఆశ్రమానికి తిరిగి వచ్చి లజ్జాభారంతో తలవంచుకొని నిలబడి ఉన్న శకుంతలను చూచాడు. మహిమాన్వితుడైన ఆ ముని యోగదృష్టితో జరిగిన వృత్తాంతాన్ని తెలుసుకొన్నాడు. ఆమె క్షత్రియుడైన విశ్వామిత్రుని కుమార్తె. కనుక గాంధర్వవివాహం శాస్త్ర సమ్మతమేనని పలికి ఆమెను జాగ్రత్తగా చూచుకొమ్మని ఆశ్రమంలో ఆమెకు కావలసిన సౌకర్యాలను ఏర్పరచాడు.

ఆమెకు మూడు సంవత్సరాల తర్వాత భరతుడు జన్మించాడు. అమిత పరాక్రమశాలియైన ఆ బాలుడు క్రూరమృగాలను సైతం వశం చేసుకోవడం వలన ఆతడిని సర్వదమనుడు అనేవారు. కాలం గడిచినా ఆమెను పిలిపించుకోలేదు దుష్యంతుడు. పెద్ద కాలం పుట్టినింట్లో ఉండడం ఎంతటి సాధ్వికైనా తగదు అని భావించి కణ్వుడు ఆమెను కొంతమంది శిష్యులను తోడు ఇచ్చి దుష్యంతుని పాలికి పంపించాడు.

సభాప్రాంగణంలో శకుంతల దుష్యంతుడిని చూచి ఆతడి కొడుకైన భరతుడిని చూపించి స్వీకరించమని కోరింది. నీవెవరో నాకు తెలియదు. అలాంటప్పుడు ఈ కొడుకు నా కొడుకు అని నేను ఏ విధంగా భావిస్తాను అని అంటాడు దుష్యంతుడు.

ఆ మాటలకు కుపితయైన శకుంతల సత్యం యొక్క ధర్మం యొక్క గొప్పతనాన్ని బోధిస్తుంది.

ఓ రాజా! వేదాలు, పంచభూతాలు, ధర్మం, ఉభయసంధ్యలు, హృదయం, యముడు, సూర్యచంద్రులు, అంతరాత్మ నరుల వర్తనాన్ని ఎప్పుడూ గమనిస్తూనే ఉంటాయి. నీవిచ్చిన మాటను నిలబెట్టుకో. అబద్ధమాడాలని చూడకు. పతివ్రత, గుణవంతురాలు, సంతానవతి, అనుకూలవతి అయిన భార్యను తిరస్కరిస్తే ఇహపరాలు రెండూ ఉండవు. ధర్మార్థకామసాధనకు ఉపకరణం, గృహనీతి విద్యకు నెలవు, సద్గతికి ఊతం భార్యే అని గుర్తుంచుకో.

అదలాఉంచు ఈ కొడుకు పున్నామనరకం నుంచి నిన్ను రక్షించేవాడు. ఒక దీపం నుండి మరొక దీపం వెలిగినట్లు నీకు పుట్టినవాడే వీడు.

**"విపరీత ప్రతిభాష లేమిటికి నుర్వీనాథ యీ పుత్రగా**
**త్ర పరిష్వంగ సుఖంబు సే కొనుము ముక్తాహార కర్పూర సాం**
**ద్రపరాగ ప్రసరంబు జందనము చంద్రజ్యోత్స్నయుం పుత్రగా**
**త్ర పరిష్వంగమునట్లు జీవులకు హృద్యంబే కడున్ శీతమే"**

ఈ పుత్రుని కౌగిలించుకొని చూడు. ముత్యాలహారాలు, పచ్చకర్పూరం, మంచి గంధం, వెన్నెల కూడా ఇంత హాయినీ, చల్లదనాన్నీ ఇవ్వవు సుమా! గాంధర్వవిధిన నన్ను వివాహం చేసుకొన్నప్పుడు నా కిచ్చినమాట తప్పుతావా. సత్యం ఎంత గొప్పదో వివరిస్తుంది శకుంతల.

**"నుతజల పూరితంబులగు నూతులు నూటిటికంటె సూనృత**
**వ్రత యొక బావిమేలు, మరి బావులు నూటిటికంటె నొక్క స**
**త్క్రతువదిమేలు, తత్క్రతు శతంబునకంటె సుతుండుమేలు, త**
**త్సుత శతకంబుకంటె నొక సూనృతవాక్యము మేలు సూడగన్"**

నూతులు, బావుల కంటె యజ్ఞం, దాని కంటె సుతుడుమేలు అంటూ వీటన్నింటికంటె సత్యం శ్రేష్ఠమైనది అని వివరించింది. అంతేకాదు వేయి అశ్వమేధాల ఫలాన్ని ఒక వైపు సత్యవాక్కును మరోవైపు పెట్టి తూచినట్లైతే సత్యంవైపే ముల్లు మొగ్గుచూపుతుంది. విశ్వామిత్రుడికి, మేనకకు పుట్టిన నేను అంత ధర్మం తెలియనిదాన్నా అంటుంది.

అయినా నిజం ఒప్పుకోడు దుష్యంతుడు. పుట్టిన వెంటనే తల్లిదండ్రుల చేత విడిచిపెట్టబడ్డాను. ఇప్పుడు భర్తకూడా స్వీకరించడం లేదు. కొరగాని నోములు నోచినాను అని దుఃఖిస్తూ వెనుతిరగబోయింది శకుంతల.

భార్య ఔన్నత్యాన్ని, కుమారుడి స్థానాన్ని మొదట చెప్పి అంతకంటె స్థిరంగా సత్యం యొక్క గొప్పతనాన్ని చాటింది. సత్యధర్మాలను కాపాడడానికి దైవం ఉన్నాడు అని నిరూపిస్తూ అశరీరవాణి శకుంతల పతివ్రతాశిరోమణి అని ఆ కుమారుడు నీవలన పుట్టినవాడే అని పలికింది. శకుంతల ధార్మికపరిజ్ఞానం, సత్యదృష్టి ఈ సందర్భంలో విశదమౌతాయి. ఆమె విశుద్ధ చరిత్ర అని మనకు అవగతం అవుతుంది. ఈ శక్తి ఆమెకు విశ్వామిత్రుని నుంచి సంక్రమించింది. ఆమె లావణ్యం మేనకనుంచి వచ్చి ఉంటుందని ముందే చెప్పుకొన్నాం. ఇక ఇప్పుడు ఆమె చేసే ప్రబోధం కణ్వమహర్షి పెంపకంలో ఆశ్రమవాసవాతావరణం వలన ఏర్పడిన సంస్కారఫలితంగా భావించవచ్చు.

దుష్యంతుడిని ఆతడి సభామధ్యంలోనే ప్రశ్నించిన గొప్పధీశక్తి శకుంతల వ్యక్తిత్వానికి గీటురాయి. అతడు తనను భార్యగా స్వీకరించ లేదని ఏ మాత్రం బాధపడలేదు శకుంతల. కుమారుడిని అంగీకరించక పోవడం గృహస్థధర్మానికి విఘాతం కదా అని విచారించింది. ఆడినమాట

తప్పినందుకు మరింత ఎక్కువ బాధపడింది. శకుంతల ధర్మం పక్షాన నిలబడి అసత్యవచనుడిగా, ధర్మవిరోధిగా మారబోతున్న భర్తను, ఒక రాజును రక్షించింది. అలాంటి తరుణంలో ఆమె తిరిగి వెళ్ళిపోవడానికి ఉద్యుక్తురాలయింది. అప్పుడు అశరీరవాణి రాజు, ఆ సభలో ఉన్న పురజనులు వింటున్న సభలో శకుంతల సత్యవాదిని అని ఆ పుత్రుడు, భరతుడు దుష్యంతుని కుమారుడని పలికింది.

లోకాపవాదభీతితో ఆమెను తాను గుర్తించినా తెలియనివానివలె ఉండిపోయానని దుష్యంతుడు పలికి తన పుత్రుని కౌగిలించుకొని ఆమెను స్వీకరిస్తాడు. శకుంతల చేసిన ధార్మికప్రబోధం, సత్యం యొక్క విశిష్టత అన్ని కాలాలకు, అన్ని అవస్థలకు అన్వయింపదగినదిగా ఉంటుంది. గార్హస్థ్యధర్మానికి పునాది వేసిన శకుంతల మహిమాన్వితయైన స్త్రీ మూర్తి. మహిళలకు ఆదర్శంగా నిలువదగిన ధీమతి!

* * *

# 19. సావిత్రి

మద్రదేశాన్ని అశ్వపతి అనే రాజు పాలించేవాడు. అతడు సావిత్రి అనే దేవతను ఉపాసించాడు. ఆమె అతడికి ప్రత్యక్షమై సావిత్రి అనే కుమార్తెను అనుగ్రహించింది. అశ్వపతికి, రాణి మాళవికి పుట్టిన కూతురే సావిత్రి. ఆమె పెరిగి పెద్దది అయిన సమయంలో నారదుడు అశ్వపతిని సందర్శించాడు. కుమార్తె వివాహయోగ్యయైనదికదా అని ప్రస్తావించాడు. అప్పుడే అక్కడికి వచ్చిన సావిత్రిని కళ్యాణమస్తు అని దీవించాడు.

అశ్వపతి కుమార్తెను నీకు ఎవరినైనా వివాహమాడవలెనని ఉన్నట్లైతే చెప్పు. నీ ఇష్టమే నా ఇష్టం అన్నాడు. ఆమె సాళ్వదేశానికి చెందిన రాకుమారుడు సత్యవంతుడు రూపవంతుడు, గుణవంతుడు అని విని అతనినే వివాహమాడవలెనని నిశ్చయించుకొన్నాను అని సావిత్రి చెప్పింది. అతని తండ్రి ఇప్పుడు రాజ్యభ్రష్టుడై భార్యాపుత్రులతో అడవులలో నివాసమేర్పరచుకొని ఉన్నాడు. అయినప్పటికీ నేను సత్యవంతుడినే వివాహం చేసుకొంటాను అన్నది. సావిత్రి దృఢనిశ్చయం, సత్యవంతుని పట్ల ఆమెకు గల గాఢానురాగం తేటతెల్లమయ్యాయి. అశ్వపతి ఆ సత్యవంతుని రూపగుణశీలాలను గురించి నారదుడిని అడిగాడు. ఆతడు సార్థకనామధేయుడే కాని సరిగ్గా నేటికి ఒక సంవత్సరం తర్వాత మరణిస్తాడు అని త్రికాలవేది అయిన నారదుడు పలికాడు. అశ్వపతి అల్పాయుష్కుడైన సత్యవంతుడిని కాక వేరొకరిని కోరుకొమ్మని సావిత్రిని కోరాడు. త్రికరణశుద్ధిగా అతడినే భర్తగా భావించాను కాబట్టి వేరొకరిని చేసుకొనలేను అని నిర్భీతితో పలికింది. నారదుడు సావిత్రిని చేసుకొని సత్యవంతుడు పూర్ణ ఆయుర్దాయాన్ని పొందగలడని ఆశీర్వదించి, ఆమె నిర్ణయాన్ని గౌరవించమని అశ్వపతికి చెప్పి వెళ్ళాడు. అది దైవాజ్ఞ అని ఆ దేవర్షికి తెలిసే ఉంటుంది.

ఒక శుభముహూర్తాన సావిత్రిని, బంధుమిత్రులను, పురోహితులను వెంట తీసికొని అరణ్యంలో నివసిస్తున్న ద్యుమత్సేనుని ఆశ్రమానికి

వెళ్లాడు అశ్వపతి. అతని కుమారుడే సత్యవంతుడు. అతడికి తన ఒక్కగా నొక్క కూతురు నిచ్చి వివాహం చేయదలిచాను అని అశ్వపతి చెప్పినపుడు అరణ్యావాసక్లేశాన్ని ఆమె అనుభవించగలదా అని ద్యుమత్సేనుడు సందేహించాడు. నా కుమార్తె ధీరమతి. కలిమిలేములకు చలించదు అని చెప్పి వివాహం జరిపించి అశ్వపతి వెళ్ళిపోతాడు.

సావిత్రి ఆడంబరాలను విడిచిపెట్టి, నారచీరలను ధరించి భర్తకు, అత్తమామలకు సేవలు చేస్తూ కాలం గడపసాగింది. నారదుడు చెప్పిన గడువు ముగిసే దానికి ఇంకా నాలుగు దినాల కాలం ఉండగా సావిత్రి త్రిరాత్రోపవాసవ్రతాన్ని ప్రారంభించింది. మూడు రాత్రులు గడిచాయి. సత్యవంతుడు సమిధలు, ఫలములు తేవడానికి గొడ్డలి గంపలు తీసుకొని అడవిలోపలికి బయలుదేరాడు. సావిత్రి అతని వెంట నడిచింది.

సావిత్రి, సత్యవంతులు కొంతప్రొద్దు అరణ్యంలోని అందచందాలను చూస్తూ ముచ్చటలాడుతు కాలం గడిపారు. అప్పుడు సత్యవంతుడు ఒక చెట్టుపైకి ఎక్కి కట్టెలు కొట్టడం ప్రారంభించాడు. కొంచెంసేపటికే వివశుడై దిగివచ్చి సావిత్రిఒడిలో తలపెట్టుకొని విగతజీవుడయ్యాడు. ఆమె ఎదుట దేవతాస్వరూపుడైన యముడు ప్రత్యక్షమయ్యాడు. ఆ ధర్మదేవతకు సావిత్రి నమస్కరించింది. నీవు పతివ్రతవు కాబట్టి నన్ను చూడగల్గుతున్నావు. ఈతడు పుణ్యవంతుడు కాబట్టి నేను స్వయంగా వచ్చాను అంటూ తన పాశంతో సత్యవంతుని ఆత్మను గైకొని వెళ్ళిపోసాగాడు. సత్యవంతుని శరీరాన్ని ఒక పొదలో దాచి సావిత్రి యముడిని అనుసరించి వెళ్ళసాగింది. కొంతదూరం పోయిన తర్వాత యముడు ఆమెను ఏదైనా ఒకవరం కోరుకొమ్మని ఆదేశిస్తాడు. అటుపైన మార్గం ఆమెకు అనుసరణీయం కాదు అంటాడు. ప్రతివచనంగా తన భర్త మార్గమే తనకు తగినది అని చెప్పింది సావిత్రి. పతిప్రాణాలు కాకుండా ఏదైన వరం కోరుకొమ్మనిన యముడితో తన మామకు దృష్టిని ప్రసాదించమని కోరింది. యముడు అంగీకరించాడు. ఇంకా యముడిని అనుసరిస్తూనే వెళ్తుంది సావిత్రి. ఇంకా ఏమి కోరి తన్ను అనుసరిస్తుందో

అని సమవర్తి పతిప్రాణాలు కాక వేరే ఏదైనా కోరుకొమ్మని అంటాడు. మామయ్య ద్యుమత్సేనునికి రాజ్యం తిరిగి లభించాలని అడుగుతుంది. యముడు వరమిచ్చి వెళ్తుంటే సావిత్రి వెంటనంటి నడుస్తూనే ఉంటుంది. ప్రాణేశు బ్రదుకు దప్ప ఇంకా ఏదైనా వరం కోరుకొమ్మంటాడు యముడు. తన తండ్రి అశ్వపతికి పుత్రసంతానమిమ్మని కోరుకుంటుంది సావిత్రి అంగీకరిస్తాడు ఆ ధర్మస్వరూపుడు. అయినా ఇంకా వెన్నంటి వెళ్తుంది సావిత్రి. ఆమె పట్టుదలకు ముగ్ధుడై ఏదేని ఒక వరం కోరుకొమ్మని (పతి ప్రాణాలు కాక అనే మాటను పరిహరించి) అనుగ్రహిస్తాడు. పతిప్రాణాలు తప్ప అనే మాట ఈసారి పలుకలేదు సమవర్తి.

**ఏడుమాటలాడిన యంత నెట్టివారు**
**నార్యజనులకు జుట్టంబులగుదురని న**
**చిర సమాలాపన సంసిద్ధి జేసి నీకు**
**నేను జుట్టమనిన వేఱయేల చెప్ప?**

సావిత్రి సమవర్తితో ఈ మాట అనగలిగింది అంటే అది కూడా పతి ప్రాణాలు కోల్పోయిన సందర్భంలో అంటున్నది అంటే ఆమె ఎంత దృఢసంకల్పం కలిగిందో, ఎంత ఆత్మవిశ్వాసం కలిగిందో తెలుస్తుంది. ఆమె వాక్చాతుర్యానికి, పట్టుదలకు యముడే ఆశ్చర్యపోయి ఆమె కోరిన వరాలన్నీ ఇచ్చాడు.

ఆమె పరిపరి విధాలా యముడిని ప్రార్థిస్తూ సత్యవంతుడిని పునర్జీవితుడిని చేయమని అర్థిస్తుంది. యముడు ఆమె వినయ వివేక దీక్షకు మెచ్చి సత్యవంతుని ఆత్మను ఆమె అధీనం చేస్తాడు. ఆమె సంతసించి వెనుదిరిగి పొదలో దాచిన సత్యవంతుని శరీరంలో ఆత్మను ప్రవేశపెడ్తుంది. ఆమె చేసుకొన్న పుణ్యఫలం వలన సత్యవంతుడు పునర్జీవితుడౌతాడు. ద్యుమత్సేనునికి దృష్టివస్తుంది, రాజ్యలాభం కలుగుతుంది. తండ్రి అశ్వపతికి పుత్రసంతానం లభిస్తుంది. పతివ్రతా శిరోమణి సావిత్రి దీక్ష, సహనం, సౌశీల్యం ఆదర్శప్రాయమైనవి.

# 20. దమయంతి

విదర్భరాజైన భీమునికి దముడు అనే ఋషివరప్రసాదంతో జన్మించిన కన్యారత్నం దమయంతి. ఈమె మిక్కిలి సౌందర్యవతి. రూపసి మాత్రమే కాదు అత్యంత బుద్ధికుశలత, సౌశీల్యసంపద ఈమె స్వంతం. దమయంతి సుగుణరాశి అని విని నలుడు హంసను దూతగా పంపాడు. ఆమె నలుని వరించినగాని ఆమె రూపగుణాలకు సార్థక్యం లేదు అని ఆ హంస వచించింది. నారదాదులు కూడా స్వర్గానికి వెళ్ళినపుడు 'నర సిద్ధ సాధ్య విద్యాధర సురకన్యకల కంటె దమయంతియ సుందరి' అని ప్రకటించినారు. అందుచేతనే భీముడు ఆమెకు ఆమె స్వయంవరాన్ని చాటినపుడు ఇంద్రాది దేవతలు దమయంతిని వరించాలని అనుకొన్నారు.

తమ దూతగా నలుడినే ఎన్నుకొని తమ తమ గుణగణాలను దమయంతికి వివరించి చెప్పుమని కోరినారు. అంతకుమునుపే ఆమె నలుని వరించి ఉన్నదని వారికి తెలుసు. నలుడు ఎంత చెప్పినను తాను నలుడినే భర్తగా కోరుకుంటున్నానని చెప్పింది. దేవతలు నలుని రూపాన్ని ధరించి స్వయంవరానికి విచ్చేసారు. నలుడు కూడా స్వయంవరానికి వచ్చి ఉన్నాడు. వారిలో తాను వలచిన భూమీశుడు నలుడిని గుర్తించడానికి, ఆమె పార్వతీదేవిని ప్రార్థించింది. దేవతలు వారి వారి నిజస్వరూపాలను పొందినారు. అప్పుడామె వారికి నమస్కరించి నలుని వరించింది. ఆమె ఎంతటి ప్రఖ్యాతి కలిగిందో ఈ సన్నివేశం వలన విదితమౌతుంది.

దేవతలు తిరిగి స్వర్గానికి వెళ్తున్నప్పుడు వారికి కలిపురుషుడు ఎదురౌతాడు. దమయంతి నలుని వరించిన విషయం వారి వలన విని అసూయతో క్రుద్ధుడై వారిరువురిని ఎడబాపుతానని పూనిక వహిస్తాడు.

నలదమయంతులు కొంతకాలం సుఖంగా గడుపుతారు. వారికి ఇంద్రసేనుడనే కుమారుడు, ఇంద్రసేన అనే కుమార్తె జన్మిస్తారు. కలి తగిన సమయం చూచి నలుని వశపరచుకొంటాడు. నలుడు పినతండ్రి కుమారుడైన పుష్కరునితో జూదమాడి సర్వం పోగొట్టుకుంటాడు. కలి అక్షవిద్యలో ఆరితేరిన నలుని ఓడించడానికి అక్షములలో ప్రవేశించి ఇదంతా జరిగేటట్లు చేస్తాడు.

నలదమయంతులు అడవులలో నివసించడానికి వెళ్తారు. నలుడు ఆమెను విదర్భకుగాని మరేదైనా బంధుజనం పాలించే రాజ్యానికి గాని పోయి సుఖంగా ఉండమంటే దమయంతి ఒప్పుకోదు. కలిమి కలిగినపుడు వెంట ఉండి లేమిలో విడిచిపోవడం సతీధర్మం కాదని తాను నలుని ఎడబాసి ఉండననీ చెప్తుంది వైదర్భి.

ఆమె పడుతున్న కష్టాన్ని చూడలేక తాను వెళ్ళినట్లైతే ఆమె పుట్టినింటికి పోతుంది అనే ఆశతో అరణ్యంలో ఆమె నిదురించే సమయంలో నలుడు వెళ్ళిపోతాడు. దమయంతి మేల్కొని ఎంతగానో విలపిస్తుంది. సమీపంలో ఉండే ఋష్యాశ్రమాలకు వెళ్ళి నలుని జాడ తెలుసుకోవడానికి ప్రయత్నిస్తుంది. ఆ సమయంలో ఒక వెనుబామును చూచి ఆర్తనాదం చేస్తుంది. సమీపంలో ఉన్న ఒక ఎఱుకలవాడు దాని బారి నుంచి రక్షిస్తాడు. మరుక్షణం ఆమెను చూచి బలవంతం చేయబోతాడు. నేను పతివ్రతనైతే ఈ పాపాత్ముడు నశించుగాక అని శపిస్తుంది. వాడు తక్షణం మరణిస్తాడు. దమయంతి చేదినగరం చేరుతుంది. ఆ దేశపురాణి దమయంతిని చూచి శాపవశాన భూమి మీదికి దిగిన దేవకాంత అని ప్రశంసిస్తూ నివురుగప్పిన నిప్పువలె నున్న దమయంతిని సైరంధ్రిగా స్వీకరిస్తుంది. ఎంగిలి ముట్టననీ, అనుచితమైన పనులు చేయజాలననీ దమయంతి ముందే చెప్తుంది.

ఇదిలా ఉండగా ఆమెను వెదకుచూ వచ్చిన భీముని వేగులు ఆ భద్రలక్షణను గుర్తించి విదర్భకు తీసుకొని వెళ్లారు. నలుడు కర్కోటకుని బారినపడి విరూపుడౌతాడు. ఋతుపర్ణుని వద్ద అశ్వరక్షకుడుగా ఉన్న నలుని దమయంతి తెలుసుకొన్న విధం అపూర్వం. ఆమె బుద్ధికుశలతకు, పట్టుదలకు నిదర్శనం. మొట్టమొదట పతివ్రత అయిన తనను, ఏకవస్త్రను, దుర్గమారణ్యంలో విడిచివెళ్ళడం సమంజసమా, ధర్మమా అని అడగమని అనేక రాజ్యాలకు సదాచారసంపన్నులైన వారిని పంపిస్తుంది.

అయోధ్యను పాలిస్తున్న ఋతుపర్ణుని వద్ద ఉన్న బాహుకుడు దానికి తగిన ప్రత్యుత్తరమిస్తాడు. అతడొక్కడే ఎందుకు సమర్థించుకొన్నాడు ఆ చర్యను అని తలపోసి అతడు నలుడని గుర్తించింది. అతడిని విదర్భకు రావించడానికి ఒక ఉపాయం ఆలోచించింది. తనకు పునః స్వయంవరం చాటింపుమని, ప్రత్యేకంగా ఋతుపర్ణునికి సందేశం పంపమని అది గూడ వెనువెంటనే జరగాలని తండ్రిని అడుగుతుంది. ఋతుపర్ణుడితో బాటు అశ్వరక్షకుడిగా ఉన్న నలుడు ఆ స్వల్పకాలంలో అతివేగంగా విదర్భకు వస్తాడని ఆమె ఊహించింది.

బాహుకుడు కురూపిగా ఉన్నప్పటికీ అతని అశ్వహృదయ విద్యనుబట్టి నలుడేనని భావిస్తుంది. ఆతని వంటలను చెలికత్తెను పంపి తెప్పించి రుచి చూస్తుంది. ఋతుపర్ణుడు వచ్చేటప్పుడే ఆ రథఘోషను బట్టి నలుని రథచోదకనైపుణ్యాన్ని గుర్తిస్తుంది. అటుపైన తన కొడుకుని, కూతురిని బాహుకుని వద్దకు పంపిస్తుంది. ఆతడు వారిని ఎత్తుకొని ముద్దాడి బాష్పలోచనుడు కావడం చెలికత్తె ద్వారా వింటుంది. ఇన్ని రకాలుగా పరీక్షించిన తర్వాత తల్లితో చెప్పి తండ్రి అనుమతితో తన వద్దకు రప్పించుకొంటుంది. నిన్ను వీడను అని చెప్పి ఎందుకు మాటతప్పావు అని ప్రశ్నిస్తుంది. తాను కలిప్రభావంతో ఇదంతా చేశానని

చెప్పి కర్కోటకుని తలచుకొని తన నిజస్వరూపాన్ని పొందుతాడు నలుడు. నీవు పునఃస్వయంవరాన్ని చాటింపచేయడం తప్పు కాదా అని నలుడు అడిగినపుడు అతడిని రావించడం కోసమే ఈ పునఃస్వయంవరప్రకటన అని చెప్తుంది. వాయుదేవుడు ఆమె అగణిత పుణ్యశీల అనీ, మహాసాధ్వి అని అశరీరవాణిగా ప్రకటిస్తాడు. దమయంతి కుశాగ్రబుద్ధి, సాధువర్తనం, సమయోచిత సంవాదం, విచక్షణపరిధి నిరుపమానమైనవి.

నలోపాఖ్యానం భారతకథకు అతి దగ్గరగా ఉంటుంది. నలుని లాగా ధర్మరాజు జూదప్రియుడు, భీముడు పాకశాస్త్రనిపుణుడు, నకులుడు అశ్వహృదయం తెలిసినవాడు. వీటన్నింటికీ మించి దమయంతి వలె ద్రౌపది కార్యదీక్షాపరురాలు. దమయంతిని అడవిలో భిల్లుడు పట్టబోయినట్లు ద్రౌపదిని సైంధవుడు, కీచకుడు కోరి మరణిస్తారు. దమయంతిస్థైర్యం ద్రౌపదికి పూర్తిగా ఉంది. పై పెచ్చు హృదయ దౌర్బల్యం ఏ మాత్రం లేని మానినులు వీరు. ప్రణాళికతో దమయంతి, పౌరుషంతో ద్రౌపది తాము తలపెట్టినదాన్ని సాధిస్తారు.

* * *

# 21. ప్రమద్వర

విశ్వావసుడనే గంధర్వరాజుకు, మేనకకు పుట్టిన కుమార్తె ప్రమద్వర. స్థూలకేశుడనే ముని ఆశ్రమంలో పెరుగుచున్నప్పుడు రురుడు ఆమెను ప్రేమించి వివాహమాడాలనుకొన్నాడు. ఇతడు ప్రమతికి, ఘృతాచికి పుట్టినవాడు. ఇంతలో ఒకనాడు ఇతర కన్యలతో కూడి ఆడుకొనుచుండిన ప్రమద్వరను పాము కరిచింది. వెంటనే ఆమె మరణించింది. మైత్రేయుడనే ప్రముఖుడు ప్రమద్వరను స్థూలకేశుని ఆశ్రమానికి తీసుకొనిపోయాడు. రురుడు ఈమెను చూచి మిక్కిలి బాధపడి అడవిలోకి వెళ్ళి ప్రార్థించసాగాడు. నీ ఆయువులో సగం ఆమెకిస్తే ఆమె పునర్జీవిత అవుతుందని ఆకాశవాణి పలికింది. రురుడు దానికి అంగీకరించి తన ఆయువులో సగం ప్రమద్వరకు ఇచ్చాడు. ఆమె నిద్రనుండి మేల్కాంచిన విధంగా లేచి కూర్చున్నది. రురుడు ఆమెను వివాహం చేసుకొన్నాడు. వారిద్దరూ సుఖంగా ఉన్నారు.

కాని పాము ఒకటి ప్రమద్వరను కాటు వేసిందనే కోపంతో రురుడు కనిపించిన పామును చంపడం మొదలుపెట్టాడు. ఒకసారి రురుని చేతిలో బడిన పాము తప్పించుకొని మానవుడిగా మారి తాను సహస్రపాదుడనే బ్రాహ్మణుడను అనీ శాపవశాత్తు పామునైనానని చెప్పి రురునికి నమస్కారం చేసి జీవహింస తగదు అని నచ్చచెప్పాడు. అతని బోధతో రురుడు పన్నగసంహారాన్ని విరమించాడు.

తను బ్రతకడం కోసం ఆయువులో సగమిచ్చిన రురుడు భర్తగా లభించడం ప్రమద్వర అదృష్టం! ప్రమద్వర వంటి మహిళామణులు లోకంలో ఎందరో ఉంటారు కాని రురునివంటి భర్తలు చాలా అరుదుగా ఉంటారు. ఈ వృత్తాంతంలో మానవాళికి ఒక సందేశం కూడా ఉంది. జీవహింస మహాపాపం అనేది ఒకటైతే, ఒకపాము ప్రమద్వరను కాటేసిందని సర్పసంతతినే నాశనం చేయాలనుకోవడం తగదనేది మరో సందేశం.

లోకంలో కులమత జాతివిధ్వంసం జరగడం ఈ సంయమనం లేకపోవడం వలననే ఇప్పటి కాలంలో సహస్రపాదుల అవసరం ఎంతైనా ఉంది. సహస్రపాదుడు వంటివాడు చెప్తే రురుడు విన్నాడు. వినే రురుడి వంటి వారు ఎందరున్నారు అనేది సంశయాస్పదం.

## 22. ప్రద్వేషిణి

ప్రద్వేషిణి దీర్ఘతముని భార్య. విద్యాసంపన్నుడు అయిన దీర్ఘతముడు బృహస్పతిశాపం చేత పుట్టుగ్రుడ్డి అయినప్పటికీ సకల శాస్త్ర పారంగతుడు. ఆతని వలన పుత్రులను కూడా పొందింది. ఎప్పుడూ దీర్ఘతముని మీద కోపాన్ని ప్రదర్శిస్తూ ఉండేది ప్రద్వేషిణి. ఎందుకు నాపై ఇలా విసుగుకొంటూ ఉంటావని ఆ ముని ప్రశ్నిస్తాడు. భరించేవాడు భర్త. భరింపబడేది భార్య. నిన్నే నేను భరిస్తున్నాను. నీపై నాకు ప్రేమ లేదు. ఎక్కడికైనా వెళ్ళిపొమ్మంటుంది. పతివిహీన అయిన భార్య మాంగల్యం, అలంకారాలు ధరించకుండా ఉండుగాక అని శపిస్తాడు దీర్ఘతముడు. కొడుకులను పిలిచి మీ తండ్రిని ఎక్కడైన వదిలి పెట్టివేయమని ఆదేశిస్తుంది ప్రద్వేషిణి. కొడుకులు తండ్రిని బంధించి గంగానదిలో వదిలి వేస్తారు. అతడు ప్రవాహంలో కొట్టుకుపోతున్నప్పుడు వేదపఠనం గావిస్తూ ఉండడం బలియనే రాజు కంటబడుతుంది. అతడు దీర్ఘతముడిని బంధవిముక్తుడిని చేసి తన ఇంటికి తీసుకొనిపోతాడు.

ప్రద్వేషిణి అంధుడైన భర్తను నిర్దాక్షిణ్యంగా వెళ్ళిపొమ్మన్న ఉదంతం స్త్రీజాతికి వన్నెతెచ్చేదిగా లేదు. అతని విద్యాసంపన్నతను చూచి పెండ్లాడి పుత్రులను కని చేయకూడని పని చేసింది ప్రద్వేషిణి. అంధుడు కావడమే ఆమెకు అతనిపట్ల ఏహ్యత కలగడానికి కారణం కావచ్చు. అతడు తనను సంరక్షించాలి కాని తానే ఆతనిని భరించవలసిరావడం ఆమెకు కంటకప్రాయమైనట్లుగా తోస్తుంది. దానివలన స్త్రీజాతికే అపకారం జరిగింది. శాశ్వతంగా భర్తను కోల్పోయిన స్త్రీ నిరలంకారగా జీవించడం అప్పటి నుండే ప్రారంభమైంది.

ప్రద్వేషిణి వైపునుండి ఆలోచిస్తే ఈ కథ మరోవిధంగా కనిపిస్తుంది. సంతానం పెరుగుతున్నది, సంపాదన లేదు. ఇందర్ని పోషించే భారం

ఆమె మీద పడింది. కొడుకులు చేతికి అందివచ్చారు. పైగా "నన్నెందుకు మెచ్చవు" అని ప్రశ్నిస్తున్నాడు. అతని పాండిత్యాన్ని చూసి వివాహం చేసుకొంది నిజమే! కాని సంసారరథాన్ని లాగడానికి కావలసింది సంపాదన, పాండిత్యం కాదు. ఆ విషయాన్నే కంఠోక్తిగా చెప్పి వెళ్ళిపొమ్మంటుంది ప్రద్వేషిణి.

**"పతియ భరియించు గావున భర్తయయ్యె**
**భామ భరియింప బడు గాన భార్యయయ్యె"** అని తర్కానికి దిగింది.

మన విషయంలో పై వాక్కులు తారుమారు అయ్యాయి. ఎల్లకాలం నిన్ను భరించి సపర్యలు చేయడం నావల్ల కాదు అని దీర్ఘతముడితో ఖరాఖండిగా చెప్పింది. ఉన్నతవర్గాలవారికి ఇది తప్పుగా కనిపించే చర్య. దిగువ మధ్య తరగతి వారికి అనివార్యచర్య అనిపించవచ్చు! నీటిలో వేయించడం మాత్రం దుర్మార్గం.

* * *

## 23. పౌష్యమహాదేవి

ఈమె పౌష్యుడు అనే మహారాజు భార్య. మహాసాధ్వి. శుచిమంతురాలు. అశుచిగా నున్నవారికి ఈమె గోచరించదు. ఈమె కుండలాలు విశేష ప్రాముఖ్యాన్ని కలిగినవి. పైలుని శిష్యుడైన ఉదంకుడు గురుపత్ని కోరిక మేరకు పౌష్యమహాదేవి కుండలాలను తీసుకొని వెళ్ళడానికి ఆ మహారాజును ఆశ్రయించాడు. నీవు శుచిమంతుడివి అయితేనే ఆమె కనిపిస్తుందని కూడా రాజు చెప్పాడు. ఆమెను సందర్శించ గోరి వెళ్ళిన ఉదంకునికి ఆమె కనిపించదు. దారిలో గోమయభక్షణం చేసి ఆచమనం చేయకుండా వచ్చానని ఉదంకుడు గ్రహిస్తాడు. తిరిగి వెళ్ళి కాలుసేతులు కడుగుకొని వస్తే ఆ మహారాజ్ఞి కనిపించింది. ఉదంకుడు తన గురుపత్ని కోరిన కుండలాలను ఇమ్మని అర్థించగానే ఆమె వాటిని తీసి ఇచ్చింది.

ఉదంకుడు అరణ్యమార్గంలో వెళ్తుండగా తక్షకుడు అను నాగరాజు వాటిని అపహరించాడు. అవి మహిమాన్వితమైన రత్నాభరణాలు. ఉదంకుడు వాటిని తిరిగి సంపాదించి గురుపత్నికి సమర్పిస్తాడు. తక్షకుని మీద కోపంతో ఉన్న ఉదంకుడు జనమేజయుని చెంతకు వెళ్ళి సర్పయాగము చేయమని తన తండ్రి పరీక్షిత్తు మరణానికి తక్షకుడే కారణమని చెప్పాడు.

ఇక్కడ ఒక విషయం మనకు అవగతమౌతుంది. పైలుని భార్య మునిపత్ని. ఆమె పౌష్యమహాదేవి కుండలాలను కోరడం హర్షణీయం కాదు. అందుకు ఉదంకుని నియమించడం మునిపత్నికి తగిన పనికాదు. ఇతరుల సొమ్మును ఆశించడం మహాపరాధం. ఇక పౌష్యమహాదేవి ఎంతో ధీమంతురాలు. అశుచిగా ఉన్నవారికి కనబడదు అంటే ఆమె

ఎంత సమున్నతమైన శక్తి కలిగిందో తెలుస్తుంది. అంతేకాదు ఉదంకుడు అడిగినంతనే ఆమె తన అమూల్యమైన కుండలాలను ఇచ్చివేస్తుంది. పైలుని పత్ని కంటె పౌష్యుని దేవేరి గుణోన్నతి విశదమౌతుంది.

ఇతరుల ధన కనక వస్తువాహనాలను చూచి అసూయ చెందకూడదని ఆర్యోక్తి. విదురుడు ఈ మాట ధృతరాష్ట్రునితో స్పష్టంగా చెబుతాడు. ఇక్కడ పైలుని భార్య పౌష్యమహాదేవి కుండలాలను తెమ్మని శిష్యుడిని ప్రోద్బలం చేయడం మహాపరాధం – అదీ ఒక గురుపత్ని అయి ఉండి పాపపు పని చేసేవాడి కంటె చేయించేవాడికే ఎక్కువ శిక్ష పడుతుంది. గురుపత్నికి ధర్మసూక్ష్మం తెలియదా అంటే తెలుసుకొని కోరిక ఏ పనినైనా చేయిస్తుంది. 'ఆశాపాశము' తాకడునిడుపు అని భాగవతంలో చెప్పబడుతుంది. పరుల ధనాన్ని కోరుకోవడమే పెద్ద తప్పు!

* * *

## 24. సుమన - శాండిలి

కేకయరాజపుత్రి అయిన 'సుమన' అమరపురంలో అనగా స్వర్గంలో నివసిస్తున్న శాండిలిని చూచి 'అతివా! ఇంత శ్రేష్ఠమైన దేవలోకనివాసం నీకు ఎటువంటి నడవడిక వలన లభించిందో చెప్పు' అని కోరింది. దానికి శాండిలి చెప్పిన సమాధానం ప్రధానంగా పతివ్రతల లక్షణాలను చెప్పడానికే ఉద్దేశింపబడింది. 'అత్తమామలకు ఎదురుచెప్పను. దైవపూజలు, శ్రాద్ధకర్మలు, అతిథి సత్కారాలు అనే పనులలో ఎడముఖం పెట్టను. సత్ప్రవర్తనతో ఉంటాను. వీధివాకిలి వద్ద నిలబడను. పకపకా నవ్వను. పరిశుద్ధమైన అంతఃకరణతో విద్యాతురులకు భిక్షపెడుతూ తక్కిన గృహసంబంధకార్యాలు చేస్తుంటాను. భర్త ఇంటికి వచ్చినపుడు ఆసనం వేయడం, కాళ్ళకు నీళ్ళు ఇవ్వడం మొదలైన పనులు నేనే దగ్గరుండి చేస్తాను. బిడ్డలను తీర్చిదిద్దడం అనేది నా బాధ్యతే. ఎక్కడైనా ఎవరైనా చెడ్డపని చేసినా తిట్టను. నాకంటూ ప్రియమైనది వేరే ఏమీలేదు. భర్తకు ఇష్టమైన వంటలను రుచికరంగా చేస్తాను.

భర్త పరదేశ గతుడైతే అతడు వెళ్ళింది మొదలు తిరిగివచ్చేదాకా పువ్వులు, సుగంధద్రవ్యాలు, మంచిచీరలు, నగలు అలంకరించుకోను. రుచికరమైన వంటలను ఆరగించను. ఏ విధంగాను ధాన్యాన్ని, అన్నాన్ని వృథా చేయను. బంధువులను తగిన రీతిగా ఆదరిస్తాను.

ఆవులు, పక్షులు మున్నగు జీవులను రక్షిస్తాను. ఇంటి పనుల విషయంలో భర్త మనసుకు కష్టం కలిగించే పని చేయను. భర్తకొరకు అగ్నిని కాపాడుతాను. ఇంటిగుట్టు బయటపెట్టను. గర్భవతిగా ఉన్నప్పుడు బిడ్డక్షేమాన్ని కోరుకుంటూ ఇతర రుచికరమైన వంటలను దూరంగా ఉంచుతాను. ఈ విధంగా వివరించి అటువంటి స్త్రీకి

ఇహపరాలు రెండూ లభిస్తాయి. అరుంధతివలె ప్రశస్తి పొందుతుంది' అని తెలవిస్తుంది శాండిలి.

ఈ వృత్తాంతమంతా ఆనాటి పతివ్రతల ప్రవర్తనను గూర్చి వివరించేదిగా కనిపిస్తుంది. ఇంచుమించు ఇలాంటివే ద్రౌపది సత్యభామకు అరణ్యవాసకాలంలో విన్నవిస్తుంది. ఈ పతివ్రతాలక్షణాలు భారత రచనాకాలం నుంచీ నేటివరకు అనూచానంగా ఆచరింపబడుతూనే ఉన్నాయి. వీటిని త్రోసిరాజన్నవారు అప్పుడూ ఇప్పుడూ కూడా ఉన్నారు. మానవస్వభావం విచిత్రమైంది. ఎంత నియమించాలని చూస్తే అంత ఎదిరించాలని చూస్తుంది. ఏ మాత్రం పై నియమాలకు విరుద్ధంగా ప్రవర్తించినా తప్పుబడుతుంది సమాజం. ముఖ్యంగా స్త్రీలకు స్వేచ్ఛ ఉండకూడదని నాటి నియమం! శాండిలి ఉటంకించిన వాటిని ఆచరించినవారే పతివ్రతలు!!

* * *

# 25. పంచచూడ

ఒక అప్సరస. ఐదు జడలుండడం వలన పంచచూడ అనే పేరు వచ్చింది. శుకమహర్షి పరమపదాన్ని చేరుకొనే సందర్భంలో ఈమె ఆశ్చర్యపోతుంది. ఆ సమయంలో త్రిలోకసంచారి అయిన నారదమహర్షి ఆమెను చూచి అతి నిగూఢమైన స్త్రీస్వభావాన్ని తెలియగోరుతాడు. స్త్రీలకు సంబంధించిన దుర్గుణాలను స్త్రీనైన నేను ఎలా చెప్పను అని సందేహిస్తుంది ఆ అప్సరస. నిజం చెప్తే దోషం కలుగదు అంటాడు నారదుడు.

స్త్రీ స్వభావం మిక్కిలి చంచలమైంది. వివాహమైన తరువాత కూడా పరపురుషుడి వ్యామోహంలో పడిపోతుంటుంది. ధనం, మంచి భోజనం, ఖరీదైన దుస్తులు, మేలైన నగలు మున్నగువానికంటె పరపురుషునితో కలియడం స్త్రీకి ఎక్కువ ఇష్టం. ఇలా చెప్పడంలో సతుల మర్యాద బాధింపబడుతుంది. ఇక్కడ గమనించాల్సిన అంశం – పంచచూడ అప్సరసమునిపత్ని కాదు, రాచపుట్టువు కాదు. అప్సరసలకు మునులకుండే నియమనిష్ఠలుకాని మానవులకుండే కట్టుబాట్లు కాని ఉండవు, తెలియవు కూడా. అందువలన కేవలం తన ఎఱుకలోనున్న దేవతాస్త్రీలను గురించి అలా మాట్లాడింది అనుకోవాలి. దేవేంద్రుడి కొలువులోనున్న రంభ, మేనక, ఊర్వశి, తిలోత్తమ మున్నగువారు ఆయా సందర్భాలలో మునులతో, రాజులతో కలవడం జరిగింది. వారి స్వేచ్ఛాజీవనం వారిది. నైతికజీవనానికి వారికి సంబంధం లేదు అనుకోవాలి. ఏది ఏమైనా పంచచూడ, ఆజన్మబ్రహ్మచారి అయిన నారదుడికి మధ్య జరిగిన సంభాషణ స్త్రీలను కించపరిచేదిగా ఉంది.

బహుశా అప్సరోభామిని అయిన పంచచూడ తమవలెనే మానవ కాంతలు స్వైరవిహారం చేస్తుంటారని, ఇష్టమైనవారితో కొంతకాలం గడిపి తిరిగి తమ తమ నెలవులకు వెళ్ళిపోతారనీ, పుట్టిన బిడ్డలను గురించి కూడా వారి కంత అనుబంధం ఏర్పడదని అనుకొని ఉంటుంది. ఊర్వశిపురూరవులు, మేనకావిశ్వామిత్రుల వృత్తాంతాలు ఈ కోవకే చెందుతాయి. ఊర్వశి అర్జునుని వలచి అతడు తిరస్కరించినపుడు నపుంసకుడివి కమ్మని శాపమిచ్చింది. వారికి వయసుపైబడదు. వావివరుసలు వర్తించవు. కనుక పంచచూడ తమవారి తరపున ఆ అభిప్రాయాలను వెలిబుచ్చి ఉంటుంది.

* * *

# 26. రుచి

దేవశర్మ అనే ముని భార్య రుచి. రుచి అంటే లావణ్యం కలిగినది అని అర్థం. పేరుకు తగినట్లు ఆమె మిక్కిలి రూపవతి. ఆమె సౌందర్యం దేవగంధర్వాదులకు కూడా ఆకర్షణీయంగా ఉండేది.

ఆమెను వాంఛించిన ఇంద్రుడు ఎప్పుడూ ఆమె చుట్టూ తిరుగుతుంటాడు అదృశ్యరూపంలో. ఈ విషయం దేవశర్మకు తెలుసు. ఎంతో జాగరూకుడై ఆమెను కాపాడుకొంటూ ఉంటాడు.

ఒకసారి దేవశర్మ ఒక యజ్ఞం చేయించడానికి దూరప్రాంతం వెళ్ళవలసి వస్తుంది. తను లేనప్పుడు ఇంద్రుడు వస్తాడు అని ఆలోచించిన దేవశర్మ తన శిష్యుడైన విపులుడిని పిలిచి రుచికొరకు ఇంద్రుడు చాలా కాలం నుంచీ పొంచి చూస్తున్నాడు. నేను లేని సమయంలో తప్పకుండా వస్తాడు. కాబట్టి నేనులేని సమయంలో ఆమె రక్షణ బాధ్యతను నీవు వహించి జాగ్రత్తగా కనిపెట్టుకొని ఉండాలి అని ఆదేశించాడు. ఇంద్రుడే రూపంలో వస్తాడు అని విపులుడు అడిగితే అతడు మాయావి పక్షి, మృగరూపాలలో కూడా రావచ్చు అని దేవశర్మ చెప్పి యాగం చేయించడానికి వెళ్ళిపోతాడు.

విపులుడు ఆమెను కనిపెట్టుకొని ఉండడానికి ఒక ఉపాయం ఆలోచించి తను నేర్చిన యోగప్రావీణ్యంతో ఆమెను ఆవహించుకొని ఉంటాడు. ఇంద్రుడు రానే వస్తాడు. ఆమెతో సంభాషించి తన కోరికను తెలియజేస్తాడు. విపులుడు ఆమె శరీరాన్ని విడిచిపెట్టి తన శరీరంలోకి ప్రవేశించి ఇంద్రుడిని నానా విధాలుగా దూషించాడు. విపులుడి యోగబలం తెలిసిన ఇంద్రుడు గురుశాపాగ్నికి భయపడి వెళ్ళిపోయాడు.

ఒకసారి దివ్యమైన పరిమళం, నవ్యకాంతి కలిగిన పూలమాల ఒకటి భూమిమీద పడింది. ఆకాశమార్గాన పోయే ఒక దేవతాస్త్రీ చేతిలో నుండి అది జారిపడింది. దానిని రుచి తీసికొన్నది. ఆ సమయంలో మగరాజు తన దేవేరితో అచటికి అరుదెంచాడు. అతడే చిత్రరథుడు ఆతని భార్య, రుచి తోబుట్టువులు. తమ గృహంలో జరిగే ఉత్సవానికి రమ్మని దేవశర్మను, రుచిని ఆహ్వానించాడు చిత్రరథుడు. రుచి ఆ పూలమాలను అలంకరించుకొని వెళ్ళింది. దాని వాసనను చూచి ఆ సోదరి రుచిని అడిగింది పూలజాడ తెలుపుమని. దేవశర్మ అటువంటి పూలను తెమ్మని విపులుని ఆదేశించాడు. అతడు దేవశర్మ ఆశ్రమ సమీపంలో ఆ పూదండ దొరికిందని రుచిని అడిగి తెలుసుకుంటాడు. అతడు దేవశర్మ ఆశ్రమ సమీపంలో అట్టిదండను తీసుకొని వచ్చి గురువుకు ఇవ్వగా అతడు తన మరదలికి ఆ దండను ఇచ్చి సంతోషపెట్టాడు. రుచి శరీరంలోకి ప్రవేశించడం తప్పు. ఆ విషయం గురువుకు చెప్పకపోవడం విపులుడు చేసిన పెద్ద తప్పు.

* * *

# 27. లోపాముద్ర

విదర్భరాకుమారి లోపాముద్ర అగస్త్యుని తపశ్శక్తి చేత జన్మించింది. ఈమె అసమాన సౌందర్యవతి కావడం చేత అనేక రాజవంశీయులు ఆమెను చేపట్టడానికి ఉత్సుకులై ఉండేవారు. అగస్త్యుడు ఏమనునో అనే భయంచేత వారు మిన్నకుండా ఉన్నారు. అగస్త్యుడు తన పితరులకు ఊర్ధ్వగతిని కల్పించడం కోసం వివాహం చేసుకోవాలనుకున్నాడు. లోపాముద్రను తనకిచ్చి వివాహం చేయవలసింది అని విదర్భరాజును కోరాడు. ఆ వృద్ధతాపసికి తన కుమార్తెను ఇవ్వడం ఇష్టం లేదు. రాజన్యునికి ఇవ్వకపోతే శాపమిస్తాడు అని విచారిస్తుండగా లోపాముద్ర తనను అగస్త్యునికిచ్చి వివాహం చేయమని, బాధపడవద్దని తండ్రికి చెప్పి వివాహం చేసుకొన్నది. అగస్త్యుడు ఆమెను నారచీరలు ధరింపజేసి తనవెంట అడవులకు తీసుకొనిపోయినాడు.

లోపాముద్ర తనతండ్రి అగస్త్యుని శాపానికి గురికాకూడదని ఇటువంటి నిర్ణయం తీసుకొని ఉంటుంది. అగస్త్యుడు ఆమెను పొందగోరినప్పుడు నీవు నన్ను సర్వాలంకారభూషితను జేసి అనగా వస్త్ర, మాల్య, ఆభరణాలతో అలంకరించి నీవు కూడా నాకు ప్రియము కలిగేటట్లు ప్రసన్నుడవై రమ్మని కోరింది. అప్పుడే అగస్త్యుడు వాతాపి, ఇల్వలుడు చాలా ధనాన్ని పోగుచేసుకొని ఉన్నారని విని అక్కడకి వెళ్ళి వాతాపిని జీర్ణం చేసుకొని ఇల్వలుని దగ్గరనుండి విలువైన రత్నాభరణాలను, బంగారు రథాన్ని తీసుకొని వచ్చి లోపాముద్ర వలన సంతానాన్ని పొందుతాడు.

ఆనాటి క్షత్రియకన్యలు సౌందర్యవతులేగాక మిక్కిలి బుద్ధిజీవులనీ, సందర్భానుసారంగా పరిస్థితులను తమకు అనుకూలంగా మలచుకొనే

వారనీ, విధివిలాసానికి తల ఒగ్గుతూనే జీవితాన్ని సమర్థవంతంగా దిద్దుకొనేవారని అర్థమౌతుంది.

లోపాముద్ర తనను సర్వాలంకారభూషితగా చేయమని అడగడంలో ఒక రహస్యం ఇమిడి ఉంది. ఆమె పుట్టుక చేత రాకుమారి. భోగభాగ్యాలు ఆమెకు కొత్తకాదు. కాని అగస్త్యుడు ఋషి. కామశాస్త్రం తెలిసినవాడు కాడు. రాగద్వేషాలకు ఉపకరణం సంపద. అతనిలో సంసారజీవితానికి కావలసిన వస్తుసముదాయాన్ని సంపాదించమని చెప్పడమే ఆమె ఉద్దేశం. అగస్త్యుడు బుద్ధిజీవి, ఆమె కోరికలోని సామంజస్యం అర్థం చేసుకొని ధనార్జనకు బయలుదేరాడు. అందువలన ఒనగూడిన ప్రయోజనం వాతాపి జీర్ణం కావడం! ఇల్వలుడు హింసను వదిలిపెట్టడం బాటసారులను దోచుకోవడం అనేది ఆగిపోయింది. లోపాముద్రకోరిక ఇన్ని ప్రయోజనాలను సాధించింది. కనుకనే ఆమె ధీరోదాత్త అనిపించుకొన్నది.

* * *

## 28. జరత్కారు

జరత్కారు అని పేరు కలిగిన ఈమె నాగప్రముఖుడైన వాసుకి చెల్లెలు. ఈమె నాగలోకంలో పెరుగుచుండెడిది. ఈమె తల్లి కద్రువ. తండ్రి కశ్యపుడు.

జరత్కారుడు అనే మునీశ్వరుడు వేదాధ్యయనం, తపస్సు అనునవి మాత్రమే తనకు వలసిన విధులని భావించి వివాహమాడను అని దీక్షబూని బ్రహ్మచర్యవ్రతాన్ని స్వీకరించాడు. ఒకసారి అతనికి తలక్రిందులుగా వేలాడుతున్న మునులు కనిపించారు. వారిని కారణమడిగితే తమ వంశంలో పుట్టిన జరత్కారుడు పెండ్లిచేసుకోకపోవడం వలన అపుత్రకుడయ్యాడు. మాకు పిండప్రదానం చేసేవారులేక అధఃపతనానికి వెళ్లవలసివస్తున్నదని పలికారు. అప్పుడు ఆ ముని వివాహమాడ సంకల్పించి తన పేరేగల కన్య కోసం వెతికాడు. భూలోకంలో ఎవ్వరూ ఆ పేరుగలవారు కనబడలేదు.

జరత్కారుడు నాగలోకానికి వెళ్ళాడు. వాసుకి చెల్లెలు జరత్కారు సనామ్ని కావడం వలన ఆ ముని ఆమెను పెండ్లాడాడు. మొదటి సమాగంనాడే ఆమెతో ఒక మాట చెప్పాడు. నీవెప్పుడైనా నామనసుకు కష్టం కలిగేటట్లు ఏపనైనా చేస్తే ఆ క్షణమే నిన్ను వదలి వెళ్ళిపోతాను అన్నాడు ఆ ముని. తదాదిగా జరత్కారు మిక్కిలి భయభక్తులతో, శ్రద్ధాసక్తులతో అసిధారావ్రతంలా పతిని సేవిస్తూ ఉండేది. ఒకసారి జరత్కారుడు ఆమె తొడమీద తలపెట్టుకొని నిద్రించసాగాడు. సాయంకాలమైంది. సంధ్యావందనం చేయవలసిన సమయం ఆసన్నమైంది. అతనికి నిద్రాభంగం చేయడానికి సందేహిస్తూనే సంధ్యాకాలం చేయవలసిన విధులకు ఆటంకం ఏర్పడకూడదని ఆతనిని నిద్ర నుండి మేల్కొలిపింది. అతడు మేల్కాంచి నాకు నిద్రాభంగం

కలిగించావు కనుక నిన్ను విడిచి వెళ్ళిపోతున్నాను. ఈ విషయం నీకు తొలుతే చెప్పాను. నీవు నీ అన్న వాసుకి చెంతకు వెళ్ళు. నీకు పుట్టబోయే కొడుకు సూర్యునితో, అగ్నితో సమానమైన తేజస్సు కలవాడౌతాడు అని జరత్కారును వదిలివెళ్ళిపోతాడు. అప్పటికే ఆమె గర్భవతి. అన్న వాసుకి చెంతకు వెళ్ళి మహాతేజశ్శాలి అయిన ఆస్తీకుడికి జన్మనిచ్చింది.

జనమేజయుడు చేయతలపెట్టిన సర్పయాగాన్ని ఆపగలిగిన సమర్థుడు అయ్యాడు. పిన్నవయస్కుడైనా సకల విద్యాపారంగతు డయ్యాడు. జరత్కారు ఆదేశం మేరకే ఆస్తీకుడు సర్పయాగాన్ని విరమింప చేశాడు. ఇక్కడ ఆ తల్లి తప్పు ఏమీ లేకపోయినా ఒక మిషమీద ఆమెను వదిలి వెళ్ళిపోయాడు జరత్కారుడు. కేవలం తన తండ్రి తాతలను ఊర్ధ్వ లోకాలకు పోయేటట్లు చేయడం కోసమే జరత్కారును పెండ్లి చేసుకొన్నట్లు స్పష్టమౌతుంది.

* * *

## 29. ప్రభావతి

భరద్వాజుని పుత్రికయైన ప్రభావతి ఇంద్రుని భర్తగా కోరుకొని తపస్సు చేసింది బదరీ క్షేత్రంలో. ఇంద్రుడు ఆమె తపస్సుకు ప్రసన్నుడైనాడు. అయినా ఆమెను పరీక్షించాలని వసిష్ఠుని రూపంలో వచ్చాడు. దేవతలు కామరూపులు కదా! అతడు ఋషియే అనుకొని ప్రభావతి ఆ వచ్చినవాడు తనను ఎక్కడ కోరుకుంటాడో కాదంటే శాపమిస్తాడో ఏమో అని సంకోచిస్తూనే అతనికి అతిథిమర్యాదలు చేసి ముందుగానే తాను ఇంద్రుడిని భర్తగా కోరుకొని తపస్సు చేస్తున్నానని విన్నవించింది. మీ ఆదేశం ఏదైనా ఉంటే చెప్పండి, తప్పకుండా చేస్తాను అంటుంది. ఎంతటి ముందుచూపు ఆ ప్రభావతికి!

ఆ వచ్చిన వేషధారి ఆమెకు కొన్ని రేగుపండ్లు ఇచ్చి వాటిని వండి పెట్టమని అడిగినాడు. ఆమె పొయ్యి వెలిగించి ఆ బదరీఫలాలను ఉడకబెట్టడం ప్రారంభించింది. కాని అవి ఎంతకూ ఉడకడంలేదు. ఆమె దాచి ఉంచుకున్న కట్టెలన్నీ అయిపోయాయి. అడవిలోకి వెళ్ళి తెద్దామంటే సమయం మించిపోతుంది. పైగా పొయ్యిచల్లారిపోయి పాకం చెడుతుంది. అప్పుడామె తన కాళ్ళనే వంటకట్టియలుగా పొయ్యిలో పెట్టి వండసాగింది. ఆమె సాహసాన్ని పరీక్షించిన ఇంద్రుడు తన నిజ రూపంతో ప్రత్యక్షమై "శుభాంగి నీ నిష్ఠకు నేను మెచ్చాను. నీ అభిమతం తీర్చాను. నీవు ఈ శరీరాన్ని విడిచి స్వర్గానికి రాగలదానవు" అని పలికాడు. ఆమె స్వర్గానికి వెళ్ళి ఇంద్రుని సన్నిధిలో వెలిసింది. తపస్సు ద్వారా అనుకొన్నది సాధించింది!

స్త్రీలు సుకుమారదేహులు, పట్టుదల లేనివారు అనే దురభిప్రాయాన్ని ప్రభావతి ఉదంతం పటాపంచలు చేస్తుంది. ఈ కథ ద్వారా తెలియగల

విషయం ఏమిటంటే అప్పటి స్త్రీలు ముఖ్యంగా ఋషికన్యలు స్వతంత్ర ప్రతిపత్తి కలిగి ఉండేవారని, తమ ఇష్టానిష్టాలను ధైర్యంగా వెల్లడించే వారని. సాధ్యేతరం అనుకొన్న సందర్భాలలో తపస్సుకు పూనుకొనే వారని. ఈ సందర్భంలో ఇనుపగుగ్గిళ్ళను ఉడికించిన అనసూయ పాతివ్రత్యమహిమ, అంబ తపస్సు చేసే విషయం గుర్తు రాకమానవు. అదే విధంగా స్వతంత్రంగా దుష్యంతుడిని గాంధర్వవిధిన వివాహం చేసుకొన్న శకుంతల స్ఫురణకు వస్తుంది. అంతేకాదు తనకు పుట్టబోయే కొడుకు భావిచక్రవర్తి కావాలని నియమం కూడా విధించింది శకుంతల. ఋషిచేత పెంచబడినా క్షత్రియుడైన విశ్వామిత్రుని కొమరిత కనుక.

* * *

# 30. సుకన్య

భారతకథలలో దేనికదే ప్రత్యేకమైనప్పటికీ సుకన్యచరిత్ర మరీ విశిష్టమైంది. శర్యాతి అనే రాజు కూతురు సుకన్య. త్రిభువనాలలో చెప్పుకోదగిన మోహనాకార, విద్యుల్లతాంగి. ఆమెకు సిరిసంపదలకు, భోగభాగ్యాలకు కొరవలేదు. ఒకసారి ఆమె చెలికత్తెలతో వన విహారానికి వచ్చింది. అక్కడ ఒకచోట పుట్టలు పుట్టలు కనబడినాయి. వాటి మధ్యలో నుండి విద్యుత్కాంతులు వెదజల్లే రెండు రంధ్రాలు ఉండడం చూసి అవి ప్రకృతి సిద్ధమైనవి అనుకొని ఒక విధంగాచూస్తే బాల్యచాపల్యంతో ఆ వెలుగులు వస్తున్నచోట పుట్టను పొడిచింది సుకన్య.

ఆ పుట్టలు ఒట్టిపుట్టలు కావు. చ్యవనుడు అనే మహర్షి అనేక సంవత్సరాలుగా అక్కడ తపస్సుచేయడంతో చుట్టూ పుట్టలు పెరిగాయి. ఆ కాంతులు ఆ మహర్షి నేత్రాలనుంచి వెలువడినట్టివి. అది తెలియక సుకన్య వాటిని పొడిచింది. చ్యవనుడు గాయపడి కోపంతో శర్యాతి సేనలను మూత్రపురీషాలు రాకుండా శపించాడు. కారణం తెలియక శర్యాతి చింతాక్రాంతుడయ్యాడు. వ్యథలో మునిగిన తండ్రి వద్దకు వచ్చిన సుకన్య తాను తెలియకచేసిన తప్పిదాన్ని వెల్లడించింది. రాజు చ్యవనుని దగ్గరకు వెళ్ళి క్షమించమని ప్రార్థించాడు. సుకన్య చేసిన తప్పును క్షమించి శాపాన్ని ఉపహరించమని వేడుకొన్నాడు. సుకన్యను తనకు ఇచ్చినట్లైతే తాను శాపాన్ని ఉపసంహరిస్తానన్నాడు చ్యవనుడు. ఆమెను "అతిశయ రూపయౌవన గర్వితా" అని పేర్కొన్నాడు. విధిలేని పరిస్థితిలో ఆతని సేవకు సుకన్యను నియోగించాడు. ప్రజాహితాన్ని, తండ్రి మేలును కోరిన సుకన్య ఆ నిర్ణయాన్ని తలదాల్చింది.

ఆ వృద్ధతాపసికి విసుగులేకుండా పరమభక్తితో సేవలు చేస్తూ ఉండింది. ఆ రాచకన్య, సుకుమారి, ఒకనాడు అశ్వినీదేవతలు వచ్చి

ఇంత రూపవైభవం, యౌవనం కలిగిన నీవు ఈ ముదుసలిని ఎందుకు సేవిస్తావు. నీ యౌవనం వృథా అయింది. ఇతడు కామభోగబాహ్యుడు కనుక ఇప్పుడైనా నీ వయోరూపాలకు తగిన వరుని మేము వెదకి తెస్తాము. వానిని వరింపుమని పలికారు. వారి మాటలను నిరాదరించిన సుకన్య ఆ విషయాన్ని చ్యవనునికి నివేదించింది. అశ్వినీదేవతలు ఆశ్రమానికి వచ్చినప్పుడు వారిని తన ముదిమిని పోగొట్టమని చ్యవనుడు వేడినాడు. అశ్వినీదేవతలు చ్యవనుడిని తమతో తీసుకొని వెళ్ళి ఒక జలాశయంలో మునిగినారు. ముగ్గురు ఒకే రూపంలో వెలుపలికి వచ్చి మాలో నీకిష్టమైన వానిని ఎన్నుకో అని పలికారు. ఆమె అశ్వినీదేవతలను ప్రార్థించి. చ్యవనుని గుర్తించి అతనినే కోరింది. అశ్వినీదేవతల అనుగ్రహం వలన యౌవనాన్ని పొందిన చ్యవనుడు సుకన్యతో జీవిస్తూ ఉన్నప్పుడు సుకన్య తండ్రి శర్యాతి వారిని ఒక యాగానికి పిలుచుకొని వెళ్ళడానికి చ్యవనుని ఆశ్రమానికి వచ్చాడు. సుందరాకారుడితో తన కుమార్తె కలిసి ఉండగా చూచిన శర్యాతి ఆతడు చ్యవనుడే అని తెలిసి ఆనందించాడు. సుకన్యకు ప్రమతి అనే కొడుకు పుట్టాడు.

సుకన్య వృత్తాంతంలో కనిపించే విశేషం ఏమిటంటే భర్త నిర్ధనుడైనా, కురూపియైనా, వృద్ధుడైనా అతనిని భక్తిశ్రద్ధలతో పూజించినట్లైతే దేవతల అనుగ్రహం కలుగుతుంది. భర్తకూడా ఆమెను సమాదరిస్తాడు, గౌరవిస్తాడు అని. కాని ఆ కాలంలో కూడా ఈ నడవడికకు వ్యతిరేకంగా అతిచరించినవారూ ఉండేవారు. సుకన్య మహాపతివ్రత అని ఆ మార్గంలో నడచినవారూ ఉన్నారు.

వృద్ధులు యౌవనాన్ని తిరిగి పొందడం అసాధ్యం. కాని ఈ కథలో అదే విశేషం. సుకన్య అతడు వృద్ధుడిగా ఉన్నప్పుడు కూడా విసుగు చెందకుండా సపర్యలు చేసింది. సరిగా ఇందుకు వ్యతిరేకంగా

ప్రవర్తించింది ప్రద్వేషిణి అనే స్త్రీ. దీర్ఘతముడిని, భర్త గ్రుడ్డివాడని, కొడుకులకు చెప్పి నీళ్ళలో పారవేసేటట్లు చేసింది. లోపాముద్ర సుకన్య వలెనే భర్తను సేవించి కృతకృత్య అయింది. ద్రౌపది, దమయంతి భర్త చేసింది తప్పే అయినా విడిచిపెట్టలేదు సరికదా, వారిని క్షమించి పూర్వవైభవాన్ని వారు తిరిగి పొందడానికి తమవంతు సహకారాన్ని అందించారు. స్త్రీల మనోగతాలు నిగూఢమైనవి, అంతుచిక్కనివి అని భీష్ముడు, నారదుడు అంటారు. వారిరువురూ ఆజన్మబ్రహ్మచారులు.

సుకన్య మహాసాధ్వి అని ప్రత్యేకంగా చెప్పవలసి ఉంది. ఆ పతివ్రతా శిరోమణి కారణంగానే చ్యవనుడు తన యౌవనాన్ని తిరిగి పొందగలిగాడు అంటే అతిశయోక్తి ఎంత మాత్రం కాదు. ఇది ఆ కాలంలో విచిత్రమూ కాదు. యయాతి శుక్రాచార్యుడి శాపంతో వృద్ధుడు కావడం పూరుడి యౌవనాన్ని గ్రహించి యువకుడు కావడం జరిగింది. అర్జునుడు ఊర్వశి శాపం వలన బృహన్నలకావడం అజ్ఞాతవాసాంతంలో తిరిగి తన యథాస్థితిని పొందడం కూడా ఇలాంటిదే. శిఖండివృత్తాంతం కూడా ఇటువంటిదే!

* * *

## 31. తపతి

ఈమె సూర్యుని కుమార్తె. యక్ష, సిద్ధ, అమర కన్యలను మించిన కాంతితో అరణ్యంలో సంచరిస్తున్నప్పుడు ఒకసారి అజామీడుని కుమారుడైన సంవరుణుడు ఈమెను చూసి మోహపరవశుడౌతాడు. ఆమెను సమీపించి నీవెవ్వరి దానవు అని ప్రశ్నించాడు. ఆ ప్రశ్నకుబదులు చెప్పకుండా అతని దృష్టిపథంనుంచి ఆమె అదృశ్యమైంది. అతనిని చూచిన తపతి కూడా అనురాగబద్ధ అయింది. అందుచేతనే అతనితో సంభాషించింది. అతడు దేనికై విచారిస్తున్నాడు అని ప్రశ్నించినపుడు తన కోరికను తెలియజేసి తనను గాంధర్వవిధిలో వివాహమాడ వలసిందిగా అర్థించాడు. సంవరుణుడు కూడా సామాన్యుడు కాదు. భరతకులంలో పుట్టినవాడు, ధర్మవిదుడు, సర్వగుణసంపన్నుడు, స్ఫురద్రూపి. అయినా అతని మోహానికి పరవశురాలై తనను తాను అర్పించుకోలేదు.

తన ఆభిజాత్యానికి తగినట్లు 'నాయందు నీకు ప్రీతి కలదేని మదీయ జనకునడుగుము' అని చెప్తుంది. ఇంతులకు స్వాతంత్ర్యం లేమి నీవెఱుగవా అని కూడా ప్రశ్నిస్తుంది. 'అనవరత జపనియమ ప్రణిపాతంబుల నాదిత్యు నారాధింపుము' అని తండ్రిని ఆరాధించి పనిని సాధించుకోవచ్చునని సూచిస్తుంది. తరువాత వసిష్ఠుని పెద్దరికంతో తపతీసంవరుణుల వివాహం జరుగుతుంది. వసిష్ఠుడు సూర్యుని వద్దకు వెళ్ళి తపతిని సంవరుణునకిమ్మని అడిగినప్పుడు సూర్యుడు "కూతుల గన్న ఫలము తగిన వరులకు ఇచ్చుటకే" అంటాడు సాధారణ జనకునివలె. విశుద్ధచరిత అయిన తపతిని వసిష్ఠునితో సంవరుణుని దగ్గరకు పంపిస్తాడు సూర్యుడు.

ఎంత ప్రతిభావంతమైన జన్మ కలిగిన కన్య అయినా తండ్రి మాట జవదాటకూడదు అనే సందేశం ఈ కథ వలన అందుతుంది. మరొక మాటు శకుంతలవృత్తాంతం గుర్తుకు వస్తుంది. గాంధర్వవివాహం చేసుకొని పుత్రుడిని కని దుష్యంతుడి చేత నిండుసభలో నిరాదరింపబడి శకుంతల అశరీరవాణి పలకడం చేత గట్టెక్కింది. తపతి ఆ విధంగా తొందరపడక తండ్రి అనుమతిని కోరమని సంవరుణునితో చెప్పింది. పైగా వసిష్ఠుడంతటివాడు మధ్యవర్తిగా సూర్యుని వద్దకు వెళ్లాడు. ఇది అచ్చమైన, హర్షణీయమైన, ఆమోదయోగ్యమైన వివాహపద్ధతి కనుకనే వారి వివాహం పెద్దల సమ్మతితో మహావైభవంగా జరిగింది. సమవయస్కుల మధ్య పరస్పర అనురాగబద్ధులైన వారి వివాహం నేటికీ ఆదర్శప్రాయమైంది!

* * *

## 32. పుణ్య సతీ ప్రభావం

మార్కండేయుడు ధర్మరాజుకు చెప్పిన ఈ కథ లోకప్రసిద్ధము. దీనిలో కనిపించే సాధారణ గృహిణి పుణ్యశీల.

ధర్మతపశ్శీలుడైన కౌశికుడనే బ్రాహ్మణుడు ఒకసారి ఒకానొక గ్రామసమీపంలో చెట్టు క్రింద కూర్చుని వేదాధ్యయనం చేస్తూంటాడు. ఆసమయంలో చెట్టుమీద ఉన్న ఒక కొంగ రెట్టవేస్తుంది. అది ఆ మహాద్విజుని మీద పడుతుంది. అతడు కోపంగా ఆ కొంగవైపు చూడగానే అవి చచ్చి నేలమీద పడుతుంది. అతడు వికలహృదయుడై తనకు దయలేకపోయిందే అని బాధపడతాడు.

తరువాత మధ్యాహ్నం భిక్షకై ఊరిలోకి వెళ్ళి ఒక ఇంటి ముందు ఆగి 'భవతీ భిక్షాం దేహి' అని అడుగుతాడు. ఆ ఇంటి ఇల్లాలు పాత్రను కడుగుతుంటుంది. ఇంతలో ఆకలితో అలసిపోయిన భర్త ఇంటికి వస్తాడు. ఆమె అతనికి మజ్జనభోజనాదులు అమర్చి శయ్యవేసి తాంబూలం ఇచ్చి పాదములు ఒత్తి అప్పుడు భిక్షకై వచ్చిన ద్విజుడిని సమీపిస్తుంది.

ఆ ద్విజుడికి కోపం వస్తుంది. అడిగిన వెంటనే భిక్ష ఇవ్వవచ్చు కదా అంటాడు. అయ్యా! అప్పుడే నాభర్త వచ్చాడు. అతడు అమితమైన ఆకలితో ఉండడం వలన ఆ మహాత్ముడికి సపర్య చేసిరావడంలో ఆలస్యమైంది. దీన్ని తప్పు అనుకోవద్దు సహించండి అని వేడుకొంటుంది "నీమగడంత యెక్కుడె? మనీషులు భూసురులంత తక్కువే. అంతమదము, క్రొవ్వు ఎక్కువై లోకువచేసి చూస్తావా భూసురులను. వారు కోపిస్తే లోకాలు తలక్రిందులౌతాయి తెల్సా" అని మండిపడతాడు.

భూసురుల మాహాత్మ్యం నాకు తెలియనిదా అని మహామునుల చరితలను పేర్కొని "కొఱవి గొని వెట్టినే తల గోకికొనగ" అన్నది. అయినా నాకు "పతియచూవె నా పాలిట పరమదైవము" మనోవాక్కాయ

కర్మల అతని మంచి చెడులను చూడడమే నా ప్రథమకర్తవ్యం. నీవు ముక్కోపివని నాకు తెలుసు. నీ కోపం వలన ఒక కొంగ చచ్చింది. నా పాతివ్రత్యమహిమ వలన దానిని తెలుసుకున్నాను" అని చెప్తూ అనేక ధార్మికవిషయాలను ప్రస్తావించింది ఆ గృహిణి.

మనిషి అంతరంగంలో క్రోధం, మోహం అనే భయంకరమైన శత్రువులు ఎప్పుడూ ఉంటారు. ఆ రెంటినీ అణచిపెట్టి ఉంటేనే బ్రాహ్మణ్య గౌరవం దక్కుతుంది.

ఎప్పుడూ సత్యం పలికేవాడు, అహింసాపరుడుగ సంచరించేవాడు, గురుజనాలకు హితము చేసేవాడు, ఇంద్రియనిగ్రహం కలవాడు, అందరినీ తనలాగే తలచేవాడు, ధర్మం పట్ల అభిమానం కలవాడు, కామక్రోధాలు లేని సజ్జనుడు బ్రాహ్మణుడు అని పిలువబడతాడు కాని కేవలం పుట్టుకతో కాదు.

ధర్మం పలు విధాలుగా సూక్ష్మంగా కనబడుతుంది. నీవు అధ్యయన పరుడవే కాని ఆచరణలో ధర్మసూక్ష్మాలు తెలియనివాడవు. అందువలననే సతీధర్మాన్ని తెలుసుకోలేకపోయావు. నీవు వెంటనే మిథిలానగరానికి వెళ్ళు. అక్కడ జితేంద్రియుడు, సత్యవాది, మాతాపితృభక్తుడు అయిన కిరాతుడు ఉంటాడు. అతనిపేరు ధర్మవ్యాధుడు. నీకు అఖిలధర్మాలు తెలియజేసి, సంశయవిచ్ఛేదం చేస్తాడు. వనితలకు శాస్త్రపరిజ్ఞానం లేదు కనుక వారు ఎట్టి అపరాధం చేసినా మన్నించాలి. నా పట్ల ప్రసన్నుడివి కమ్ము అని పలికింది ఆ గృహిణి.

అప్పుడు కౌశికుడు 'అమ్మా నీ కారణంగా నామనస్సు ప్రశాంతతను పొందింది. నీవు పరమ పతివ్రతవని తెలిసింది. పోయి వస్తాను. నీకు సకల శుభాలు కలుగుగాక' అని దీవించి మిథిలకు వెళ్తాడు. ఆ పతివ్రత పరిజ్ఞానానికి ఆశ్చర్యపోతాడు. తాను తప్పు చేశాను అని గ్రహిస్తాడు

వేదాధ్యయనతత్పరుడైన కౌశికుడు. అక్కడ ధర్మవ్యాధుడు కూడా ఆ పతివ్రత పంపగా వచ్చావు నాదగ్గరకు అంటాడు. ఇదీ మరీ ఆశ్చర్యకరం. తాపసులకు ఉండే దివ్యదృష్టి వారి వారి విధ్యుక్తధర్మాలను నిర్వర్తించే సాధారణ గృహిణికి, కిరాతుడికి ఉండటం గమనార్హం.

పాపాలలో కెల్లా అధికమైనవి క్రోధం, లోభం. వాటిని జయించిన వాడే ధార్మికుడు. దానం, సత్యం, తపం, కామలోభవర్జితం, గురుజనశుశ్రూష, క్రోధరాహిత్యం, అహంకారలేమి, అసూయలేకపోవడం, శీలసంరక్షణ, భూతదయ, సజ్జనసాంగత్యం ఇవన్నీ శిష్టాచారాలు. ఈ విధంగా ఒక సాధారణగృహిణి, కటికవృత్తి జీవనంగా కలవాడు తమ తమ ధర్మాలను ఆచరించడం వలనే వేదాధ్యయనం చేసే కౌశికుడికి ధర్మసూక్ష్మాలను తెలియచేయగల బోధకులు అయ్యారు. ఆ గృహిణికి పేరు పెట్టకపోవడం ఇది సాధారణగృహిణీధర్మం అని సూచించడానికే కావచ్చు. దీనికి ధర్మవ్యాధోపాఖ్యానం అని పేరు.

* * *

# 33. ఊర్వశి

అర్జునుడు శంకరుని దయవలన పాశుపతాస్త్రాన్ని పొందిన తరువాత దేవేంద్రుడు కుబేర, వరుణ, ధర్మదేవతలతో కూడి ప్రత్యక్షమై అర్జునుని అమరావతికి రమ్మని ఆహ్వానించి దివ్యరథాన్ని మాతలితో పంపించాడు. అక్కడ అమరావతిలో ఏకాసనంమీద కూర్చుండబెట్టుకొని ఆదరించాడు ఇంద్రుడు పుత్రుడైన విజయుని. అటుపై ఒక దివ్యమణిమయమందిరంలో గంధర్వసంగీతగోష్ఠి ఏర్పరచినాడు. ఇంతలో సూర్యాస్తమయమైంది.

చంద్రోదయ సమయంలో అర్జునుడున్న మందిరానికి ఊర్వశి వచ్చింది. ఆమె చంద్రికాధవళ వస్త్రాన్ని ధరించి, మృగమదకస్తూరి కర్పూర మిశ్రితమైన సుగంధం పూనుకొని, వివిధ వర్ణాలతో కూడిన సుర పుష్పాలను ముడుచుకొని, మణిమయ సువర్ణ భూషణాలను అలంకరించుకొని మెరుపుతీగె వలె వచ్చి అర్జునుని ముందునిల్చింది. ఆమె నూపురధ్వని, ఇతర అలంకరణల ధ్వని శ్రవణపేయంగా వినిపించింది. వెంటనే అర్జునుడు లేచి ఆమెకు సాష్టాంగ నమస్కారం చేశాడు. "జనయిత్రీ నన్ను ఆశీర్వదించడానికి వచ్చావు. పుత్రస్నేహంతో శుభసమగ్రుని చేయడానికి, కృతార్థుడనైనాను" అని పలికాడు. నారదాదిమునులు చెప్తుండగా విన్నాను నీగుణముల గూర్చి. నీ సంగమాన్ని కోరివచ్చాను. నేత్ర మధుపములు అతని సౌందర్యమధువును గ్రోలుచుండగా ఇంకా ఇలా అన్నది ఆ సురభామ. నీకు నేను ఏనాటి తల్లిని? అమరలోకంలో వేశ్యలమైన మాకు ఈ నియమాలు వర్తించవు. ఇచట వావివరుసలు వెదికే పనిలేదు. ఇచట మణిమయవేదికల మీద మనోహర స్థలములందు, ఏకాంతప్రదేశాలలో నాతో కేళీసుఖం అనుభవించు. ఈ పలుకులు ఆలకించిన అర్జునుడు హరి హరీ అమ్మా! నీవు ధర్మవిరుద్ధాలైన ఈ మాటలు పలుకదగునా. సృష్టి చేయడానికి, రక్షించడానికి, లయించడానికి సమర్థులైన దేవతలకు ఏ నియమాలు పాటించకున్నా తప్పులేదు కాని నేను కర్మభూమిలో జన్మించి ఆ నియమరుద్ధుడనైనాను. మావంశకర్తయైన, పురూరవునకు నీవు భార్యవు అయినావు. ఇప్పుడు ఇంద్రుని ఆశ్రయంలో ఉన్నదానివి. కనుక నాకు

నీవు తల్లితో సమానం, పుత్రవాత్సల్యంతో నన్ను చూడు అని పార్థుడు ప్రార్థించాడు. మదనబాణపీడితయైన ఊర్వశి "ఏను కామించి వచ్చిన నా మనోరథంబు విఫలంబు జేసినవాడవు; నీవు మర్త్యలోకంబున మానవర్జితుండవై, మానినీమధ్యంబున నపుంసకుడవైయుండు" మని శాపంబిచ్చి నిజగృహానికి వెళ్ళిపోయింది.

ప్రభాతసమయంలో ఆ వృత్తాంతాన్ని విని దేవేంద్రుడు కుమారుని దగ్గరకు వచ్చి 'నీవంటి ధైర్యవంతుడిని ఏ యుగంలోను చూడము. నీవు ధర్మాచరణుడవు. నీ ఇంద్రియనిగ్రహం మునులకు సైతము కీర్తనీయం. ఊర్వశి ఇచ్చిన ఈ శాపం నీవు భూమి మీద అనుభవించితీరాలి. మీరు అజ్ఞాతవాసం చేయవలసివచ్చినపుడు ఈ శాపం నీకు వర్తిస్తుంది. అంతఃపురకాంతలమధ్య షండరూపంతో ఉంటూ రాజకన్యకలకు నృత్యం నేర్పుతూ గడిపి సంవత్సరాంతంలో శాపవిమోచనాన్ని పొందగలవు' అని అనుగ్రహించాడు.

ధర్మాచరణలో ఉన్న అర్జునుడికి ఊర్వశిశాపం ఒక విధంగా వరమే అయింది. ఆ విధంగా ఇది ధర్మప్రబోధమే! విశ్వామిత్రునివంటి వాడు మేనకసాంగత్యాన్ని పొంది తపోభంగం పొందాడు. పురూరవుడు ఊర్వశిని వలచి వలపించుకోవడం తెలిసిందే. రావణుడు రంభశాపానికి గురికావడం ఇటువంటిదే. అప్సరసలనైనా కాదనగల ఇంద్రియనిగ్రహం అర్జునుడికి శంకరానుగ్రహం వలన వచ్చిందనుకోవాలి. అర్జునుడు పూర్వం 'నరుడు' ఆదిమునీశ్వరుడు. శ్రీ కృష్ణుడు నారాయణుడు. వారి తపస్సును భంగం చేయడానికి అప్సరసలు వచ్చినపుడు వారికంటె సౌందర్యవతియైన ఊర్వశిని తన ఊరువు (తొడ) నుంచి ఉద్భవింపచేశాడు నారాయణుడు.

ఈ ఆఖ్యానం విన్న పుణ్యపురుషులు సకల దురిత విముక్తులౌతారని వైశంపాయనుడు జనమేజయునికి చెప్తాడు. ధర్మాన్ని ఆచరించేవారికి శాపం కూడా వరంగా పరిణమిస్తుంది అనేది ఈ కథాసారాంశం.

శాంతం, నిగ్రహం, ఏకాగ్రత అర్జునుడికి ఉన్నగొప్ప లక్షణాలు అని భారతంలో చెప్పబడింది.

# 34. పార్వతి

ఒకప్పుడు హిమవత్పర్వతం మీద శివుడు సురసిద్ధవిద్యాధరముని గణాలతో సేవింపబడుతున్నాడు. నారదుడు లోకసంచారం చేస్తూ అక్కడకి వచ్చాడు. ఇంతలో పార్వతీదేవి సపరివారంగా వచ్చి పరమేశ్వరుడి కన్నులను విలాసంగా మూసింది. దాంతో సూర్యచంద్రుల కాంతిలోపించి లోకంలో కారుచీకటి వ్యాపించింది. లోకాలు భయపడుతుండగా శివుడు మూడవ కంటిమంటతో వెలుగులు ప్రసాదించాడు. పార్వతి భీతిల్లి పరమేశ్వరుడి పాదాలకు ప్రణమిల్లింది. స్వామి కరుణతో చూడగానే మంటలు చల్లారి కొండ చల్లబడింది.

నొసటి కన్ను తెరవడానికి కారణం అడిగింది శైలతనయ. లోకాలన్నీ నాస్వరూపాలే. నా కన్నులు నీవు మూయగానే లోకాలలో చీకటి వ్యాపించింది. ప్రాణుల భయాన్ని పోగొట్టడానికి నేను ఫాలనేత్రం తెరిచాను. నీవు నీలకంఠుడివి ఎందుకయ్యావు అని పార్వతి అడిగింది. క్షీరసాగరమథనసమయంలో వెలువడిన కాలకూటాన్ని లోకసంరక్షణ కోసం కంఠంలో ధరించాను అన్నాడు శివుడు. ఈ విధంగా అనేక విషయాలను పార్వతి అడుగుతుంటే బదులిచ్చాడు పరమేశ్వరుడు. ఇది 'ఉమా మహేశ్వర సంవాదం' గా ప్రసిద్ధి కెక్కిన ఉదంతం. ఈ సందర్భంలో శివుడు తాను ధరించే పినాకాన్ని గురించి, నందిని వాహనం చేసుకొన్న కారణాన్ని గూర్చి వివరిస్తాడు. ఇంకా ఆశ్రమధర్మాలను వర్ణిస్తూ గృహస్థాశ్రమం మిగిలిన వాటికి ఆధారం అని చెప్పాడు శివుడు. దైనందిన జీవనవిధానంలో హింసను పరిహరించడం పూర్తిగా సాధ్యం కాదని దున్నేటప్పుడు నాగలికి తగిలి క్రిములు చనిపోతే అది హింసకాదని చెప్పాడు. పాపపుణ్యాలు, జననమరణాలు, స్వర్గనరకాలు, ధర్మాధర్మాలను గురించిన అనేక సందేహాలకు సమాధానంగా నిలుస్తుంది.

'ఉమామహేశ్వర సంవాదం'. గిరితనయ ప్రశ్నలకు సమాధానమిచ్చిన తర్వాత శివుడు పతివ్రతాధర్మాలను చెప్పమని అడుగుతాడు. పార్వతీపరమేశ్వరులకు తెలియని ధర్మాలు ఉంటాయా. వాటిని అడిగి తెలుసుకుంటున్న శ్రీకృష్ణునికి ఇవి తెలియవా అంటే ఇవన్నీ లోకహితం కోసం చెప్పబడుతున్నాయని గ్రహించాలి.

స్వయంగా పార్వతీదేవి చెప్పిన పతివ్రతాధర్మాలు:

"కన్యాదానం జరిగిన తర్వాత స్త్రీకి భర్త అధికారి. ఆమె భర్తను దైవంగా భావించాలి. అతడి అభిప్రాయాలకు అనుగుణంగా దైవపితృ కార్యాలు చేయాలి. అతడు అనుమతించని పనులు చేయకూడదు. స్త్రీ గృహనీతివిద్యకు ఆచార్య, గృహకార్యాలను ఇష్టంతో చేయాలి. ధనవంతుడు, దరిద్రుడు, రూపసి, కురూపి, తెలివిగలవాడు, అవివేకి, ఆరోగ్యవంతుడు, రోగిష్టి అని భావించకుండ పతిని ఆదరించాలి. అప్పుడే ఆమె పతివ్రత అనిపించుకొంటుంది. పశుపక్ష్యాదులకు భిక్షం గడపదగ్గర పెట్టాలి. భిక్షకులకు లేదు అనకుండ ఆదరంతో భిక్ష ఇవ్వాలి. దేవపితృకార్యాలు చేసేటప్పుడు వాటివలన తన భర్తకు మేలు జరగాలని కోరుకోవాలి. భర్తనే దైవంగా భావించి సేవించాలి. అప్పుడామెకు సర్వ శుభాలు, సద్గతులు కలుగుతాయి అని సాక్షాత్తు ఆ పరమేశ్వరితో చెప్పించారు మునులు. భర్త పెక్కుమంది స్త్రీలను పెండ్లి చేసుకునే కాలం అది కనుక సవతులతో కలసి మెలసి ఉండాలని, పతి ఆమెను కాంక్షించినా అసూయపడరాదని" కూడా చెప్పింది దాక్షాయణి.

ద్రౌపది సత్యభామతో, శాండిలి సుమనతో, సాధారణ గృహిణి కౌశికునితో ఇంచుమించు ఇవే ధర్మాలను చెప్పడం గమనార్హం.

పార్వతి శివుడిని అడిగిన ప్రశ్నలలో అతి ముఖ్యమైనవి కొన్ని : ఆయుస్సు పెరగడానికి కారకాలు క్షమ, సత్యం, కృప, శౌచం, గురుభక్తి,

అసత్యభాషణం, క్రౌర్యం, అశుభ్రత, గురువిరోధం ఆయుస్సును క్షీణింప జేస్తాయి. తపస్సు, బ్రహ్మచర్యం, హితకరమైన ఆహారాన్ని మితంగా తీసుకోవడం, జరావ్యాధులను పోగొట్టే ఔషధాలను సేవించడం వలన ఆయుస్సు పెరుగుతుంది. శక్తికిమించిన పనులు చేయడం, తినకూడని ఆహారపదార్థాలను అపరిమితంగా తినడం వలన ఆయుక్షీణం ఏర్పడుతుంది.

పాపాలు మూడు రకాలు : అన్యుల ధనాన్ని ఆశించడం, పాప కృత్యాలు చేయడం, ధర్మాన్ని వదిలివేయడం మానసములైన పాపాలు. అసత్యమాడటం, కఠినంగా మాట్లాడటం మొదలైనవి వాచికాలు. హత్యచేయడం ఇతరులను కొట్టడం, బంధించడం, మద్యపానం అనేవి కాయికాలు. మద్యపానం మహాపాపం. దాని వల్లనే అన్ని అనర్థాలు కలుగుతాయి.

పుణ్యాలు కూడా మూడు రకాలు : నరకభయంతో పాపకర్మలు చేయకుండడం 'ఔపమికం' అనబడుతుంది. 'నిరుపకరణం' అనేది రెండవ రకం. శుచిగా ఉండడం, నిజం మాట్లాడడం, అహింసను పాటించడం మొదలైనవి. వ్రతదీక్ష, ఉపవాసం, పుణ్యతీర్థయాత్రలు చేయడం, కామక్రోధవర్జితం 'సోపకరణం' అనబడుతుంది.

దానాలలో శ్రేష్ఠం అన్నపానాలను ఇవ్వడం అని శివుడు చెప్తాడు.

సామాన్యులకు సాధారణంగా వచ్చే అనేక సందేహాలకు ఉమామహేశ్వరసంవాదంలో సమాధానాలు దొరుకుతాయి. ఇది నిజానికి ప్రత్యేకంగా అధ్యయనం చేయవలసిన అంశం. శక్తిస్వరూపిణి, జగన్మాత అయిన పార్వతీదేవి కొన్ని విషయాలను అడిగినట్లు, మరికొన్నింటిని చెప్పినట్లు సాగుతుంది. ఈ సంవాదం పూర్తికావడంతోనే వారిరువురు అదృశ్యమౌతారు. మునీశ్వరులకు కూడా దృగ్గోచరం కారు.

## 35. సీత

సీత రాజర్షియైన జనకుని కుమార్తె. జనకుడు సంతానం కొఱకు యజ్ఞం చేయదలచి క్షేత్రమును దున్నించే సమయంలో నాగలికి ఒక పేటిక తగిలింది. దానిలో ప్రభవించి ఉన్న సీతను జనకుడు పెంచుకున్నాడు. అవనిలో దొరికిన ఆమె జనకుని కుమార్తె కావడం చేత జానకి, మిథిలానగరంలో ప్రభవించింది కనుక మైథిలి అని పిలువబడింది. రాముడు యాగసంరక్షణార్థం విశ్వామిత్రుని వెంట వచ్చి శివధనుర్భంగం చేసి సీతను వివాహమాడాడు. అయోధ్యలో కొంతకాలం గడిపిన తర్వాత కైకేయి కోరిక మేరకు అరణ్యవాసం చేయవలసి వచ్చింది. రాముని వెంట కానల కేగింది భూజాని.

అక్కడ మున్యాశ్రమాలను సందర్శించారు సీతారాములు. కొద్ది కాలం తర్వాత శూర్పణఖప్రవేశంతో సీతకు కష్టాలు ప్రారంభమయ్యాయి. ముక్కుచెవులు కోసిన తర్వాత శూర్పణఖ రావణుని చెంతకు వెళ్ళి సీతను చేబట్టని నీ దర్పం వ్యర్థం అని రెచ్చగొట్టింది. రావణుడు మారీచుని బంగరులేడిరూపంలో పంపి రామలక్ష్మణులు దానివెంట వెళ్ళిన సమయంలో సీతను ఎత్తుకునిపోయి లంకలో ఉంచాడు. సుగ్రీవుడితో స్నేహం చేసి హనుమంతుడి సహాయంతో సీతజాడ తెలిసికొని లంకలో ప్రవేశించి రావణసంహారం చేశాడు రాముడు. అగ్నిలో ప్రవేశించిన సీత మహాసాధ్వియని ప్రశంసించిన అగ్ని ఆమెను తీసుకొని వచ్చి రాముడికి అప్పగించాడు. రాముడు అయోధ్యకు రాజై పట్టాభిషేకం చేసుకొన్నాడు. తరువాతికథ భారతంలో చెప్పబడలేదు.

ద్రౌపదివలె కష్టపడిన రాజపుత్రిక, నావలె బాధలు పడినరాజు ఎవరైనా ఉన్నారా అని ప్రశ్నించిన ధర్మరాజుకు మార్కండేయుడు సీతారాముల వృత్తాంతం చెప్పాడు. రామాయణం అని మాత్రమేకాకుండా

సీతాయాశ్చరితం అని కూడా వాల్మీకి పేర్కొని ఉండడం ఎంతో ప్రశస్తం. సీత అవనిజ, భూదేవి పుత్రిక. ఎంతో సహనం కలిగినది. అయినా కష్టాలు తప్పలేదు. భారతేతిహాసంలో చాలా క్లుప్తంగా చెప్పబడింది రామకథ. ఇక్కడ కొన్ని పోలికలు చెప్పుకుందాం.

సీత పధ్నాలుగేళ్ళు వనవాసం చేసింది. ద్రౌపది పంద్రెండు ఏళ్లు అరణ్యవాసం, ఒక యేడు అజ్ఞాతవాసం చేసినా ఎప్పుడూ భర్తలకు దూరంగా లేదు. పరాయివాని ఇంట బంధింపబడలేదు. తన ప్రమేయం లేక రావణునిచే చెరబట్టపడి అతని రాజ్యంలో ఉండవలసి వచ్చింది సీతకు. ఆకారణంగా రాముడంతటివాడు అనుమానించాడు. ద్రౌపది యుద్ధానంతరం హస్తినాపురంలో వైభవంగా జీవించింది. సీత మళ్ళీ అడవులపాలైంది. రాఘవుడు వస్తాడు, తీసుకొని వెళ్తాడు అనే ఆశకూడా లేకుండా బ్రతికింది. అవమానాల విషయానికి వస్తే ద్రౌపది కురుసభలో వస్త్రాపహరణానికి గురైంది. శ్రీకృష్ణుని దయవలన గట్టెక్కింది. సైంధవుని చేత, అటుపై కీచకుని చేత పట్టుబడింది. సమయానికి వచ్చిన భీముని చేత రక్షింపబడింది. ఆ బెడద సీతకు లేదు. రావణుడు నలకూబర శాపగ్రస్తుడు కావడం చేత సీతను అపహరించాడే కాని చెరబట్టలేదు.

ఏకపత్నీవ్రతుడైన రాముని భార్యగా సీత పూజనీయ అయింది. ద్రౌపది పంచభర్తృక కావడం ఆమె కోరుకున్నది కాదు. అయినా అత్తమాట, వేదవ్యాసుని మాట కాదనలేక ఐదుగురిని పెండ్లాడింది. అవహేళనకు గురైంది. సీత, ద్రౌపది ఇద్దరూ మహారాజుల కుమార్తెలు. అయినా అరణ్యవాసం చేశారు. లోకోత్తరవీరులైన శ్రీరాముడుగాని, పాండవులు కాని దానిని తప్పించలేకపోయారు. విధి ఎంత ప్రబలమైందో వీరి వృత్తాంతాల వలన మనకు తెలుస్తుంది.

రావణుడు అశోకవనంలోకి వచ్చి సీతను ఒప్పించడానికి ప్రయత్నించినపుడు ఆమె ఒక గడ్డిపరకను విసరి తన అభిప్రాయాన్ని

తెలియజేస్తుంది. సీత ద్రౌపదివలె తీక్షణ స్వభావం కలది కాదు అనిపిస్తుంది కాని ఆమె దృఢసంకల్పం రెండుమూడు చోట్ల మనకు అర్థమౌతుంది. వద్దని వారించినా రామునివెంట అడవులకు వెళ్తుంది. నీవు లోకోత్తర వీరుడివని కదా జనకుడు నన్నిచ్చి వివాహం చేసింది అని ప్రశ్నిస్తుంది. రెండవసారి జనస్థానంలో రాక్షసులను సంహరిస్తాను అని అక్కడి మునులకు మాట ఇచ్చినపుడు వారు నీకేం అపకారం చేశారు అని అడుగుతుంది. అకారణంగా రాక్షసులతో వైరం పూనడం తప్పని సీత అభిప్రాయం. పర్యవసానాన్ని అనుభవించింది ఆమె కదా. హనుమంతుడు 'అమ్మా నిన్ను నా భుజాల మీద తీసుకొని వెళ్తాను అన్నప్పుడు రావణుని నన్ను దొంగలాగా తీసుకొని వచ్చాడు. రాముడు వానిని చంపి నన్ను వీరోచితంగా తీసుకొనిపోవాలి అంటుంది అంత బాధను అనుభవిస్తూ కూడా. తెలిసి తెలిసీ పరపురుషుని తాకను అని కూడా అంటుంది. ఈ రామకథను భారతంలో చాలా సంక్షేపించి చెప్పడం జరిగింది. అయినా సీతచరితం లోకప్రసిద్ధం. తెలుగులో ఒక చాటువుపుట్టింది.

------------------

**పంకజముఖి సీతవంటి భామామణియున్**
**శంకరుని వంటి దైవము**
**లంకాధిపువైరివంటి రాజున్‌గలడే** – అని.

కష్టాలు అనగానే గుర్తువచ్చేది సీతమ్మనే. 'ఛాయేవానుగతా సదా' అని 'ఇయం సీతా సహధర్మచారిణీ' అనీ జనకుడు సీతను రాముని చేతిలోపెట్టి నట్లు రామాయణంలో చెప్పబడింది కనుక రాముని వెంటే నడిచింది సీత. మహేతిహాసంలో ఏ గొప్పకథైనా ఇమిడిపోవాల్సి వస్తుంది – అలాగే సీత కథ. పరమపావని, జనకాత్మజ సీతచరితం మహోదాత్తం!

* * *

## 36. గౌతమి

గౌతమి అను పేరుగల ఒక బ్రాహ్మణస్త్రీ ఉండేది. ఆమె కోపతాపాలను అదుపులో పెట్టుకొన్న మహాత్మురాలు. ఆమె కుమారుడిని ఒక పాముకరిచింది. ఆ బాలుడు మరణించాడు. ఆ తల్లి మిక్కిలి దుఃఖంతో ఏడుస్తుంది. అది చూచిన ఒక కిరాతుడు ఆ పామును తాడుతో బంధించి తెచ్చి అమ్మా! ఇది చాలా దుష్టసర్పం. దీన్ని కర్రతో కొట్టి చంపనా లేక కత్తితో నరికి వేయనా అని అడుగుతాడు. 'అన్నా! ఆ పామును వదిలి పెట్టు చంపవద్దు అంటుంది ఆ తల్లి. ఈ పసివాడిని చంపిన పామును చంపకుండా వదలను అంటాడు ఆ కిరాతకుడు. ఆమె అతడిని జాలిగా చూసింది. ''ఆపదలు మన పూర్వజన్మ కర్మానుసారంగా వస్తాయి. తెలివిలేనివారు తల్లడిల్లి సంసారసాగరంలో పడిపోతారు. వివేకచిత్తులు ధర్మం తెలిసినవారు కనుక శాంతస్వభావం కలవారై సంసారసాగరంలో మునిగిపోకుండా దాటిపోతున్నారు. అంతే కాదు ఈ పామును నీవు చంపితే చనిపోయిన నా పుత్రుడు బ్రతుకుతాడా!" అన్నది. నీవు చెప్పిన మాటలు రోషదీప్తుడైన ఆ కిరాతుడు ఈ పేదమాటలు నాకు నచ్చవు. కోపవివశుడనైన నాకు నీ మాటలు తెలివితక్కువగా అనిపిస్తున్నాయి. ఈ పామును చంపితీరుతాను అంటాడు.

ఆమె హింసకు నేనంగీకరించను అంటుంది. జనులను బాధించే క్రూరజంతువులను చంపడం పాపం కాదు అంటాడు. శత్రువునైనా మన చేతికి చిక్కినపుడు చంపరాదు అంటుంది ఆ తల్లి. ఇంద్రుడు వృత్రాసురుడిని చంపలేదా! శివుడు దక్షయజ్ఞాన్ని భగ్నం చేయలేదా. అవన్నీ పాపాలు కావు కదా. నీవు దీన్ని చంపడానికి అనుమతివ్వు అని అంటాడు ఆ బోయవాడు. ఇదంతా వింటున్న పాము నాదేమి తప్పున్నది ఇందులో మృత్యుదేవతప్రేరణతో ఈ పని చేశాను కాని నాకు కోపం,

రోషంలేవు అనగానే మృత్యువుకు నీవు ఉపకరణం అయ్యావు కనుక నిన్ను చంపడం ధర్మమే అంటాడు. చంపేశక్తి నాకెక్కడిది అతిమాత్రమైన ఆ శక్తి మృత్యుదేవతదే కాని అంటుంది ఆ ఉరగము. యాగాదుల ఫలం యజమానికే దక్కుతుంది కాని చేయించిన ఋత్విజులకు కాదు గదా. నా చేత ఈ పని చేయించిన మృత్యువుదే ఈ కర్మఫలం అంటుండగానే మృత్యువు అచటికేతెంచి నిన్ను నేను పంపించినట్లే నన్ను యముడు పంపించాడు కనుక నీవు (పాము) నేను (మృత్యువు) ఈ బాలుని చావుకు కారణం కాము. కాలస్వరూపుడి చేతిలో సూర్యచంద్రులు, అగ్ని, ఆకాశం, నేల, నీరు, గాలి, జీవాత్మ నడిచేవే. మనమా ఈశ్వరాజ్ఞకు లోబడినవారమే అని మృత్యువు అనగానే పాము బోయవానితో విన్నావా మృత్యుదేవత మాటలు. ఇందులో నా తప్పేమీ లేదు అంటుంది. అంతలో యముడు వారి ధర్మసందేహాన్ని తీర్చడానికి దయతో అక్కడికి వచ్చి బోయవాడితో ఇలా చెప్పాడు. పాము, మృత్యువు, నేను ఈ బాలుని మృతికి కారకులం కాము. ఇతని కర్మే పూనుకొని ఆ చావును తెచ్చిపెట్టింది. ఇంకా వివరంగా చెప్తాను విను. జీవుడు తాను చేసిన కర్మవలననే పుట్టుక, చావూ పొందుతున్నాడు. అదే సుఖదుఃఖాలకు కారణమౌతున్నది. తను చేసిన కర్మను తప్పుకొనిపోవటం శివుడికి కూడా సాధ్యం కాదు. మీరు వాదోపవాదాలు మానుడి అని అనగానే తాను చెప్పినదే యముడు చెప్తున్నందుకు ఆ స్త్రీ బోయవానితో విన్నావు కదా ధర్మదేవత మాటలు. ఇట్లాంటి దుఃఖం మన పాపంవలననే వస్తుంది. పసివారు చనిపోవడానికి వారివారి కర్మఫలితం తప్ప అన్యం కాదు నీవు దయతో ఈ భుజంగాన్ని వదిలిపెట్టు అంటుంది.

బోయవానికి ధర్మసూక్ష్మం తెలిసింది. కనువిప్పు కావడంతో ఆ పామును వదిలిపెట్టాడు. ఆ స్త్రీ ఆలోచనాపరిధి ఎంతో విస్తృతమైంది. బుద్ధిః కర్మానుసారిణీ అని కూడా అంటారు. జన్మ జన్మాంతరాలలో

చేసిన పాపపుణ్యాలను ఎవరైనా అనుభవించి తీరుతారు అనే రహస్యం ఈ గాథలో తేటతెల్లం అవుతుంది. నాకే ఎందుకిలా జరిగింది అని సామాన్యస్థితిలో అనుకుంటాడు మనిషి. ఇది నీవు చేసిన కర్మఫలమే అని చెప్తాడు పరమేశ్వరుడు. గౌతమి అనే స్త్రీకి ఆ జ్ఞానం కూడా ఆమె పూర్వపుణ్యవిశేషం వలననే కలిగింది అనుకోవాలి. పసివాడు మరణిస్తే అంత సంయమనం ప్రదర్శించడం సామాన్యులకు సాధ్యంకాదు. ఆ తల్లి అంత క్షమ కలిగి ఉంది అంటే అది పూర్వజన్మసుకృతమే.

పూని వచ్చే మేలుకీళ్ళకు విధిని నిందించడం పరిపాటి. కాని అది స్వయంకృతం అని తెలుసుకుంటే మంచిదే! “పూర్వజన్మకృతం పాపం వ్యాధిరూపేణ బాధతే” అని కూడా అంటారందుకే. “గౌతమీ లుబ్ధక సర్ప మృత్యు కాలసంవాదం” అనేది ఈ కథ.

* * *

## 37. మాధవి

ప్రతిష్ఠాన పురాధీశ్వరుడైన యయాతి కుమార్తె ఈమె. సంతానవతి యైనను ఈమె కన్యాత్వం దూషితం కాదని ఒక ఋషి వరమిచ్చాడు.

గాలవుడనే మునిపుత్రుడు విశ్వామిత్రుని వద్ద విద్య నభ్యసించి గురుదక్షిణగా ఏదైనా కోరుకొమ్మని పట్టుపట్టాడు. విశ్వామిత్రుడు ఒక చెవిమాత్రం నల్లగా ఉండి శరీరమంతా ధవళవర్ణంగల ఉండే ఎనిమిది వందల గుర్రాలను తెమ్మని చెప్పాడు. అటువంటివి ఎక్కడ దొరుకుతాయి అని మిత్రుడైన గరుడుడిని అడిగాడు గాలవుడు. గరుడుడు యయాతి దగ్గరకు గాలవుని తీసుకొని వెళ్ళాడు. రాజు అటువంటి గుర్రాలు తన వద్దలేవు గాని మాధవి (కూతురు) నిచ్చి ఏ రాజుకైనను ఆమెను ఇచ్చి గుఱ్ఱములను తీసుకొమ్మని చెప్పాడు.

గాలవుడు మాధవిని తీసుకొని ఇక్ష్వాకురాజువద్దకు వెళ్ళాడు. అతడామెను స్వీకరించి రెండు వందల గుఱ్ఱములను ఇచ్చాడు. పుత్రోదయం అయిన పిదప ఆమెను మరల గాలవునికిచ్చివేసాడు. గాలవుడు మాధవిని దివోదాసునకిచ్చిరెండు వందల గుఱ్ఱములను పుచ్చుకొన్నాడు. అటుపై మాధవిని మరల తీసుకొని ఔశీనరునకిచ్చి రెండు వందల గుఱ్ఱములను గైకొనెను. ఇక గుఱ్ఱములెక్కడను లేకపోవడం చేత ఆ ఆరువందల గుఱ్ఱములను, మాధవిని స్వీకరించమని విశ్వామిత్రుని ప్రార్థించాడు గాలవుడు. అందుకు అంగీకరించాడు విశ్వామిత్రుడు. ఇది ఆనాటి ఒక రాకుమార్తె వృత్తాంతం.

మాధవికి ఇక్ష్వాకుని వలన వసుమనస్సుడు, దివోవాసువలన ప్రవర్ధనుడు, ఔశీనరుని వలన శిబి, విశ్వామిత్రుని వలన అష్టకుడు అనే పుత్రులు కలిగారు. అస్వతంత్ర అయిన స్త్రీ జీవితానికి ప్రతీక ఈమె.

విశ్వామిత్రుడు వద్దన్నా గురుదక్షిణ ఇస్తానని గాలవుడు పట్టుబట్టడం వలన ఇదంతా జరిగింది అనుకోవడానికి అవకాశం ఉంది. కాని యయాతి అనే ఆ రాజు కుమార్తెను ఇచ్చి ఆమెను ఏ రాజుకైనా ఇచ్చి గుఱ్ఱములు బడయమని చెప్పడం మరీ విడ్డూరం. గురుదక్షిణ ఎలాగైనా ఇవ్వాలనే పంతంతో ఆమెను ఆ యా రాజులవద్దకు గాలవుడు కొంపోవడం, వారు సంతానం కోసం మాధవిని తీసుకొని గుఱ్ఱముల నిచ్చి ఆమెను తిరిగి గాలవునకు ఇవ్వడం పరిహాసాస్పదం. కాని అది అలా జరిగింది. ఈ కథను గాలవ్యోపాఖ్యానం పేరుతో భారతంలో రచించారు. ఏది ఏమైనా ఆనాటి సాంఘిక స్థితి అది. దానికి మాధవి అడ్డుచెప్పకపోవడం ఆశ్చర్యకరం. తండ్రిమాటకు ఎదురుచెప్పడం అనేది ఆనాడు ఉండేది కాదు అనడానికి మాధవికథ నిదర్శనం.

* * *

# 38. సత్యభామ

సత్యభామ శ్రీకృష్ణుని అష్టమహిషులలో ప్రఖ్యాతి చెందిన మహిళ. సత్రాజిత్తు కూతురు. రూపలావణ్యాతిశయాలు కలిగిన స్త్రీ. అరణ్యవాసం చేస్తున్న పాండవులను చూడడానికి సత్యాకృష్ణులు వస్తారు. ఆ సమయంలో మార్కండేయుడు ధర్మరాజాదులకు పూర్వం జరిగిన ఇతివృత్తాలను వినిపిస్తూ ఉంటాడు. వేరొక చోట సత్యాద్రౌపదులు సల్లాపాలు చేస్తూ ఉంటారు.

సత్యభామ ద్రౌపదితో “నీ భర్తలు నీ యందు అత్యంత అనురాగ బద్ధులు, ఏవురు భర్తలు నీ దెస నగుమోములతో ఏ మాత్రం కినుక లేక యుండడం అద్భుతం. ఇది ఏ వ్రతం వలన సాధ్యం అయింది, లేక మంత్రప్రభావమా, ఔషధమహిమా, నీ సరససంభాషణా చాతుర్యమా నీ ఈ భర్తృఅనురాగవైభవానికి కారణమేమి అని అడుగుతుంది. శ్రీకృష్ణసతి అలా అడగడం సబబుగా లేదేమో అనిపించవచ్చు. సామాన్య స్త్రీ వలె సత్యభామ ఈ విధంగా అడగడంలో ఒక హేతువు దాగి ఉంది. లోకంలో కొంతమంది ముఖ్యంగా భర్తలు పరస్త్రీవ్యామోహంలో పడి తమను నిరాదరిస్తున్నారని తలచినపుడు అతడిని తనకు అనుకూలంగా మలచుకోవడం కోసం మంత్రాలు, మందులు, మాకులు ప్రయోగించడం ఉండేది అప్పుడు. దీన్ని పరాస్తం చేయడం కోసమే సత్యా-ద్రౌపది సంవాదం ప్రవేశపెట్టబడింది భారతంలో.

ద్రౌపది సత్య అడిగిన ప్రశ్నకు కొంచెం నవ్వి ఆమె శ్రీకృష్ణుని సతి కనుక గౌరవంగానే సమాధానమిచ్చింది. నన్ను దుష్టవనితగా తలిచావా, అయినా పురుషోత్తముని భార్యవు నీవిట్లు అడగడం తప్పుకాదా అంటూ తనకు తెలిసిన ధర్మాచరణను తెలిపింది ద్రౌపది. మంత్ర, తంత్ర, ఔషధాలను ప్రయోగిస్తే మొదలు ఉన్న ప్రేమ కూడా పోతుంది. వాటివలన

లేనిపోని రోగాలు వస్తాయి. అవి వికటిస్తే లోకానికంతా తెలిసి అపవాదు, దుర్గతి కూడా వస్తాయి అంటుంది. కాబట్టి కపటచేష్టలు పతుల యెడల చేయతగదు, మగని మనోగతాన్ని ఎఱిగి తదనుకూలంగా చరించాలి. నేను పతుల పట్ల అలగను, అహంకరించను. వారి అభీష్టాన్ని గుర్తించి తదనుగుణంగా నడచుకొంటాను. అన్యపురుషుడు, అమరుడు, యక్షుడు గంధర్వుడు అయినా గడ్డిపోచలాగా తీసివేస్తాను. స్నానం, భోజనం, శయనం భర్తకంటె ముందు చేయను. భర్తరాగానే ఆసన పాద్యవిధులను ఏమరక చేస్తాను. ఆ పనులకు ఇతరులను పంపను. ఆ యా వేళల్లో స్నానభోజనాదులను సమకూర్చుతాను. ధనధాన్యాలను వృథా చేయను. బంధువులను వసతి భోజనాదుల నేర్పరచి ప్రీతులను చేస్తాను. తలవాకిట మెలగడం, కలహాలకు దిగడం, పెద్దగా నవ్వడం, హీనచారిత్రులతో మెలగడం వంటి కూడని పనులు చేయను. పతులు ప్రవాసగతులైనప్పుడు పువ్వులు ముడవను, రత్నాభరణాలను ధరించను, మేలిమివస్త్రాలను దరికిరానివ్వను. పతిరాకకోసం వేచి ఉంటాను.

అత్తకు భక్తితో సేవ చేస్తూ ఆమె చెప్పినట్లు గృహకార్యాలను నిర్వహిస్తుంటాను. గురు విప్ర అతిథిజనులకు అత్యుత్తమభక్తితో పూజలుచేసి ఎప్పుడూ ఓరిమి, మృదుత్వం, గౌరవం కలిగి స్వయంగా నేనే వారిని కొలుస్తాను. ఒక్కొక్కప్పుడు భర్తలు కోపించినా బదులు పలుకక వారిని శాంతింపచేస్తాను. “మా అత్త పృథ్వీ సమాన, పృథాదేవి కుంతిభోజాత్మజ, కోమలాంగి” – ఆమె భోజన స్నానాదికాలకు సంబంధించిన పనులన్నీ నేనే స్వయంగా నిర్వహిస్తాను. ధర్మరాజు సహపంక్తిలో భోజనం చేసే బ్రాహ్మణులు, యతులు పెక్కురున్నారు. వారందరికీ అన్నపానాదులు అర్హులైనవారి సహకారంతో నేనే సమకూరుస్తాను. పరిచారికలకు, భృత్యులకు, అభ్యాగతులకు ఏకొరత లేకుండా చూస్తాను. వారి వారి పనులలో అర్హతనుబట్టి నేనే

నియమిస్తుంటాను. గోవులకు, భద్రగజములకు, అశ్వరాజములకు సంరక్షకులను నియమిస్తాను. వారి జీవికలకు కావలసిన జీత భత్యములను, వస్త్ర, నివాసాలను ఏర్పరచి వారి మంచిచెడులను అరసి చూస్తుంటాను. "నిజ కుటుంబ భారాన్ని" నేనే వహించి పాండునందనులు నిశ్చింతగా ఉండేటట్లు కార్యనిర్వహణ గావిస్తాను.

ఈ పనులన్నీ చేయడంలో నిద్రాహారాలకు కూడా తడవు ఉండదు. అయినా నేనీ కార్యాలనన్నిటినీ ఇష్టంగా చేస్తాను. ఇంతేకాని "నీవు చెప్పే మందులు మాకులు ఇంద్రజాలములు" నేనెఱుగను అంటూ భర్తే సతికి పరమదైవమనీ అతడి మనసు కెక్కినట్లే నడచుకోవాలనీ అప్పుడు సతికి భూషణాంబరాలు, విశ్రుతసంతతి, కీర్తి కలుగుతాయి అంటుంది. ఎంతో కష్టపడితే గాని సుఖం దొరకదు. భర్తశుశ్రూషఫలం గొప్పది కనుక అతనికి ప్రియం చేయి. నీ భర్త రాగానే వెంటనే ఎదురేగి ఆయా పనులకు పరిచారికలను నియోగించక నీవే చెయ్యి. అతడు అభ్యంతర మందిరంలో నీతో చెప్పిన రహస్యాలను ఇతరులకు ఎప్పుడూ చెప్పకు, వారు నీకు ఎంత ఇష్టులైనాసరే. పుత్రులతోనైనా ఏకాసనంలో కూర్చోవద్దు. కులవతులు, గుణవతులు అయినా వారితో చెలిమిచేయి. కుటిల మతులకు దూరంగా ఉండు అని ద్రౌపది పతివ్రతాధర్మాలను సత్యభామకు సవివరంగా తెలియజేసింది.

సత్యభామ ద్రౌపదితో నీవు ధర్మం తెలిసినదానివి. నీ భర్తలు కీర్తిపరాక్రమాలు కలిగినవారు, ధైర్యబల శౌర్యములు గలవారు. త్వరలో మీ రాజ్యం మీకు లభిస్తుంది అని సమాశ్వాసించి వీడ్కోలుపలికి కృష్ణునితో కూడి ద్వారకకు వెళ్తుంది. నీ పుత్రులు ఐదుగురు యదుపురంలో రుక్మిణి, సుభద్రల సంరక్షణలో పెరుగుతున్నారు. వారిని గురించిన చింత వలదు అనికూడా చెప్తుంది. ఇది సత్యభామ అడిగిందనే మిషతో ద్రౌపది చెప్పిన పతివ్రతామతల్లుల ప్రవర్తన తీరు.

# 39. జనక పత్ని

జనకుడనే రాజు జీవన్ముక్తుడు. ఈ చక్రవర్తి ఒకసారి రాజ్యరమను పరిత్యజించి భిక్షావృత్తిని స్వీకరించి వెళ్ళదలిచాడు. అప్పుడా రాజుభార్య అతనికి కొన్ని ధర్మసూక్ష్మాలను తెలియజేసింది. అతి విశద మానస అయిన ఆమె విరక్తచిత్తుడైన జనకుని పురస్కరించుకొని చెప్పిన విషయాలు ఆమె శాస్త్రజ్ఞానాన్ని, సమయస్ఫూర్తిని, సుదృఢసంకల్పాన్ని పట్టి ఇస్తాయి. నిష్క్రియత ధర్మం కాదు. ధర్మవిరోధం చేసినట్లైతే మోక్షం లభించదు. రాజుబాధ్యత రాజ్యాన్ని ధర్మబద్ధంగా పాలించడం, ప్రజల క్షేమాన్ని ఆశించి అవసరమైన చర్యలు చేపట్టడమే గాని ఉంఛవృత్తిని ఎన్నుకోవడం కాదు. గృహస్థు నిత్య నైమిత్తిక చర్యలు ఆచరించడం వదలిపెడితే పితృకార్యాలు ఎవరు చేస్తారు. కాషాయంబరులు ధరించి శిరోముండనం చేయించుకున్నంతమాత్రాన ఆకలి బాధించకుండా ఉంటుందా. అప్పుడు భిక్షకోసం ఒకరింటికి వెళ్తే యాచకుని కన్న దాతది పైచేయి అవుతుంది కదా. అది నీకు కోరదగినదా.

రాజు అన్నవాడు ప్రజలను కన్నబిడ్డలవలె కాపాడుకుంటూ వారి క్షేమమే ధ్యేయంగా బ్రతకాలి. చలువపందిరి వేసినట్లుగా తానుండి వారికి రక్షణను, చల్లదనాన్ని ఇవ్వాలి. శత్రురాజుల భయం లేకుండా దైనందిన జీవితంలో భద్రతను ఇవ్వాలి. ధార్మికజీవనం అలవరచి ఆర్థికబాధలు లేకుండా చేయాలి.

ఈ విధంగా అనేక రాజధర్మాలను పేర్కొంటూ ఆ రాజు మనసును భిక్షాటన నుంచి రాజ్యపాలన వైపు మరల్చుతుంది ఆ జనకపత్ని. అకర్మణ్యత్వం మహాపాపం అని చెప్తారు పెద్దలు. గృహస్థాశ్రమం మిగతా ఆశ్రమాలకు ఆశ్రయం ఇస్తుంది. స్వధర్మాచరణం శ్రేష్ఠమని శ్రీకృష్ణుడు అర్జునునితో అంటాడు. కర్మప్రాధాన్యమే భగవద్గీతలో చెప్పబడుతుంది. ఐదూళ్ళడిగిన ధర్మరాజును ద్రౌపది తిరస్కారభావంతో చూచినట్లు జనకపత్ని జనకుడిని రాజ్యధర్మం వైపు మళ్ళించే ప్రయత్నం చేసి సఫలీకృతురాలైంది. పుష్పఫలభరితంబైన వృక్షంలాంటివాడు రాజు. తన్నాశ్రయించి జీవించే వారికి భద్రతను కల్పించడం రాజుకు ప్రథమ కర్తవ్యం అని బోధిస్తుంది జనకపత్ని. పేరు తెలియని రాజనీతివేత్త, కుశాగ్రబుద్ధి.

## 40. సుదర్శన - ఓఘవతి

మనువంశంలో దుర్యోధనుడు అనే రాజు ఉండేవాడు. అతడికి స్త్రీ రూపంలో ఉన్న నర్మదానదికి పుట్టిన కూతురు సుదర్శన. అగ్నిహోత్రుని పూజించే సమయంలో ఆమె పరిచర్యలు చేస్తుండేది. అగ్నిదేవుడే ఆమెను మోహించాడు. తన కోరికను తెలియజేశాడు. తన తల్లిదండ్రులు సమ్మతించినవారినే తాను వివాహమాడగలననీ, స్వతంత్రించి వివాహమాడజాలననీ చెప్పింది వినయగుణశీల సుదర్శన. అగ్ని బ్రాహ్మణరూపంలోవచ్చి ఆమెతండ్రిని సుదర్శనను తన కిచ్చి పెండ్లి చేయమని అడిగితే అన్యవర్ణం వాడికి తన కుమార్తెను ఇవ్వనన్నాడు రాజు. అగ్ని యజ్ఞం జరిగే సమయంలో తన తేజాన్ని ఉపసంహరించు కొన్నాడు. బ్రాహ్మణులు అగ్నిని ప్రార్థించారు. అగ్ని ప్రత్యక్షమై తన కోరికను తెలియజేశాడు. రాజు అగ్నికి సుదర్శనను ఇచ్చిపెండ్లి జరిపించాడు.

అగ్నికీ సుదర్శనకు సుదర్శనుడు అనే కొడుకు పుట్టాడు. సుదర్శనుడికి ఒక కొడుకు పుట్టాడు. అతడి పేరు ఓఘవంతుడు. అతడికి ఓఘరథుడు అనే కొడుకు, ఓఘవతి అనే కూతురు పుట్టారు. ఓఘవంతుడు ఓఘవతికి తగిన వరుడి కోసం వెదకి, చివరకు తనతండ్రి అయిన సుదర్శనుడి కిచ్చి పెండ్లి చేశాడు. సుదర్శనుడు (అగ్నికొడుకు) గృహస్థ ధర్మానుష్ఠానంతో మృత్యువును జయిస్తానని ప్రతిజ్ఞచేసి కురుక్షేత్రంలో నివాసమేర్పరచుకొన్నాడు.

సుదర్శనుడు ఓఘవతితో 'అతిథిపూజ పరమశ్రేష్ఠం. అతిథికి సపర్య చేయడం ధర్మం. అతడు ఏది కోరినా చివరకు నిన్ను కోరినా అతడి కోరిక తీర్చాలి అని చెప్పాడు. సుదర్శనుడు అడవిలోకి వెళ్ళిన సమయంలో ఒక అతిథి వచ్చాడు. ఓఘవతి అర్ఘ్యపాద్యాదులతో అతనిని సత్కరించింది. అతడు 'కామాతురుడను' అయ్యానని స్పష్టంగా చెప్పాడు. ఆమె అతనికి ఎన్ని విధాలుగానో నచ్చచెప్పింది, నివారించడానికి

ప్రయత్నించింది. అతిథి పట్టుపట్టడంతో విధిలేక ఒక రహస్యప్రదేశానికి అతనితో వెళ్ళింది. ఆ సమయంలో సుదర్శనుడు తిరిగివచ్చి ఓఘవతిని పిలిచాడు. ఆమెను పలుకవద్దని అతిథి ఆదేశించాడు. సుదర్శనుడు మళ్ళీ ప్రేమపూర్వకంగా పిలిచాడు. ఆమె తనకు ఆతిథ్యమిస్తున్నదని అతిథి పలికాడు. సుదర్శనుడు కోపించలేదు సరి కదా, అదే తనకు పరమ సంతోషమని పలికాడు. ఆ వచ్చిన అతిథి ఎవరో కాదు. ధర్మదేవత. సుదర్శనుని పరీక్షింపదలచి వచ్చానని శెలవిచ్చి నీవు నిజంగా మృత్యువును జయించావని పలికి వెళ్ళిపోయాడు. పతి ఆజ్ఞానుసారం వర్తించిన ఓఘవతి 'భవత్సతియు పవిత్ర అస్ఖలిత చరిత' అని ధర్మదేవతచే ప్రశంసింపబడింది.

సుదర్శనుడు ఆమెను పరీక్షింపదలచి అట్లు చేయమన్నాడా లేక ధర్మదేవత సుదర్శనుని శక్తిని పరీక్షింపదలచినాడా అని సందేహం కలగక మానదు. ఇద్దరూ కృతకృత్యులైనట్లుగా భావింపవలసి ఉంది.

సుదర్శన పిత్రాజ్ఞకు బద్ధురాలు అయితే, ఓఘవతి భర్త ఆజ్ఞను ఔదలదాల్చిన పతివ్రత. ఇరువురూ అస్వతంత్రులే! ధర్మదేవత "ఓఘవతి తపస్సు చేసినదిగా చెప్తూ ఈమె తపస్సులోని సగభాగం 'ఓఘవతి' అనే నదిగా మారి ప్రజలను పవిత్రులను చేస్తుంది. సగభాగంతో నిన్ను సేవిస్తుంది. మీరిరువురూ స్వచ్ఛందంగా, సశరీరంగా ఊర్ధ్వలోకాలకు వెళ్ళవచ్చు" అని పలికి అంతర్హితుడయ్యాడు. భర్తకు సపర్యలు శ్రద్ధతో చేయడం తపస్సుతో సమానం అని తాత్పర్యం.

ఈ కథలో కొంత ప్రశస్తం కాని విషయం ఉంది. ఒకటి ఓఘవతిని సుదర్శనుడి కిచ్చి ఆమె తండ్రి పెండ్లి చేయడం. వయోభేదం, వావివరుస లెక్కకు రాలేదు. రెండవది అతిథిని సంతోషపెట్టమని చెప్పడంలో మితిమీరిన అనౌచిత్యం. ఆ మాట చెప్పేటప్పుడు ఆ వచ్చింది ధర్మదేవత అని తెలియదు కదా. అంటే పతి ఆజ్ఞ అయితే సతి శీలాన్ని అయినా త్యాగం చేయవలసి వచ్చేదా అని ప్రశ్న.

## 41. సులభ

ప్రధన నృపతి వంశంలో జన్మించిన సులభ మహా విజ్ఞాని. ఈమెను వివాహమాడగల వరుడు లేకపోవడం చేత బ్రహ్మజ్ఞాని అయ్యింది.

ఒకసారి సులభ జీవన్ముక్తుడు, ద్వంద్వాతీతుడు అయిన జనక మహారాజును పరీక్షించాలనుకొని బయలుదేరింది. యోగనిష్ఠాదులవలన కృశించిన తన రూపాన్ని మరుగుపరచుకొని సుందర సుకుమారమైన దేహాన్ని పూని ధర్మశాస్త్రసంగోష్ఠి సలుపుతున్న జనకుడి దగ్గరకు వచ్చింది. ఆతని ఆతిథ్యాన్ని స్వీకరించింది.

ఆమె నిజస్వరూపాన్ని జనకుడు పసిగట్ట కలిగాడు. నీవెవ్వరివి, నాతో పని ఏమి అని అడిగాడు. ముక్తిమార్గాన్ని, యోగవిధానాన్ని ముచ్చటిస్తూ జనకుడితో తాను తామరాకు మీద నీటిబొట్టువలె జీవించిదానినని అతడిని పరీక్షించడానికి వచ్చినందుకు మన్నింపుమని వేడుకొంది. యోగమహిమచే అతని అంతరంగంలోకి తొంగిచూడగల మహిమాన్విత సులభ.

ఆ రాత్రి జనకునితో, అతని అమాత్యవర్యులతో అనేక తాత్విక విషయాలను గురించి చర్చించగలిగిన మహానుభావ సులభ.

## వృద్ధకన్య

"పాణిగ్రహణము సేయని వనితకు పుణ్యలోకమప్రాప్యము" అని నారదుడు చెప్తాడు. పూర్వం గర్గ వంశోద్భవుడైన ఖని అనే తపోధనుని కూతురు తపస్సు చేయదలచుకొని బ్రహ్మచర్యాన్ని స్వీకరించి తండ్రి వెంట ఆశ్రమంలోనే ఉండేది. కాలం గడచి ఆమె ముదుసలి అయింది. అప్పుడు యాదృచ్ఛికంగా అక్కడకు వచ్చిన నారదుడు పైవిధంగా పలికి ఏ ఉపాయంతోనైనా తగిన వరుడిని వివాహం చేసుకొమ్మని సూచిస్తాడు.

ఆ తపస్విని తన తపస్సులో సగభాగాన్ని ఇచ్చి గాలవుని కొడుకును వరించింది. మోక్షాన్ని కామించిన ఆమె వివాహం చేసుకొని సంతానాన్ని పొందింది. కాని ఆపైన చిరకాలం జీవించలేదు. ఆ ఒక్కరాత్రి సర్వాలంకారభూషితయై యౌవనప్రాప్తితో ఆ గాలవ్యపుత్రుని సంతోషపెట్టి స్వర్గాభిముఖియై వెళ్ళిపోయింది. అంటే స్త్రీలు అవివాహితులుగా ఉండడం వారికీ, సమాజానికీ కూడా శ్రేయస్కరం కాదని ఆ కాలంలో భావింపపడి ఉంటుంది. ఆ మాట మహర్షితో చెప్పించడంతో అది శంఖంలో పోసిన తీర్థం అయింది! ఇది సర్వసామాన్య సిద్ధాంతం గావడం వలన పేరు పెట్టబడలేదు.

* * *

# 42. స్వాహా

దక్షుని పుత్రిక అయిన స్వాహ, అగ్ని భార్య. అగ్ని వామపార్శ్వము నుంచి ఒక కన్య ఆవిర్భవించింది. ఆమెయే స్వాహ అని కొన్ని పురాణాలలో చెప్పబడింది. స్వాహ అగ్నికి భార్యయైన పిదప అతడిని సేవిస్తూ ఉండేది. అగ్ని ఒకసారి మునిపత్నులను చూచి మోహపరవశుడై, మన్మథతాపాన్ని భరించలేక నిర్జనవనానికి వెళ్ళాడు. అతని బాధను చూడలేక స్వాహాదేవి ఒక్కొక్క మునిపత్నిరూపాన్ని ధరిస్తూ ఒక్కొక్కరోజు అగ్నిని సంప్రీతమనస్కుడిని చేయసాగింది. పతివ్రతాతిలకమైన అరుంధతి రూపాన్ని మాత్రం ఆమె ధరించలేకపోయింది. ఆ విధంగా ఆరుసార్లు ఆమె ఇతర మునిపత్నుల రూపాన్ని ధరించి అగ్నిని సంతోషపెట్టింది. అగ్నివీర్యాన్ని శ్వేతపర్వతం మీద కాంచనభాండంలో భద్రపరచింది. దాని నుండే కుమారస్వామి ఉద్భవించాడని కథనం.

స్వాహాదేవి భర్త సంతోషం కోసం మునిపత్నుల రూపాలను ధరించడంవలన మునిపత్నులు వ్యభిచరించారనే అపవాదు పుట్టింది. మునిపత్నులు తమ భార్యలను విడిచిపెట్టారు. అప్పుడు స్వాహాదేవి ఆ మునుల చెంతకు వెళ్ళి క్షమించమని ప్రార్థించి జరిగిన యథార్థాన్ని వెల్లడించింది. తాను చేసిన తప్పును ఒప్పుకోవడం అనేది అంత తేలిక కాదు. తన అపరాధం వలన మునిపత్నులకు హాని కలగడం అనేది భరించరానిదయింది స్వాహాదేవికి. చేతనైనంత మేరకు చేసిన తప్పును సరిదిద్దుకొనే ప్రయత్నం చేసిన స్వాహాదేవి ధీరవిచారశీల.

లోకంలో సామాన్యంగా తప్పులు చేసి ఆ తప్పులను ఇతరుల మీదకు నెట్టేవారే ఎక్కువ! అందుకు భిన్నం స్వాహాదేవి ప్రవర్తన.

* * *

## 43. రాధ (కర్ణుడి తల్లి)

భారతేతిహాసంలో అన్ని పాత్రలకు ప్రాధాన్యవివక్షను బట్టి న్యాయం చేయవలసి వస్తే అది మరోభారతం అవుతుంది. కొన్నిపాత్రల కథలను సూచించి వదిలివేయవలసి వస్తుంది. ఉదాహరణకు రాధపాత్ర. ఈమె అతిరథుడు అనే సూతుని భార్య. పుత్రసంతానం కావాలి అని తలచేది. అతిరథుడు నదిలో కొట్టుకొని వస్తున్న స్యందనాన్ని చూచి ఇంటికి తీసుకొని వచ్చి తెరచి చూస్తే అందులో సూర్యకాంతితో వెలుగుతున్న బాలుడు కనిపించాడు. వసుషేణుడని అతనికి పేరు పెట్టారు. ఆ కొడుకును భార్యయైన రాధ చేతులలో పెట్టాడు సూతుడు. ఆమె అమితానందంతో ఆబాలుడిని గుండెలకు హత్తుకొన్నది. ఆమె చన్నులలో క్షీరం ఉబికి వచ్చింది. సహజ కవచకుండలాలతో పుట్టిన ఆ బాలుడు కర్ణుడిగా ప్రసిద్ధికెక్కాడు. పరశురాముని శిష్యరికంలో అస్త్రశస్త్ర పాండిత్యాన్ని సంపాదించాడు. తదాదిగా అతడు రాధేయుడు అని పిలవబడ్డాడు. కుంతికి సూర్యుని అనుగ్రహం వలన పుట్టినా అతడు కౌంతేయుడుగా కాక రాధేయుడిగానే ఉండటానికి ఇష్టపడ్డాడు - తన జన్మరహస్యం తెలిసిన తర్వాతకూడా. ఆ పెంచినతల్లికి దూరం కాదలచుకోలేదు అని కుంతితో చెప్పాడు కర్ణుడు. రాధ ప్రేమ అంత గొప్పది.

## 44. దుస్సల

దుర్యోధనాదుల సోదరి. గాంధారి ధృతరాష్ట్రుల కుమార్తె. ఈమెను సింధుదేశపు రాజైన జయద్రథుడు పెండ్లియాడాడు. సైంధవుడనే పేరుతో ప్రసిద్ధికెక్కాడు. అరణ్యవాసంలో పాండవులు చెంతలేని సమయంలో ద్రౌపదిని చూచి బలాత్కరించి ఆమెను తన రథం మీద కూర్చొనబెట్టుకొని పోసాగాడు. పాండవులు ద్రౌపది ఆర్తనాదం విని పరుగున వచ్చి

సైంధవుడిని వెంబడించి ద్రౌపదిని రక్షించారు. ఆ సమయంలో ద్రౌపది నీవు దుస్సల భర్తవు నాకు సోదరుడవు అవుతావు వరసనుబట్టి. నన్ను కోరడం నీకు తగదు అని బుద్ధి చెబుతుంది. భీమసేనుడు సైంధవుడిని చంపబోగా దుస్సలను గుర్తుచేసి ఆమెకు వైధవ్యం కలుగుతుంది కనుక చంపకుండా వదిలి పెట్టమంటుంది. భీమసేనుడు అతనికి శిరోముండనంచేసి బొట్లు పెట్టి అవమానించి పంపించాడు. సైంధవుడికి భీమసేనుడి కోపం కన్నా ద్రౌపది కనికరం ఎక్కువగా బాధించింది. సైంధవుడు ఘోరమైన తపస్సుచేసి ఒక్కరోజు పాండవులను నిలువరించగలిగే వరం పొందాడు. అదే అభిమన్యుడి మృతికి కారణమైంది. సైంధవుడిని చంపి అభిమన్యుని మరణానికి ప్రతీకారం చేస్తాడు అర్జునుడు.

## 45. ఘృతాచి

ఒక అప్సరస. చ్యవనుని పుత్రుడైన ప్రమతికి ఆమె యందు రురుడు అనే కుమారుడు పుట్టాడు. ఇతడు ప్రమద్వర అనే కన్యను వలచి వివాహం చేసుకోదలిచాడు. ఆమెను ఒక పాముకరిచింది. ఆమె విగతజీవి అయింది. రురుడు అడవికి వెళ్ళి తపస్సు చేసి ఆకాశవాణిని విని తన తపస్సులో సగభాగం ప్రమద్వర కిచ్చి బ్రతికించుకొన్నాడు. తదాదిగా కనిపించిన పామునల్లా చంపడం మొదలు పెట్టాడు ఈ ఘృతాచి కుమారుడు. సహస్రపాదుడను వాడు శాపవశమున భుజగమై ఉండగా రురుడు కొట్టబోయాడు. సహస్రపాదుడు జీవహింసతప్పని బోధించినాడు. రురుడు పన్నగసంహారం మానినాడు.

## 46. పులోమ

ఈమె భృగుని భార్య. చ్యవనుని తల్లి. ఈమెను పులోముడు అనే రాక్షసుడు కోరినాడు. కాని ఆమె తండ్రి పులోమను భృగుమహర్షికిచ్చి వివాహం

చేశాడు. ఈమె గర్భవతిగా ఉన్నప్పుడు భర్తపంపగా అగ్నిహోత్రునికి దోహదం చేస్తూ ఉన్నప్పుడు అక్కడకు పులోముడు వచ్చి ఈమె ఎవ్వరని అగ్నిని అడిగాడు. ఈమె పులోమ భృగుని భార్య అని అగ్ని చెప్పాడు. నేను ఈమెను మొదట వరించినవాడిని అని చెప్పి వరాహ రూపం ధరించి ఆమెను ఎత్తుకొని పోయాడు. ఆమె గర్భంలో ఉన్న కొడుకు బైటకు వచ్చి తీక్షణంగా చూడటంతో అసురుడు మృతుడయ్యాడు. ఆమె సుతుడైన చ్యవనుడిని తీసుకొని ఇంటికి వెళ్ళి భర్తకీ విషయం చెప్పింది. చ్యవనుని భార్య సుకన్య మహాపతివ్రత. చ్యవనుని పుత్రుడు దధీచి.

## 47. సుకుమారి

సృంజయుడు అనే రాజు కుమార్తె సుకుమారి. పర్వతుడు, నారదుడు వచ్చినపుడు రాజు ఆమెను వారి సేవకై నియోగించెను. నారదుడామెను వలచి తనకిచ్చి వివాహం చేయమని కోరాడు. పర్వతుడు నారదుని వానరముఖుడవు కమ్మని శపించాడు. సృంజయుడామెను నారదున కొసంగెను. ఆ విధంగా వానరరూపంతో ఉన్న నారదుని సుకుమారి పతిభక్తి కలిగి సేవించింది. కొంతకాలం తర్వాత శాపవిమోచనం అయి నారదుడు ఇంటికి వస్తే ఆతడెవరో అని సుకుమారి పెడముఖం పెట్టింది. అసలు విషయాన్ని ఆమెకు పర్వతుడు తెలియజేశాడు. వానరముఖుడై నప్పుడు కూడా భర్తకు భక్తితో సపర్యలు చేసిన సుకుమారి అనన్య పతివ్రతాధురీణ.

* * *

# 48. పరిశిష్టం

భారతంలో ఉన్నదే ప్రపంచంలో ఉంటుంది. భారతంలో లేనిది మరెక్కడా ఉండదు అనే మాట యథార్థమని ఈ కథలన్నీ చదివాక అనిపిస్తుంది. స్త్రీలు తమ ఉనికిని కాపాడుకోవడానికి గౌరవాన్ని, నిలబెట్టు కోవడానికి, ఆత్మస్థైర్యంతో ప్రయత్నించారని అర్థమౌతుంది.

ఆ కాలంలో దేవతలు, ఋషులు, మానవులు అంతరాలు లేకుండా తరచు కలుస్తుండేవారని తెలుస్తుంది. ఋషుల ఆదేశాలను చక్రవర్తులు సైతం ఆలకించడమేకాకుండా ఆచరణలో పెట్టేవారని తద్వారా వరాలు పొందేవారని భారతం చెప్తుంది. స్త్రీలకు కూడా యజ్ఞయాగాది క్రతువులలో భాగస్వామ్యం ఉండేది. ధర్మరాజు చేసిన రాజసూయ, అశ్వమేధ యాగాలలో పాలుపంచుకొని అవభృథ స్నానంచేసి వైభవోపేత అయింది ద్రౌపది.

మానవులకు ముఖ్యంగా స్త్రీలకు శాపానుగ్రహసామర్థ్యం ఉండేది. అద్భుతశక్తులు కూడా పొందేవారు. ఆ శక్తికి పాతివ్రత్యం ఆధారం అని పలుమార్లు చెప్పబడింది. దమయంతి, ద్రౌపది తమను పట్టుకోబోయిన దురితాత్ములనుండి తమను తాము రక్షించుకోగలిగారు అంటే అది దైవానుగ్రహం చేతనే అనిపిస్తుంది.

సత్యం యొక్క గొప్పదనాన్ని సుస్థాపితం చేసింది భారతం. సత్యశుభదాయకమయ్యు, ధర్తనిస్తారకమయ్యు దైవముండెడిన్ అన్న కృష్ణుడు సంభవామి యుగే యుగే అని సుస్పష్టం చేశాడు. ద్రౌపది వస్త్రాపహరణప్రయత్నం భగ్నం కావడం దైవనిర్ణయమే. అహింస ప్రాధాన్యం కనిపిస్తుంది ఆ యా కథలలో. ఆస్తీకుడు సర్పయాగం ఆపి ఉండకపోతే పాములనేవే లేకుండా పోయేవి. రురుడిని సహస్రపాదుడు ఆపిన కారణం కూడా అదే. జీవహింస కూడదని కొడుకును

పోగొట్టుకున్న తల్లి చెప్పడం ఆదర్శనీయం. జననమరణాలు వారి వారి కర్మలను బట్టి ఏర్పడతాయి. అన్యులను నిందించడం తగదు ఆ మాతృమూర్తి అంటుంది.

కుటుంబవ్యవస్థ పటిష్టంగా ఉండడానికి ఎన్నో ప్రయత్నాలు జరిగాయి. అందులో ప్రముఖ పాత్ర స్త్రీలదే. గృహనీతివిద్యకు గురుస్థానంలో ఉండదగిన వ్యక్తి ద్రౌపది. అత్తకు, భర్తలకు సపర్యలు చేయడమే కాదు. అతిథిమర్యాదలు చేయడంలో కూడా ఆమెది ప్రత్యేకమైన ప్రతిపత్తి. అంతేకాదు పరివారాన్ని, పశుపక్ష్యాదులను కూడా చక్కదిద్దుకొనే నేర్పు ఉండేది ద్రౌపదికి. స్త్రీలకు వివాహం, సంతానం విధిగా ఉండాలని నారదాదిమునులు చెప్పడం గమనార్హం. ఏ కారణం చేతనైనా భర్తలవలన సంతానం పొందలేకపోతే దైవసహాయాన్ని అర్థించేవారు. కుంతి, మాద్రి ప్రముఖ ఉదాహరణలు. దేవరన్యాయం తప్పుకాదు ఆ కాలంలో. సత్యవతి కురువంశం కొనసాగడానికి పద్ధతినే ఆశ్రయించి భర్తృవిహీనలైన అంబిక, అంబాలికలకు వ్యాసుని వలన పుత్రోదయం కలుగజేసింది. ఆ ధృతరాష్ట్రుడు, పాండురాజు వలననే కురువంశం నిలిచింది. వారి పుత్రుల మధ్య ఏర్పడిన వైరమే కురుక్షేత్రయుద్ధానికి కారణమైంది. సత్యవతి, కుంతి తీసుకొన్న స్వతంత్ర నిర్ణయాలు ఆనాటి స్త్రీల ధైర్యానికి నిదర్శనాలు. ఎందరో స్త్రీలు పరిస్థితులకు తలఒగ్గి నిలబడినవారే.

గాంధారి ద్రౌపది పుత్రులను కోల్పోయి దుర్భర దుఃఖాన్ని పొంది కూడా నిబ్బరంగా నిలిచినవారే. సుభద్రను ఓదారుస్తూ జననమరణాలకు దుఃఖించడం ప్రాజ్ఞుల లక్షణం కాదంటాడు కృష్ణుడు – భగవద్గీతలో అదే చెప్పబడింది.

వివిధ మనస్తత్వాలు కలిగిన స్త్రీలు మహాభారతంలో కనిపిస్తారు. భర్తలను వృద్ధులైనా, కురూపులైనా, ఇతర స్త్రీలను కోరుకున్నవారైనా

సేవించవలసిందే అని కట్టుదిట్టంగా చెప్పారు నాటి ఋషులు. పురుషులకు బహుభార్యాత్వం ఎంత మాత్రం తప్పుకాదు. ద్రౌపది, సుభద్ర, ఉలూచి, చిత్రాంగద సఖ్యంగా గడిపారని (అశ్వమేధయాగ సందర్భంలో కలిసినపుడు) చెప్పబడింది. కాని స్త్రీలకు బహుభర్తృత్వం నిషేధింపబడింది. అందుచేతనే ద్రౌపది అన్ని అగచాట్లు పడింది. దురదృష్టవశాత్తు ఆమె అతిలోకసౌందర్యం ప్రతిపురుషుడికీ అందుకోదగిందిగా కనబడింది. ఆమె జీవితంలో అదృష్టమేమిటంటే భగవత్స్వరూపుడైన కృష్ణుడు అండగా నిలబడటం.

వరాలు, శాపాలు, పశుపక్ష్యాదులు మానవభాషలో మాట్లాడటం, మరణించినవారు అర్జునుడు, ప్రమద్వరలాగా పునర్జీవితులు కావడం, యౌవనాన్ని యయాతిలాగా కోల్పోవడం తిరిగి పొందడం సామాన్యంగా జరిగినట్లు చెప్పబడింది. భారతంలో చ్యవనుడు, సుదర్శనుడు కూడా వారి భార్యల వలన ఈ ధన్యతను పొందినవారే.

నదులు స్త్రీరూపాన్ని ధరించడం సురనదితో ప్రారంభమౌతుంది. గంగాశంతనులకు భీష్ముడుదయించడం అందుచేతనే జరిగింది. నర్మదలో సగభాగం నది, సగభాగం వనితారూపం ధరించడం. గంగ శాపం వలన అంబ తపస్సులో సగభాగం నది కావడం సాధ్యమైంది ఆ కాలంలో. భారతం ఐదువేల సంవత్సరాల క్రితం వ్రాయబడింది అని ఒక సిద్ధాంతం. ఆనాటి సాంఘిక ఆచార వ్యవహారాలను అర్థం చేసుకొనే ప్రయత్నం చేయాలి గాని ఈనాడు మనం ఆచరిస్తున్న సామాజికవ్యవస్థను బట్టికాదు. స్త్రీలను అత్యున్నత స్థానంలో నిలబెట్టాలన్న ప్రయత్నం ఆనాటి నుంచి జరుగుతూనే వస్తుంది. స్త్రీ పురుషునితో సమానం అనుకోవడం తప్పు. సృష్టికి మూలం స్త్రీ కనుక పురుషుని కంటె ఒకమెట్టు పైనే ఉండాలి.

**ఇతి శివమ్**